Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

ప్రతిష్టాత్మకంగా నెల్లూరులో నిర్మించిన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా 8 పేజీల ప్రత్యేకానుబంధాన్ని ఈ వారం జమీన్‌రైతు సంచికతోపాటు ఇస్తున్నాం.


- సంపాదకుడు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీన్‌రైతు

సంపుటి: 83 • సంచిక: 42 • 18-10-2013 శుక్రవారం • పేజీలు: 24 • విడి ప్రతి: రూ.5/-



సిఎం చేతిలో తోలుబొమ్మ అశోక్‌బాబు!

ఏపిఎన్జీఓ అధ్యక్షుడి హోదాలో సమైక్యాంధ్ర ఉద్యమం చిచ్చు రగిల్చి రాత్రికి రాత్రి పెద్ద నాయకుడిగా వెలుగులోకి వచ్చాడు అశోక్‌బాబు. ఉద్యమం కోసం జీతాలే కాదు, జీవితాలూ త్యాగం చేయడానికి సిద్ధమని ఉత్తరకుమార ప్రగల్భాలు పలికాడు. మంత్రుల మీద, తెలంగాణ వాసుల మీద అవాకులు చవాకులు పేలాడు. రెండు ప్రాంతాల ప్రజల మధ్య కొట్లాట తెచ్చే ప్రమాదాన్ని సృష్టించాడు. కానీ, ఉద్యమ కోరికలు ఏవీ తీరకుండానే జావకారి పోతున్నాడు. ఒకటి రెండు రోజులలోనే ఎన్జీఓల సమ్మె విరమణ ప్రకటన చేయబోతున్నాడు. ఈ మార్పుకు కారణం – ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పదవికి ఎసరు వచ్చే ప్రమాదం కలగడం. ఉద్యమ తీవ్రతకు భయ

కొరవ 14వ పేజీలో

విభజన ఖాయం!

ఆరు నూరైనా నూరు ఆరైనా తెలంగాణ విభజన జరిపి తీరుతామని కేంద్రం స్పష్టమైన సంకేతం పంపింది. అందరికీ అర్థమైపోయింది. అందుకు వారు పెద్ద సమయం కూడా తీసుకోవడం లేదు. జనవరి నెలాఖరు లోపల రెండు రాష్ట్రాల శాసనసభలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సోనియాగాంధీ అయితే, డిసెంబర్ నెలను గడువుగా నిర్ణయించిందని వినికిడి. ఈ లోపల అసెంబ్లీ ఆమోదం లేదా అభిప్రాయ సేకరణ, రాష్ట్రపతి ఉత్తర్వులు, పార్లమెంట్‌లో బిల్లు వంటి చట్టపరమైన ప్రక్రియలన్నీ పూర్తి చేయడానికి అధికారులు రాత్రి పగలు పని చేస్తున్నారు.


ఈ విషయంలో ఒక్క కెసిఆర్‌తో మాత్రమే కేంద్ర నాయకత్వం సంప్రదింపులు జరుపుతున్నదని తెలుస్తున్నది. ముఖ్యమంత్రిని దాదాపుగా ప్రక్కన పెట్టేశారు. చాలామంది కేంద్ర నాయకులు ఆయన ఫోన్ కాల్స్‌ను సైతం తీసుకోవడం లేదు. సోనియా మనసు తెలిసి కూడా విభజన పట్ల ముఖ్యమంత్రి విరుద్ధ ధోరణి అవలంభించడం ఢిల్లీ పెద్దలందరికీ కోపం తెప్పించింది. అందువల్ల వారు కెసిఆర్ మీద అధికంగా ఆధారపడుతున్నారు. హైదరాబాద్ నగరాన్ని ఏమి చేయాలి అన్న ఒక్క అంశం మీదనే కెసిఆర్‌కు, కేంద్రానికి చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. టిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తే హైదరాబాద్‌ను తెలంగాణ రాజధానిగా ప్రకటిస్తామని చెప్తున్నారట. అందుకు కెసిఆర్ సిద్ధంగా వున్నాడు. అయితే ఆయన పార్టీలో దీనిపై భేదాభి

కొరవ 14వ పేజీలో

ఐఎఎస్ బృందం నివేదిక!

జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల ఏర్పాటులో కేంద్రం ఇచ్చిన వాగ్దానాలు ఏమిటి, వాటిని ఎంతవరకు అమలు చేసింది, కొత్త రాజధానుల ఏర్పాటులో వారెదుర్కొన్న సవాళ్లు ఏమిటి వంటి అంశాలను అధ్యయనం చేయడానికి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి మన రాష్ట్రానికి చెందిన ఒక ఐఎఎస్ అధికారుల బృందాన్ని ఆయా రాష్ట్రాలకు పంపాడు. వారు వారం రోజులపాటు అన్ని వివరాలూ క్షుణ్ణంగా సేకరించి, ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చారు. దీన్ని చేతిలో పెట్టుకొని, రాష్ట్ర విభజన వల్ల వచ్చే సమస్యలను ప్రజలకు వివరించి, తెలంగాణ ఏర్పాటును అడ్డుకోవాలన్నది ముఖ్యమంత్రి పథకం. కేంద్రం ఏర్పాటు చేసిన మంత్రుల సంఘానికి కూడా ఈ

కొరవ 14వ పేజీలో





[శాస్త్రవేత్తలకు అభినందన]

ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లను గడగడ వణికించిన పైలిన్ తుఫాను పెద్దగా ప్రాణ నష్టం కల్గించ కుండా సాఫీగాసాగి పోయింది. దాదాపు 90 లక్షల మంది ప్రజలు నివసించే గ్రామాలు, పట్టణాలను ప్రభావితం చేసిందీ తుఫాను. మూడు రోజుల పాటు తూర్పు తీరం మొత్తాన్ని గడ గడ వణికించింది. కోస్తా జిల్లాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ సైతం తుఫాను రక్షణ చర్యల కోసం సమీక్షా సమావేశాలు జరపవలసి వచ్చిందంటే, దీని తీవ్రత ఎంత భయానకంగా వుండిందో అర్థం చేసుకోవచ్చు.

1999లో ఇదే మాదిరి తుఫాను ఒరిస్సా తీరాన్ని తాకింది. అదొక పీడ కల. దాదాపు 15 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల ఎకరాలలో పంట నాశనమై పోయింది. విద్యుత్, రోడ్లు, కమ్యూనికేషన్ల వ్యవస్థ లన్నీ ధ్వంసమై పోయాయి. ప్రకృతి వైపరీత్యాన్ని నిస్సహాయంగా భరించారు ప్రజలు. ఆ చేదు అనుభవాన్ని మన శాస్త్రవేత్తలు ఒక సవాలుగా తీసుకొన్నారు. తుఫాన్ల గమనాన్ని, తీవ్రతను అంచనా వేయడానికి తమ శాస్త్ర పరిజ్ఞానాన్ని వినియోగపెట్టారు. తీరానికి నాలుగు వందల కిలోమీటర్ల దూరం వరకు సముద్రం మీద తేలియాడే బెలూన్ల వంటి పరికరాలు అమర్చారు. రోదసీలోని ఉపగ్రహాలలో ప్రత్యేక పరికరాలు బిగించి పెట్టారు. అవి పంపే సమాచారాన్ని విశ్లేషించడానికి సూపర్ కంప్యూటర్ వ్యవస్థ నెలకొల్పారు. దాదాపు 900 కోట్ల రూపాయల పెట్టుబడితో చేసిన ఈ ఏర్పాట్లన్నీ పైలిన్ తుఫాను గమనాన్ని ఖచ్చితంగా నిర్ధారించడానికి ఎంతగానో ఉపకరించాయి. అమెరికా నావీ, బ్రిటన్‌లోని ట్రోపికల్ సైక్లోన్ పరిశోధనా సంస్థలు పైలిన్ తుఫాను సూపర్ సైక్లోన్ అని ప్రకటించాయి. దాదాపు 300 కిలోమీటర్ల ప్రచండ వేగంతో గాలులు వీస్తాయని, భారత తీరాన్ని ఇప్పటి వరకు తాకిన తుఫాన్లన్నిటికంటే భయంకరమైనదని ప్రకటించాయి. అయితే ఆ అంచనాతో మన శాస్త్రవేత్తలు ఏకీభవించ లేదు. ఇది సివియర్ సైక్లోన్ తప్ప సూపర్ సైక్లోన్ కాదని, గాలుల వేగం 200 కిలోమీటర్లు దాటక పోవచ్చునని అంచనా వేశారు. చివరకు మన శాస్త్రవేత్తల లెక్కే సరైనదని తేలింది.

మన శాస్త్రవేత్తలు గంట గంటకూ తుఫాను గమనాన్ని ఖచ్చితంగా తేల్చి చెప్పడంతో సహాయ, సంరక్షణ చర్యలు చేపట్టడం సులువుగా మారింది. ఒరిస్సా, ఆంధ్ర రాష్ట్రాలు దాదాపు 12 లక్షల మంది ప్రజలను తీర ప్రాంతం నుంచి తరలించాయి. దానితో ఆశ్చర్యకరమైన తీరులో ప్రాణ నష్టం నివారింపబడింది. మన రాష్ట్రంలో ఒకే ఒక ముదుసలి గోడ కూలి మరణించింది. ఒరిస్సాలో కూడా మరణాల సంఖ్య పదిహేను మాత్రమే. ఎక్కడ 15 వేలమంది చావు, ఎక్కడ 15 మరణాలు. 1999 తుఫానుకు, నేటి తుఫానుకు మన శాస్త్రవేత్తలు సాధించిన ప్రగతి నిజంగా అబ్బురమైనది.

జమీన్‌రైతు

చిత్తశుద్ధి వుంటే, సరైన ప్రోత్సాహం వుంటే మన అధికారులు, శాస్త్రవేత్తలు ఎంతటి సవాలునైనా సమర్థంగా ఎదుర్కోగలరని నిరూపించడానికి ఇదొక ఉదాహరణ. ఇటీవలే జరిగిన కేదార్‌నాథ్ వరద భీభత్సంలో ప్రభుత్వాలు చేష్టలుడిగి, చేవ చచ్చి నిస్సహాయంగా నిలబడి పోవడం వల్ల దాదాపు 5వేల మంది అమాయక పౌరులు ప్రాణాలు పోగొట్టుకొన్నారు. పైలిన్ తుఫాను విషయంలో చూపిన ముందు జాగ్రత్త అక్కడా చూపి వుంటే ఆ దారుణ విషాదం తప్పి వుండేది.

శాస్త్రవేత్తల బాధ్యత, సమర్థత తుఫాను గమనాన్ని అంచనా కట్టడంలో మాత్రమే. తుఫాన్లు అరికట్టే లేదా అడ్డగించే శక్తి మానవుడికి ఇంకా లభించలేదు. శాస్త్రం ఎంత ప్రగతి సాధించినా ప్రకృతి ముందు దిగదుడుపే. అది అగ్ని పర్వతమైనా, తుఫానైనా, హరికేన్ అయినా, వరద అయినా, అరణ్య దహనమైనా, ఉప్పెన అయినా వేరొకటి అయినా మనిషి చేయగల్గింది, ఆ ప్రమాదాల నుంచి తమను తాము కాపాడుకోవడం ఎట్లా అన్న ఆలోచన మాత్రమే. ఆ కృషిలో భారతీయ శాస్త్రవేత్తల ప్రతిభను మనసారా అభినందిస్తున్నాము.

జనవాక్కు

హైదరాబాద్‌పై స్పష్టత ఏది?

రాష్ట్ర విభజన వాస్తవమై పోయింది. కొత్తగా ఏర్పడే తెలంగాణ పాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు పదేళ్లపాటు ఉమ్మడి రాజధానిగా కేంద్ర ప్రభుత్వం నిర్ధారించిన హైదరాబాద్ మహానగర పాలనా వ్యవస్థ గూర్చి పొంతనలేని ప్రకటనలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి గానీ, కేంద్ర మంత్రివర్గానికి గానీ ఈ విషయమై స్పష్టమైన అవగాహన మాత్రమే కాదు కనీసమైన ధ్యాస కూడా లేకపోవడం ఉమ్మడి గందరగోళానికి కారణం. ఉమ్మడి రాజధానిని గూర్చి ఢిల్లీలో దిగ్విజయ్‌సింగ్ స్పష్టీకరించిన తీరు ఇంకాస్త గందరగోళపర్చింది. ఉమ్మడి రాజధాని ప్రకటన కొత్తది కాదు. జులై నెలలోనే కాంగ్రెస్ అధిష్టానం ఆవిష్కరించిన ప్రతిపాదన ఇది. ఇదే విషయం తెలంగాణ నోట్‌లోనూ ఉంది. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ పదేళ్లు కొనసాగే కాలంలో కేంద్ర ప్రభుత్వం పాలించాలని భావించినట్లయితే కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడం తప్పనిసరని అందరూ అర్థం చేసుకోవాలి.

కె.తిరుమలరావు కావలి

దినేష్‌రెడ్డికి తగదు!

నెల్లూరీయుడు ఇటీవలే డిజిపిగా పదవీ విరమణ చేసిన వేణుంబాక దినేష్‌రెడ్డి తన పదవీకాలం ఇంకా పొడిగించలేదన్న దుగ్ధతో ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డిపై అవాకులు చెవాకులు పేలారు. తాను నెల్లూరు జిల్లాలో పుట్టినా హైదరాబాద్ అంటేనే ఇష్టమని, సీమాంధ్రుల ఉద్యమాన్ని అణచి వేయాలని ప్రయత్నిస్తే కిరణ్‌కుమార్‌రెడ్డి అడ్డు తగిలాడని మాట్లాడడం బాధించింది. అధికార రహస్య చట్టాన్ని ఉల్లంఘించి డిజిపి మాట్లాడడం సమంజసంగా లేదు. దినేష్‌రెడ్డి నెల్లూరు వాడని ప్రత్యేక అభిమానం ఉండింది. ఆయనకు ఉండిన పదవీ వ్యామోహ యావ చూశాక బాధ కల్గుతుంది. మాతృభూమిపై ఆయనకు మమకారం లేకపోవడం వింటేనే కలచి వేస్తుంది.

పి.అరుణకుమారి నెల్లూరు

ప్రజలంటే అంత చులకనా?

సమైక్యాంధ్ర కోరుతూ సీమాంధ్రులు 70 రోజులు పైబడి రకరకాల ఉద్యమాలు చేస్తున్నారు. బస్సులు, రైళ్లు లేకున్నా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయినా సహిస్తున్నారు. చీకట్లో గడపాల్సి వచ్చినా అసలు పట్టించుకోవడం లేదు. కానీ ప్రజల మనస్సులోని బాధను కాంగ్రెస్ అధిష్టాన పెద్దలు పట్టించుకోక పోవడంతోపాటు దిగ్విజయ్‌సింగ్, షిండేలు ఢిల్లీ నుంచి రోజుకో పనికిమాలిన ప్రకటన చేయడం భావ్యం కాదు. సీమాంధ్రుల సహనాన్ని అంత తేలిగ్గా తీసుకోవద్దు. కాంగ్రెస్ పార్టీకి రేపటి ఎన్నికల్లోనే కాదు భవిష్యత్తులోనూ అసలు భవిష్యత్తు లేకుండా చేస్తారు.

దోగిపర్తి సత్యం అల్లూరు

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

22-10-1943
పేజీలు:6 వెల: 0-1-6అణా

నెల్లూరు ముచ్చట్లు

నా కలం

స్థలం లేదు కొద్దిగా వ్రాసి యివ్వమన్నాడు సంపాదక మహాశయుడు. నా కలాన్ని కురుగంటి రాఘవరెడ్డి ఉపన్యాసాన్ని, న్యాపతి నారాయణమూర్తి గారి తాంబూల చర్వణాన్ని అడ్డుపెట్టడం మంచి పని కాదు. సరే ఏం చేస్తాం?

మాధవరావు నాయుడు

ధాన్యం కొనుగోలు ఆఫీసరు నాయుడు గార్ని ట్రాన్సఫరు చేశారు. ప్రభుత్వం గుడ్డిది. చెమిటిది అంటుంటాం. కాదండోయ్ కడుపంతా కళ్లున్నట్లున్నది దీన్ని బట్టి చూస్తే?

ఓ జగ్గయ్యా, ఓ చంద్రయ్యా, ఓ శెట్టీ! ఇంకెవరయ్యా ఇంత నిర్భయంగా మీకు సహాయం జేసే గుండెలు దీసిన బంటు!

భగవంతుడు ఎంత ఓర్చలేని వాడండి!

కట్టెల కరవు

ఈ కరవు విపరీతంగా వుంది. దొడ్లలో బొత్తుగా కట్టెలేదు. మొన్న గుండు రు 1 వరకు అమ్మింది. 21తేది కొంత కట్టె వచ్చింది. యేడు అణాలకే అమ్మారు. గాని కుస్తీ పట్టిన వారికే దొరికింది. కొంత దాచి హెచ్చు యిచ్చిన వారికి రహస్య విక్రయం జరిగిందట. అధికార్లు స్పెషల్ కన్ను వేయకపోతే యిదొక ఉపద్రవం వచ్చేట్లున్నది.

50 ఏళ్ల క్రితం ఈవారం

18-10-1963
పేజీలు: 12 వెల: 0-20 న.పై

పల్లెలు

కావలి కాల్వకు తొందరపడి పునాది!

గౌరవరం పంచాయతీ నిర్మించిన పాఠశాల నూత్న భవనానికి ఇరిగేషన్ విద్యుచ్ఛాఖామాత్యులు ఏసి. సుబ్బారెడ్డి 11తేది ప్రారంభోత్సవం గావించారు.

సభకు జిల్లా పరిషత్తు అధ్యక్షుడు నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. కావలి సమితి అధ్యక్షుడు వేమిరెడ్డి అయ్యప్పరెడ్డి మంత్రికి, ఆహూతులకు స్వాగతం చెప్పారు.

ఈ సందర్భంలో మంత్రి సుబ్బారెడ్డి గారు మాట్లాడుతూ కావలి కాల్వ అసంపూర్ణ పథకం (స్పిల్ ఓవర్ స్కీము) క్రింద నాల్గవ ప్రణాళికలో తప్పకుండా చేయాలనే సంకల్పంతో ఉన్నామని, ఇంతకు మునుపు దానికి బలవంతం మీద పునాదిరాయి వేయడం జరిగిందని, అప్పుడు దానిని సర్వే చేయలేదని ఇప్పుడు పెద్ద ఇంజనీర్ల ఆధ్వర్యాన సర్వే జరుగుతున్నదని, ఎస్టిమేట్లు పూర్తి కాగానే తానే ఢిల్లీకి పోయి కేంద్ర నీటిపారుదల విద్యుచ్ఛక్తి కమిషన్ చేత దాన్ని మంజూరు చేయించి నాల్గవ ప్రణాళికలో పూర్తి అయ్యేట్లు చేస్తానని చెప్పారు.

దగదర్తి కాల్వను పొడిగించ వలసిందనే కోర్కెను ప్రస్తావించి, కావలి కాల్వ వచ్చేటప్పుడు అది అనవసరమని తన అభిప్రాయమన్నారు. అయినా ఇంజనీర్ల అభిప్రాయం తీసుకుంటానని ఏసి చెప్పారు. భవనాల గ్రాంట్ల విషయంలో చంద్రశేఖర్‌రెడ్డి కోర్కెను ప్రస్తావించి, బిల్డింగులకు ఇక మీదట ప్రభుత్వ గ్రాంటు వుండదు అని స్పష్టంగా చెప్పారు ఏసి.

నెల్లూరు ముచ్చట్లు

రాజకీయాల్లోకి వస్తా!

నెల్లూరులో వదాన్యునిగా పేరుగాంచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తాను రాజకీయాల్లోకి వస్తానని చెప్పకనే చెప్పారు. కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లోని ప్రత్యేకతలను మీడియాకు చూపించను 15వ తేది సాయంత్రం ఇక్కడ సమావేశం ఏర్పాటు చేసిన ఆయన్ను ఒక విలేకరి మీరు రాజకీయాల్లోకి వస్తారని ప్రచారం జరుగుతుందని ప్రశ్నించగా జవాబుగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానన్నారు. అయితే పరోక్ష రాజకీయాలు అంటే రాజ్యసభకు వెళ్లను అభ్యంతర మేదీ ఉండదు కదా అని చమత్కరించారు. నెల్లూరులో తొలిసారిగా మీడియాతో మాట్లాడిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాటలశైలే విభిన్నంగా ఉంది. ఏ విషయాన్నీ ఆయన దాచి మాట్లాడే ప్రయత్నమే చేయలేదు.

కిరణ్ నేతృత్వంలోనే ఎన్నికలకు వెళ్తాం!

చాలా రోజుల తర్వాత దసరా పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు వచ్చారు. 14వ తేది తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో తనకు ఎటువంటి విబేధాలు లేవని 2014లో అసెంబ్లీ ఎన్నికలను సైతం కాంగ్రెస్ పార్టీ ఆయన నేతృత్వంలోనే వెళ్తుందన్నారు. రాష్ట్రం సమైక్యంగా ఉండాలని కోరుకొనే వారిలో తానూ ఒకడినని, తెలంగాణ బిల్లు అసెంబ్లీకి వస్తే సీమాంధ్ర ప్రాంత ప్రజాప్రతినిధులంతా కలసి వీగిపోయేలా చేస్తామన్నారు.

రామనారాయణరెడ్డిలేని సమయంలో ఆయన ఇంటి ముట్టడికి ప్రయత్నించిన ఎన్జీఓలు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, వివిధ ప్రజా సంఘాల నేతలు ఇంట్లో ఉన్న సమయంలో ఆ ప్రయత్నం చేయకపోవడం ఏమిటన్నది నెల్లూరీయులను వేధిస్తున్న ప్రశ్న.

వివేకాను నిలదీసిన మహిళలు!

నెల్లూరు రాజరాజేశ్వరమ్మ గుడిలో వివేకానందరెడ్డి పేరు చెప్పి దౌర్జన్యం చేసే వారెక్కువ. దసరా రోజు వేల మంది భక్తులు క్యూలైన్లలో నిల్చొని ఉండగా వీఐపిలంటూ తమ కిష్టులను వివేకా అనుచరులు గర్భాలయంలోనికి పంపుతుండగా మహిళలు తిరగబడ్డారు. అక్కడే ఉండిన వివేకాను గుడిలో ఏమిటయ్యా మీ హంగామా అని నిలదీసే సరికి ఊహించని ఈ పరిణామానికి ఆయన తత్తరపోయారు.

కుల సంఘం వివాహ వేదికకు కలెక్టర్!

బలిజ, కాపు, తెలగ కులస్తులు నెల్లూరు టౌన్‌హాల్‌లో నిర్వహించిన వివాహ పరిచయ వేదికకు జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ హాజరవ్వడం విమర్శకు దారి తీసింది. కులాభిమానమున్నా బహిరంగంగా ఇటువంటి కార్యక్రమాలకు గతంలో జిల్లాలో పనిచేసిన ఏ కలెక్టర్ హాజరుకాక పోవడం ఈ సందర్భంగా చర్చనీయాంశమయ్యింది.

పై-లిన్ తుఫాన్!

బంగాళాఖాతంలో ఉత్తర అండమాన్ ప్రాంతంలో పుట్టి ఒడిశాకు వెళ్లి పై-లిన్ తుఫాన్ నెల్లూరును కరుణించిందనాలి. ఈ తుఫాన్ ప్రభావం మన జిల్లా మీద కూడా ఉంటుందనే ఆలోచనలో కలెక్టర్ శ్రీకాంత్ అప్రమత్తమయ్యి తీర ప్రాంత మండలాలతోపాటు వరద ముంపుకు గురయ్యే మండలాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా నిషేధించారు. తీర ప్రాంతంలో సముద్రం అల్లకల్లోలంగా మారడం మినహా తుఫాన్ సింహపురికి ఎటువంటి నష్టం కల్గించకుండా వీడి వెళ్లడంతో అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఉద్యమంలోనే ఉన్నాం!

జిల్లాలో సమైక్యాంధ్ర ఉద్యమాన్ని ఉధృతంగా నడిపి గత కొన్ని రోజులుగా దీనికి దూరంగా ఉన్న అడిషినల్ జెసి చల్లా పెంచలరెడ్డి, డిఆర్వో రామిరెడ్డి 11వ తేది విధులకు హాజరయ్యారు. పై-లిన్ తుఫాన్ ప్రకటన రావడం వల్ల అత్యవసరంగా విధులకు హాజరయ్యామని తాము సమైక్యాంధ్ర ఉద్యమబాటలోనే ఉన్నామని వారిద్దరూ స్పష్టం చేశారు.

ఆకట్టుకొంటున్న ఈఫిల్ టవర్!

దసరా ఉత్సవాలను పురస్కరించుకొని నెల్లూరు రాజరాజేశ్వరమ్మ దేవస్థానం వద్ద విద్యుత్ అలంకరణల్లో భాగంగా రోడ్డుపై పెట్టిన ఈఫిల్ టవర్ నమూనా అందర్నీ ఆకట్టుకొంటుంది.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ్ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 1068110110004 23లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190

ఎర్ర బస్సులు కదిలాయి!

సమైక్యాంధ్ర సమ్మెలో భాగంగా ఆగష్టు 12వ తేది అర్ధరాత్రి నిలిచిపోయిన ఆర్టీసి బస్సులు అక్టోబర్ 12వ తేది డిపోల నుంచి జూలు విదిలించి కదిలాయి. 832 బస్సులు, 4700 మంది సిబ్బంది విధులకు హాజరు కావడంతో ఎపిఎస్ ఆర్టీసి కార్యాలయాలు బస్సు డిపోలు కళకళలాడాయి. ఈ నెలలో చాలా తక్కువ కరెంట్ ఖర్చయ్యేలా ఎల్‌ఈడి టెక్నాలజీతో దీన్ని ఏర్పాటు చేయడం విశేషం.

వివేకా వైఖరిపై కలెక్టర్‌కు శ్రీధర్ ఫిర్యాదు!

రోడ్లు, డ్రైనేజిల ప్రారంభోత్సవ శిలాఫలకాలపై మాజీ మేయర్ భానుశ్రీ పేరులేదని కార్పొరేషన్ అధికారులకు రూరల్ ఎమ్మెల్యే శ్రీముఖాలు ఇప్పించడంపై వైకాపా రూరల్ నియోజకవర్గం కన్వీనర్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీకాంత్‌ను కలసి ఒక వినతి పత్రం అందించారు. ఏ హోదాలో ఆమె పేరు శిలాఫలకంలో వేయాలో వివేకా వివరించాలని, ప్రోటోకాల్ వ్యవహారంపై కలెక్టర్ శ్రీకాంత్ 19వ తేదిలోపు చర్యలు తీసుకోకుంటే గాంధీగిరిలో ఆ శిలాఫలకాల వద్ద ఉద్యమం చేస్తామన్నారు. భానుశ్రీపై వివేకానందరెడ్డికి వర్ణించలేనంత అభిమానం ఉంటే ఆయన దోచుకొన్న ప్రజాధనంతో భానుశ్రీ మహల్, భాను మందిరాన్ని కట్టుకోవాలని శ్రీధర్‌రెడ్డి సలహా యిచ్చారు.

అన్నా వాళ్ల నాలుకలు కొయ్!

తన సోదరుని మోసాలను ప్రశ్నించిన వారిని నాలుకలు కోస్తానంటున్నాడని ఆయనకు చేతనైతే తెలంగాణ విభజన చేసిన సోనియాగాంధీ, దిగ్విజయ్ సింగ్ నాలుకలు కోయాలని రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డికి ఆయన సోదరుడు ఆనం జయకుమార్‌రెడ్డి సలహా పెళ్లిళ్లు పబ్బాలుండడం బస్సులు కదలడంలో ప్రజల మోములు వికసించాయి. ఆర్టీసి సమ్మెమూలంగా జిల్లాలో ఆ సంస్థ 50 కోట్ల రూపాయలు నష్టపోయింది.

సోమిరెడ్డి ఎక్కడ?

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంచి ఉద్యమకారుడు. సారా వ్యతిరేక పోరాటంలో వందల మైళ్లు పాదయాత్ర చేసి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి కూడా అయ్యారు. కానీ సమైక్యాంధ్ర ఉద్యమంలో మాత్రం జిల్లాలో పాల్గొనలేదు. ఇదే విషయమై సమైక్యాంధ్ర విద్యార్థి ఐకాస జిల్లా కన్వీనర్ డి.అంజయ్య నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమిరెడ్డి నెల్లూరులో ఉద్యమంలో పాలు పంచుకోకపోయినా సమైక్యాంధ్రపై హైదరాబాద్‌లో గట్టిగానే గళం విప్పుతున్నాడు.

ఇచ్చారు. 12వ తేది లక్ష్మీనరసింహపురంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ విభజనపై కాంగ్రెస్ పార్టీలో స్పష్టత లేదు. ప్రజలకు మాత్రం అసెంబ్లీలో తీర్మానం వ్యతిరేకిస్తామని మోసగించడం ఏమిటి? మోసపూరిత మాటలు చెబుతుంటే ప్రజల మనిషిగా నేను ప్రశ్నిస్తే నాలుక కోస్తానని హెచ్చరిస్తారా? మీకు దమ్ముంటే పదవులను పట్టుకొనే వేలాడకుండా ఉద్యమంలో పాల్గొనాలని సోదరులకు జయకుమార్‌రెడ్డి సలహా ఇచ్చారు.

నెల్లూరులో మాజీ డిజిపి!

మాజీ డిజిపి వేణుంబాక దినేష్ రెడ్డి 12వ తేది సతీసమేతంగా నెల్లూరులోని రాజరాజేశ్వరమ్మను సందర్శించారు. ప్రత్యేక చండీహోమ నిర్వహణలో పాల్గొన్నారు. మీడియా ఈ కార్యక్రమాన్ని కవర్ చేయను అనుమతించలేదు.

ఎమ్మెల్యేల ప్రమాణ పత్రాలు స్వీకరణ

సమైక్యాంధ్రకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యేలు వివేకానందరెడ్డి, శ్రీధర్ కృష్ణారెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని ఎన్జీఓ హోమ్‌లో ప్రమాణ పత్రాలపై సంతకాలు చేసి ఇచ్చారు. సమైక్యాంధ్ర కోసం ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని లేకుంటే ప్రజలు క్షమించరని ఈ సందర్భంగా ఎపి ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.రవీంద్రబాబు స్పష్టం చేశారు.

పెంచలకోనలో కలెక్టర్, ఎస్పీ!

జిల్లా కలెక్టర్ శ్రీకాంత్, ఎస్పీ రామకృష్ణ 12వతేది పెంచలకోనలోని నృసింహుని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ ఒక్కరే, ఎస్పీ సతీసమేతంగా ఈ పూజల్లో పాల్గొన్నారు.

సిఎం హామితోనే విద్యుత్ సమ్మె ఆపాం!

ప్రజలు బాగా ఇబ్బంది పడుతున్నారని గమనించాం; దీనికితోడు ముఖ్యమంత్రితో జరిగిన చర్చల్లో స్పష్టమైన హామీలు రావడంతోనే విద్యుత్ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు విద్యుత్

కొరవ 14వ పేజీలో

ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా...
AMMA FURNITURE MALL
అమ్మ ఫర్నిచర్ మాల్
సువిశాలమైన భవంతిలో
కనులను మైమరపించే
వందలాది డిజైన్లతో విభిన్న
మాడల్స్ మీ కోసం... విచ్చేయండి.
AMMA FURNITURE MALL
మినీబైపాస్‌రోడ్డు, నెల్లూరు.
ఫోన్: 0861-2302234

ఓం శ్రీ
నాగలక్ష్మి గ్రీన్ సిటీ
నెల్లూరు.
Kancharla Developers
Office : Near Children's Park
Beside Saibaba Temple Street
Chinthareddypalem Road, Nellore
9963 479 199, 9963 479 299, 9963 479 899
Site: Rangacharya Kandriga,
Kakupalli Bit-II Village, Madaraju Gudur(G.P.)
Nellore Mandal, Nellore District.

వజ్రం - బంగారం - వెండి
ఫ్యాక్టరీ అవుట్‌లెట్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై*
తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై*
తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్ పై 10% తగ్గింపు*
*T&C Apply
గోల్డ్ ప్యాలెస్
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్
925 STERLING SILVER*
EXPORT QUALITY
వెండి వస్తువులపై*
తరుగు లేదు, కూలి లేదు.
*T&C Apply
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331132, 2331121



నిరసనకారులను అడ్డుకొంటున్న పారామిలటరీ దళాలు.

● ఆనం రామనారాయణరెడ్డి

ఇంటి ముట్టడికి యత్నం!

● అడ్డుకొన్న పారామిలటరీ దళాలు

అవకాశవాద రాజకీయాలకు ఆనం కుటుంబం పెట్టింది పేరంటూ ఎన్జీఓలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ముక్కలవుతున్నప్పటికీ మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి పదవుల కోసం పాకులాడటం నీచ రాజకీయానికి నిదర్శనమని నిందిస్తూ మంత్రి ఇంటిని 10వ తేది ముట్టడి చేసేందుకు యత్నించారు. దీనికోసం ఎబిఎం మైదానం నుంచి ఎన్జీఓలు, విద్యార్థి జెఎసి నాయకులు, హిజ్రాలు ర్యాలీగా బయలు దేరారు. కానీ సెయింట్ జోసెఫ్ పాఠశాల వద్ద మోహరించి ఉన్న పోలీసులు ఆందోళనకారులను అడ్డుకొన్నారు. దీంతో సమైక్యవాదులు పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. పరిస్థితి ఉద్రిక్తతగా మారడంతో ప్రధాన నాయకులతోపాటు మహిళలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోనికి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎన్జీఓ నాయకుడు రవీంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర విభజనను అడ్డుకొని ముందుగానే రాజీనామాచేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాల్సిన మంత్రి తన పదవి కోసం విభజనను ప్రోత్సహించడం దారుణమన్నారు. ఇలాంటి వారిని ప్రజలు శాశ్వతంగా రాజకీయాల నుంచి దూరం చేస్తారని చెప్పారు. ఉద్యోగులు జీతాలతోపాటు జీవితాలనే పణంగా పెట్టి ఉద్యమిస్తుంటే కనీసం సంఘీభావం తెలపకపోగా, సమైక్య వాదులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. మంత్రి ఇంటి ముట్టడి చేస్తారన్న వార్తతో అప్రమత్తమైన పోలీసులు ఆయన ఇంటికి వెళ్లేదారులన్నింటినీ మూసేశారు. పారామిలటరీ బలగాలతో గస్తీ ముమ్మరం చేసి ప్రధాన కూడళ్ల వద్ద ఆందోళనకారులను అడ్డుకొనే ఏర్పాట్లు చేశారు.



సిబిసిఐడి డిఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న మందా బాబ్జీ.

దినేష్‌రెడ్డి, వివేకాలను విచారించండి!

మనీస్కీం వ్యతిరేక న్యాయపోరాట కమిటీ

మనీస్కీం విషయంలో మాజీ డిజిపి దినేష్‌రెడ్డికి సూటుకేసులు అందాయని ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి బహిరంగంగా చెప్పినందువల్ల ఈ విషయమై దినేష్‌రెడ్డిని, వివేకానందరెడ్డిని విచారించాలని మనీస్కీం వ్యతిరేక న్యాయపోరాట కమిటీ కన్వీనర్ మందా బాబ్జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మనీస్కీం బాధితులతో కలసి సిబిసిఐడి కార్యాలయంలో డిఎస్పీ దిలీప్‌కుమార్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మందా బాబ్జీ విలేకరులతో మాట్లాడుతూ కొన్ని వేల కోట్ల రూపాయల ఈ స్కాంలో మాజీ డిజిపి దినేష్‌రెడ్డి వందల కోట్ల రూపాయలు దోచుకొన్న వ్యవహారాన్ని వివేకానందరెడ్డి ఎందుకు దాచిపెట్టారో వివరించాలన్నారు. ఇప్పటికైనా మాజీ డిజిపి వద్దనున్న డబ్బు రికవరీ చేసేందుకు సిబిసిఐడి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరవ ఆనంద్‌బాబు, రాయపేట హృదయకుమార్, నిత్యానంద్, పట్రంగి అజయ్, రాచపూడి ఆనంద్, బద్దెపూడి మణి, కొమ్మి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన తీర్మానం వీగిపోయేలా చేస్తాం!

జంట ఎమ్మెల్యేల శపథం

రాష్ట్ర విభజన తీర్మానం అసెంబ్లీలో వీగిపోయేలా చూస్తామని, సమైక్యాంధ్రకు అనుకూలంగా 200 మంది ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టే ప్రయత్నంలో ఉన్నామని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి చెప్పారు. సమైక్యాంధ్రకు మద్దతుగా విఆర్‌సి సెంటర్‌లో వడ్డెర సంఘం రాజ్యాధికార కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. శాసనసభలో తీర్మానాన్ని ఖండించేందుకు ఎంఐఎంతో పాటు లోక్‌సత్తా పార్టీలతో, తెలంగాణ ఎమ్మెల్యేలతో చర్చిస్తున్నామన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి మాట్లాడుతూ సమైక్యంగా వున్న రాష్ట్రాన్ని విడదీయాలనుకొంటున్న వారు విధ్వంసకారులని, వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఆంధ్రుల శ్రమ ఫలితంగానే హైదరాబాద్‌లో అత్యాధునిక విమానాశ్రయాన్ని నిర్మించుకోగలిగామన్నారు. రాళ్లు కొట్టి జీవించే వడ్డెరలు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. వడ్డెరలు చెమటోడ్చి నిర్మించిన కట్టడాలే నేటి చార్మినార్, గోల్కొండలన్నారు. వడ్డెర సంఘం నాయకుడు బెల్లంకొండ చిన్నయ్య కూడా దీక్షా శిబిరంలో మాట్లాడారు.



వడ్డెరల సభలో రాళ్లు కొడుతున్న వివేకానందరెడ్డి.

సర్వం కల్తీమయం!

ఆపే వారు ఎవరు?

కల్తీ... కల్తీ... కల్తీ... ఎక్కడ చూసినా, ఎందులో చూసినా అంతా కల్తీమయం. తినే తిండి దగ్గర్నుంచి తాగే నీరు చివరకు పీల్చే గాలి సైతం కలుషితం అవుతున్నది. తాగే పాలు, తినే ఆహారం సమస్తం కల్తీ. చంటి బిడ్డల దగ్గర్నుంచి పెద్దవాళ్ల వరకు పాలు తాగుతారు. శారీరక ఎదుగుదలకు దోహదం చేసే పాలల్లో అధికంగా కల్తీ జరుగుతుంది. వ్యాపారులతోపాటు రైతులు బర్రెలు ఎక్కువ లీటర్లు పాలు ఇచ్చేందుకు ప్రభుత్వం బ్యాన్ చేసిన ఇంజక్షన్‌లను వినియోగిస్తుండడంతో ఆ పాలు తాగిన వారు అనారోగ్యానికి గురౌతున్నారు. ఇక బియ్యంలో జరిగే కల్తీ అంతా ఇంతా కాదు. నాసిరకం బియ్యానికి పాలిష్‌పట్టి జిలకరమసూరి, మొలగొలుకుల పేరుతో బియ్యంలో కల్తీచేసి జనాన్ని దోచుకొంటున్నారు. కందిపప్పులోనూ కేసరి పప్పు తదితర రకాలను మహారాష్ట్రలాంటి చోట పండించే దినుసులను తెచ్చి కల్తీ వస్తువు చేసేస్తున్నారు. తేడా కనిపెట్టలేనంతగా కల్తీ వుంటుండడంతో వాటిని తిన్న వారు జీర్ణకోశ, ఉదరకోశ వ్యాధులకు గురౌతున్నారు. అందరూ అధికంగా వినియోగించే కారప్పొడిలో జరిగే కల్తీ ఆందోళనకు గురిచేసేలా వుంటుంది. రంపపు పొడి, ఎర్ర రంగుతో కారప్పొడి తయారుచేసి అమ్ముతుండడంతో అధిక సంఖ్యలో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురౌతున్నారు. దీనిని వాడడం వలన అల్సర్ నుంచి క్యాన్సర్‌లాంటి ప్రాణాంతక రోగాల బారిన పడే ప్రమాదం వుంటుండడం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఇక టీ పొడిలో జరిగే కల్తీ గురించి అందరికీ తెలిసిందే. రంగు కోసం షూ పాలిష్, చింతగింజల పొడితోపాటు పనికిమాలిన వాటినన్నింటినీ ఇందులో కలిపి అమ్ముతుండడంతో టీ తాగిన వారు తీవ్రమైన జీర్ణకోశ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. మంచి నీటిలో జరిగే కల్తీ వ్యాపారుల దోపిడీని తెలియజేస్తోంది. మినరల్ వాటర్ పేరుతో మంచినీటి సరఫరా జరుపుతున్న వ్యాపారులు కొళాయిల్లో నీటిని క్యాన్లలో నింపి వాటికి ఐఎస్ఐ స్టిక్కర్‌వేసి విచ్చలవిడిగా అమ్ముతున్నారు. నీటికొరత ఒకవైపు, మంచి నీరు అన్న నమ్మకంతో ఈ క్యాన్ నీటిని తాగుతున్న వారు కామెర్లు, విరోచనాల బారిన పడుతున్నారు. ఇంతగా అన్ని వస్తువులు, నీరు, పాలు సమస్తం కల్తీచేసి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

● దసరా

చందాలకు ఊరుమీద పడ్డారు!

సమ్మెలో ఉన్నాం - డబ్బులు లేవన్నది సాకు

దసరా వచ్చిందంటే ప్రభుత్వ కార్యాలయాల్లోని ఉద్యోగులకు పండగే పండగ. మరీ ముఖ్యంగా పోలీస్, మునిసిపల్, ఫైర్, ఎలక్ట్రిసిటీ తదితర శాఖలైతే ఎలాంటి జంకు బొంకు లేకుండా ప్రజల మీద పడి చందాలు దండడం రివాజు. ప్రభుత్వం నుంచి వేలాది రూపాయలు జీతాలు తీసుకొనే ఉద్యోగులు సైతం దసరా చందాల కోసం ప్రజల దగ్గర దేబిరించడానికి వెనుకాడరు. అలాంటిది సమైక్యాంధ్ర ఉద్యమం సందర్భంగా ఉద్యోగులందరూ సమ్మెలో వుండడం, రెండు నెలలుగా జీతాలు లేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరు చేసిన, చేస్తున్న ఉద్యమం ప్రజల అభిమానాన్ని చూరగొంది. అయితే తమకు జీతాలు లేక ఇబ్బంది పడుతున్నామన్న సాకుతో దసరా పండుగ సందర్భంగా దసరా మామూళ్ల వసూళ్లకు దిగడం నగరంలో చర్చనీయాంశమైంది. మునిసిపల్ ఉద్యోగులు, ఫైర్ సిబ్బంది, విద్యుత్ ఉద్యోగులు, వ్యాపారులు, స్కూళ్ల యాజమాన్యాలు, ఆస్పత్రులు, అపార్టుమెంట్లు, సినిమా హాళ్ల యజమానుల దగ్గర నుంచి సాధారణ గృహ యజమానుల వరకు వారి వారి స్థాయిని బట్టి దసరా చందాలు దండేస్తుండడం గగ్గోలు రేపుతుంది. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఏమి చేయమంటారు రెండు నెలలుగా జీతాలు మానుకొని మీ కోసం మేము సమైక్యాంధ్ర ఉద్యమం చేస్తున్నాం అంతమాత్రం చందా ఇవ్వలేరా అని దబాయిస్తున్నారట. ఇక విధి నిర్వహణలో వున్న పోలీసులు, టెలిఫోన్, పోస్టల్, ఇరిగేషన్ ఉద్యోగులు ఎవరికివారు దసరా మామూళ్ల వసూళ్లలో తల మునకలై ఉండడంతో ఆయా శాఖల పరువు రోడ్ల పాలవుతోంది.

పెన్షన్ల పంపిణీకి రంగం సిద్ధం!

జిల్లావ్యాప్తంగా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీకి అధికారులు రంగం సిద్ధం చేశారు. సమైక్యాంధ్ర సమ్మె సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో పెన్షన్లు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నేతలతో జరిపిన చర్చలు సఫలం కావడంతో విధుల్లో చేరారు. నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పెన్షన్ల పంపిణీకి ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. డివిజన్ల వారీగా సిబ్బందిని నియమించి లబ్దిదారులకు పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఇందిర క్రాంతి పథం సిబ్బంది పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామాల్లో పెన్షన్లు అందిస్తారు. ఉద్యోగుల సమ్మె కారణంగా పెన్షన్లు అందుకోలేని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఆర్థికంగా కొంతమేర ఇబ్బంది పడ్డారు. సమ్మె ఎప్పుడు ముగుస్తుందా, పెన్షన్లు ఎప్పుడు పంపిణీ చేస్తారా అని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న వారు ఇప్పుడు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు, ఇందిర క్రాంతి పథం అధికారులు పెన్షన్ల పంపిణీపై పర్యవేక్షణ చేయకపోతే పక్కదారి పట్టే అవకాశం వుంది. మరణించిన వారి పేర్లతో పెన్షన్లు మంజూరౌతున్నాయి. వీటిని కొందరు సిబ్బంది తమ జేబులో వేసుకొనే అవకాశం వుంది.

● ఉద్యోగులకు

బిఎంఆర్ ట్రస్ట్ చేయూత!



ఉద్యోగులకు నిత్యావసరాలు అందిస్తున్న బీద గిరిధర్.

సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటూ రెండు నెలలుగా జీతాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పలు శాఖల ఉద్యోగులకు బియ్యం, నిత్యావసర వస్తువులను బిఎంఆర్ ట్రస్టు పంపిణీ చేసింది. వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్న కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు ఆధ్వర్యంలో నడిచే ఈ ట్రస్టు నుంచి ఉద్యోగులకు కందిపప్పు, నూనె తదితర సరుకులతోపాటు ఒక్కో ఉద్యోగికి 25 కిలోల బియ్యం అంద జేశారు. ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు విదేశీ పర్యటనలో వుండడం, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఢిల్లీ కార్యక మాల్లో పాల్గొంటుండడంతో వీరి సోదరుడు మాజీ జడ్పీటీసి సభ్యుడు బీద గిరిధర్ వీటిని పంచి పెట్టారు. కావలి ఆర్టీసి బస్టాండ్ వద్ద జరి గిన ఈ కార్యక్రమంలో బోగోలు, అల్లూరు, దగదర్తి, కావలి మండలా ల్లోని రెవిన్యూ ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, కోఆపరేటివ్, మునిసిపల్, ఆర్టీసి ఉద్యోగులకు ఈ సరుకులను అందజేశారు. దీనిపై ఉద్యోగులు స్పందిస్తూ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు చేస్తున్న సహాయా నికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాస ప్రవీణ అన్నదాత మణి ఉద్యోగు లను ఆదుకొనేందుకు బిఎంఆర్ ట్రస్టు చేస్తున్న సహాయాన్ని అభినం దించారు. బీద మస్తాన్‌రావు, రవిచంద్ర, గిరిధర్‌లను రామలక్ష్మణ, భరతులతో పోలుస్తూ తన సహజ శైలిలో గుక్కతిప్పుకోకుండా ప్రాస లతో చెప్పిన మాటలు ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో దేవరాల సుబ్రహ్మణ్యం, వీరిశెట్టి వెంకటేశ్వర్లు, నాగరాజు, మాల్యాద్రి, వాసు, అమరా వేదగిరి, ఆర్టీసి మేనేజర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సమదృష్టి అవసరం!

వెంకటగిరి బెటాలియన్ కమాండెంట్ నాగూర్‌రెడ్డి

పోలీసులు విధి నిర్వహణలో ప్రజలందరిని సమాన దృష్టితో చూడాలని, ప్రజలతో సత్సంబంధాలు కల్గివుండాలని వెంకటగిరి తొమ్మిదవ బెటాలియన్ కమాండెంట్ నాగూర్‌రెడ్డి సూచించారు. బెటాలియన్‌లో ప్రత్యేక పోలీసు సిబ్బందికి, శిక్షణా సిబ్బందికి జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని పోలీ సుల విధులు, ఎదురయ్యే సవాళ్లు తదితర అంశాలపై ప్రసం గించారు. శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసుల పాత్ర కీలకమని, ఈ విషయాన్ని ప్రతి పోలీసు గుర్తుంచుకొని విధి నిర్వహణ చేయాలన్నారు. ఏ రంగంలో వున్న పోలీసుకైనా ఇది ప్రధాన బాధ్యత అన్నారు. విధి నిర్వహణలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినప్పుడు వారిని కూలంకషంగా విచారించా లన్నారు. పోలీసులు నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నతాధి కారుల ప్రశంసలు అందుకొంటూ రాణింపులోకి రావాల న్నారు. మంచి నడవడికతోపాటు ఉన్నతాధికారుల మార్గదర్శకా లను అనుసరిస్తుంటే మంచి భవిష్యత్తు వుంటుందని తెలిపారు.



పిల్లలకు పలకలు పంపిణీ చేస్తున్న తోటపల్లి గూడూరు ఎస్ఐ సాంబశివరావు.

● సేవాభారతి

సేవలు అభినందనీయం!

తోటపల్లి గూడూరు ఎస్ఐ ప్రశంస

విద్యార్థులకు చేయూతనందించడం, విద్యాభివృద్ధికి తోడ్పడి కార్యక్రమాలను నిర్వహించడంలో సేవాభారతి సంస్థ ముందుం టుంది. ప్రతి ఏడాది అమలు జరుపుతున్న విధంగానే ఈ సంవత్సరం తోటపల్లి గూడూరు మండలం కోడూరు గ్రామంలో సేవాభారతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు పలకలు, బలపాలు, ఇతరత్రా సామగ్రి పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా విచ్చేసిన తోటపల్లిగూడూరు ఎస్ఐ సాంబశివరావు సేవాభారతి చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రస్తుతించారు. చదువు ద్వారానే అభి వృద్ధి సాధ్యమవుతుందని దానిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ముందు ముందు మరింతగా సేవా కార్యక్రమాలను విస్తృత పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కార్యదర్శి వివి.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి రవీంద్ర, స్థానిక సర్పంచ్ తొలిశంగారి రాములమ్మ, వేళ్లపాళెం రమేష్‌రెడ్డి, చెరుకూరి మయూరి, తంబిరెడ్డి పెంచలయ్య, తంబిరెడ్డి శ్రీనివాసులు, వెంకటే శ్వర్లు, చెరుకూరి శూలమయ్య, కోట వెంకటేశ్వర్లు, ఆత్మకూరి రవీంద్ర నాధ్‌తాగూర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరిలో రుద్రాభిషేకం

వెంకటగిరి పట్టణంలోగల శంకర మఠంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు ఇటీవల ఘనంగా జరిగాయి. స్థానిక బ్రాహ్మణ సం ఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేద పండితులు మం త్రోచ్ఛారణల మధ్య రుద్రాభిషేకం సాంప్రదాయబద్ధంగా జరిగింది. మాసశివరాత్రిని పురస్కరించుకొని జరిగిన ఈ అభిషేక కార్యక్ర మంలో శంకర మఠం నిర్వాహకులు బి.సూర్యనారాయణతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ కార్యాలయంలో కంప్యూటర్ల చోరీ

వెంకటాచలంలో దొంగల చేతివాటం

వెంకటాచలం గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో కంప్యూటర్లు చోరీకి గురయ్యాయి. ఉద్యోగులందరూ సమైక్యాంధ్రకు మద్దతుగా సమ్మెలో వుండడంతో కార్యాలయం మూత పడి వుంది. అటు ఉద్యో గులు లేక, లబ్దిదారులు రాకపోవడంతో దొంగల పని సులువైంది. కార్యాలయం తాళాలు పగులగొట్టి కొత్తగా ఏర్పాటు చేసిన కంప్యూ టర్లను తస్కరించడంతోపాటు బీరువాల్లో వున్న రికార్డులను చెల్లా చెదురు చేసేశారట. ఈ దొంగతనం సమాచారం అందుకొన్న గృహ నిర్మాణ శాఖ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు విచా రణ చేపట్టారు. ఈ దొంగతనం తెలిసిన వాళ్ల పనేనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు పోలీసులు.

అమరా సోదరుల దాతృత్వం!

ఆర్టీసి కార్మికులకు వితరణ

సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి రెండు నెల లుగా జీతాలు అందక అవస్థలు పడుతున్న ఆర్టీసి కార్మికులను ఆదు కొనేందుకు కావలి పట్టణానికి చెందిన అమరా బ్రదర్స్ ముందుకొచ్చారు. అమరా ట్రస్ట్ తరపున ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్త, ఆయన సోదరుడు అమరా వెంకట సుబ్బారావు గుప్త ఒక్కో ఆర్టీసి కార్మికునికి 25 కిలోల బియ్యం, 11 కేజీల దినుసులు, నూనె ఇతర వంట సరుకులు అందజే



సభలో మాట్లాడుతున్న అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్త.

శారు. ఈ సందర్భంగా అమరా సోదరులు మాట్లాడుతూ జీతాలు లేక పోయినా కుటుంబం పస్తులుంటున్నా మొక్కవోని దీక్షతో సమైక్యాంధ్ర ఉద్యమంలో ఆర్టీసి కార్మికులు పాల్గొనడాన్ని ప్రశంసించారు. కాంగ్రెస్ నేత గ్రంథి యానాదిశెట్టి మాట్లాడుతూ సమైక్యాంధ్ర ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించిన ఆర్టీసి కార్మికులను ఆదుకొనేందుకు ముం దుకు వచ్చిన అమరా సోదరులను అభినందించారు. తెలుగుదేశం పార్టీ నేతలు పూనూరు రవికుమార్‌రెడ్డి, గుత్తికొండ సురేష్, గోవిందరెడ్డి, భవ వాసి సురేష్, బొట్లగుంట హరిబాబు, ఆత్మకూరు బ్రహ్మయ్య, టంగు టూరి రామకృష్ణ, గుర్రం ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గొలగమూడిలో భక్తుల పాట్లు!



జిల్లా నలుమూలల నుంచేకాక తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు గొలగమూడి విచ్చేసి భగవాన్ వెంకయ్య స్వామిని దర్శించుకొంటుంటారు. వెంకయ్య స్వామి దర్శనంతో కష్టాలు తొలగిపోతాయని పలువురి నమ్మకం. అలాంటి పవిత్ర పుణ్యక్షేత్రమైన గొలగమూడిలో ఎటిఎం సెంటర్ లేకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డబ్బులు అవసరమైన వారు ఎటిఎం కేంద్రం లేకపోవడంతో అవస్థలు పడాల్సివస్తోంది. ఇటీవల వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలకు వచ్చిన ఇతర రాష్ట్రాల భక్తులు ఈ విషయంలో సమస్యలను ఎదుర్కొన్నారు. ఇక్కడ సిండికేట్ బ్యాంక్ శాఖ ఏర్పాటు చేసినా ఎందువల్లనో ఎటిఎం సెంటర్‌ను ఏర్పాటు చేయలేదు. గొలగమూడిని అన్ని విధాల ఎంతో అభివృద్ధి చేసిన వెంకయస్వామి ఆశ్రమ కార్య నిర్వహణాధికారి ఈ విషయంలో చొరవ చూపి ఎటిఎం సెంటర్ వచ్చేలా చేస్తే భక్తులు ఆనందపడతారు. ఏమంటారు ఇఓగారూ.



నటుడు చిరంజీవి మేనల్లుడు ధర్మతేజ్ బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకొంటున్న చిరంజీవి అభిమానులు రవి, కృష్ణారెడ్డి, కొట్టే వెంకటేశ్వర్లు తదితరులు.


సిడబ్ల్యూసి తెలంగాణకు తొత్తు!

వెంకటగిరి కాంగ్రెస్ నేతల విమర్శ

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తెలంగాణకు తొత్తులుగా వ్యవహరిస్తున్నదని వెంకటగిరి కాంగ్రెస్ నేతలు ఘాటైన విమర్శలు చేశారు. రాష్ట్రం సమైక్యంగా వుండాలని ప్రజలందరూ కోరుకొంటుంటే కాంగ్రెస్ అధిష్టానం మాత్రం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అత్యుత్సాహం చూపుతున్నాదని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం క్యాబినెట్ నోట్ సిద్ధం చేయడాన్ని నిరసిస్తూ వెంకటగిరిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం బహిరంగ సభను జరిపారు. పిసిసి కార్యదర్శి నేదురుమల్లి రామకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలని అధిక సంఖ్యలో ప్రజలు చేస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వైఖరిని తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు రాష్ట్ర విభజన వద్దని అధిష్టానానికి తెలిపినా సిడబ్ల్యుసిలోని పెద్దలు తెలంగాణకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, కలసికట్టుగా వున్న ఆంధ్రుల మధ్య చిచ్చురేపారని వివరించారు. ఇప్పటికైనా చేసిన తప్పును సరిదిద్దుకొని రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన వల్ల నష్టమే తప్ప లాభం లేదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నేదురుమల్లి ఇంటి నుంచి బయలుదేరిన ర్యాలీ కాశీపేట కూడలి వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షుడు సి.బాలయ్య, మాజీ కౌన్సిలర్ చిట్టేటి హరికృష్ణ, ప్రసాద్‌రెడ్డి, రామారావు, శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


విభజిస్తే రాష్ట్రం అల్లకల్లోలం!

మాజీ ఎమ్మెల్సీ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి



సమైక్యంగా వున్న ఆంధ్ర రాష్ట్రాన్ని విభజిస్తే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందని వైఎస్ఆర్‌సిపి నేత, మాజీ శాసనమండలి సభ్యుడు బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో కేంద్ర ప్రభుత్వ రాష్ట్ర విభజన నిర్ణయాన్ని నిరసిస్తూ రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమాంధ్రలో గత రెండు నెలలుకుపైగా ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు బాధలు భరించి సమైక్య ఉద్యమం చేస్తుంటే దానిని లెక్కచేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాదన్నారు. ప్రజల అభిప్రాయాలను, తారాస్థాయిలో జరుగుతున్న ఉద్యమాన్ని గుర్తించకుండా క్యాబినెట్ నోట్ తయారు చేయడం దారుణమైన చర్య అని ఆగ్రహించారు. రాష్ట్ర విభజనంటూ జరిగితే సీమాంధ్ర కరవు ప్రాంతంగా మారడం తథ్యమన్నారు. నీటిపారుదల, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, విద్యుత్ తదితర పలు సమస్యలను సీమాంధ్ర ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఎదుర్కోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో సీమాంధ్ర ప్రాంతం వారి కృషి ఎంతో వుందన్నారు. అలాంటి నగరాన్ని తిరిగి నిర్మించుకొని అభివృద్ధి చేయాలంటే కొన్నేళ్లు పడుతుందన్నారు. కేంద్రం నిర్ణయాన్ని ఉపసంహరించుకొనేలా సీమాంధ్ర ప్రాంత మంత్రులు, శాసనసభ్యులు రాజీనామాలు చేసి రాజకీయ సంక్షోభం సృష్టించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అల్లారెడ్డి సోదరులు, ప్రతాప్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, మునిరెడ్డి, వెంకటేశ్వర్లు, జమీర్, గౌస్, పెంచలయ్య, శేషారెడ్డి, చిన్నపరెడ్డి, ఉస్మాన్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారిన మాదాసు గంగాధరం!



కాంగ్రెస్ సీనియర్ నేత మాదాసు గంగాధరం వ్యవహారశైలి చిత్రవిచిత్రంగా వుంటుంది. ప్రత్యక్ష రాజకీయాలలో చురుకుగా పాల్గొనకపోయినా కాంగ్రెస్ పార్టీ పెద్దలను, అధికారులను మచ్చిక చేసుకోవడంలో దిట్ట. కుల్లూరు సొంతూరైనా ఎప్పుడూ ఎవరికీ అందుబాటులో వుండని మాదాసు ఇప్పుడు రూటు మార్చి కార్యకర్తలతో ఎక్కువ సమయం గడుపుతుండడం, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండడం కలువాయి మండలంలో చర్చనీయాంశమయ్యింది. గతంలో ఎమ్మెల్సీగా, రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసి ప్రస్తుతం పిసిసి ఉపాధ్యక్షునిగా కొనసాగుతున్న గంగాధరంలో కొత్తగా వచ్చిన ఈ మార్పు ఏమిటో అర్థంకాక కార్యకర్తలు, అనుచరులు బుర్ర గోక్కొంటున్నారు. అభివృద్ధి కార్యక్రమాల గురించి, ప్రభుత్వ పథకాల అమలు గురించి ప్రజలతో చర్చిస్తూ మండలంలో బిజీగా వుంటున్నారు. ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తన దగ్గరకు వివిధ పనులపై వచ్చే ఆ ప్రాంతం వారికి ఏమైనా సమస్యలుంటే మాదాసు గంగాధరాన్ని కలవమని చెప్తుండడం, గతంలో ఒక సామాజిక వర్గం వారికే ప్రాధాన్యమిస్తున్నాడని పేరుబడ్డ మాదాసు ఇప్పుడు తాను కులపిచ్చి వదిలిపెట్టినట్లు అందరికీ తెలిసేలా వ్యవహరిస్తుండడాన్ని గమనిస్తున్న ప్రజలు మాదాసులో వచ్చిన ఈ మార్పు ఏమిటా అని చర్చించుకొంటున్నారు.

బోగోలులో ఉచిత వైద్య శిబిరం!

సమైక్యాంధ్ర ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న నేపథ్యంలో రవాణాకు ఆటంకాలు ఏర్పడడంతో వివిధ వైద్య సేవలకు ఆరోగ్య కేంద్రాలకు వెళ్లేవారికి ఇబ్బందులు ఎదరవుతున్నాయి. ఒకవైపు విష జ్వరాలు విజృంభిస్తుండడంతో పలు గ్రామాల్లోని ప్రజలు అనారోగ్యానికి గురౌతున్నారు. వీరి బాధలు గుర్తించి వైద్య సేవల్లో తన వంతు సహకారాలు అందించేందుకు నడుం బిగించారు బిట్రగుంటకు చెందిన డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శిరీష. సమ్మె కారణంగా వైద్య సహాయం పొందలేక పోతున్న పేద ప్రజల కోసం బోగోలు పంచాయతీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మండల పరిధిలో పలువురు జ్వరాలతో

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు



సతమతం అవుతుండడంతో ఈ వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడింది. తన తండ్రి డాక్టర్ వెంకటేశ్వర్లు పేరుతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఫణికృష్ణ, ఉదరకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ మహేష్, కిడ్నీ వైద్యులు డాక్టర్ లక్ష్మీరమేష్, స్త్రీల గర్భకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రీదేవి, షుగర్ వైద్యులు డాక్టర్ ఎ.మాధవ్ తదితరులు పాల్గొని రోగులను పరీక్షించారు.

● ఇందుకూరుపేటలో...

వైకాపా నిరసన!

రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలి

కేంద్ర క్యాబినెట్ తెలంగాణ నోట్‌ను ఆమోదించడాన్ని నిరసిస్తూ ఇందుకూరుపేటలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. సీమాంధ్ర ప్రాంతంలో ప్రజా ఉద్యమాన్ని గుర్తించకుండా కేంద్ర క్యాబినెట్ తెలంగాణ నోట్‌ను ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండించారు ఆ పార్టీ నేత వెంకటకృష్ణారెడ్డి. స్వార్థం కోసం కొందరు నేతల చెప్పుడు మాటలు విని రాష్ట్రాన్ని ముక్కలు చేయడానికి పూనుకోవడం బాధాకరం అన్నారు. కేంద్రం దిగి వచ్చి రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచేవరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పక్షాన పోరాడతామని అన్నారు. సోనియాగాంధీ తక్షణం తాను చేసిన తప్పును సరిదిద్దుకొని తెలుగు ప్రజలను ఐక్యంగా వుంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొత్తూరు షిర్డి సాయిబాబా మందిరం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేతలు సుధాకర్‌రెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరుకు చుక్కనీరు వెళ్లనివ్వం!

జిల్లా రైతాంగం పొట్టకొట్టి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి సొంత జిల్లా చిత్తూరుకు కండలేరు జలాలను తరలించడాన్ని అడ్డుకొంటామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. జిల్లాలో వెనుకబడి వున్న వెంకటగిరి ప్రాంత రైతాంగానికి చుక్కనీరు విడుదల చేయకుండా చిత్తూరుకు 10టిఎంసిల నీటిని విడుదల చేయడం దారుణమన్నారు. దీనిని అడ్డుకొంటామని, ఎట్టి పరిస్థితులలోనూ చుక్కనీరు చిత్తూరుకు వెళ్లనివ్వమన్నారు. రాష్ట్ర విభజనను నిరసిస్తూ డక్కిలిలో 50 రోజులకుపైగా జెఏసి ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. కేంద్ర మంత్రులు డ్రామా ఆడుతున్నారని, ప్రజలకు ఒకటి చెప్పి, కాంగ్రెస్ నాయకత్వానికి మరొకటి చెబుతూ తప్పు దోవ పట్టిస్తున్నారని విమర్శించారు. పదవుల కోసం ప్రజలను నిలువునా చీల్చడం దారుణమైన చర్య అన్నారు. అనంతరం సైదాపురం మండలంలో పర్యటించి జన చైతన్య యాత్రలను ప్రారంభించారు. రాష్ట్ర విభజనను అడ్డుకోవడంలో కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నాయని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడు అప్పుడు, ఇప్పుడూ ఒకే మాటకు కట్టుబడి వున్నారని, కానీ ఆ రెండు పార్టీలు మాత్రం ప్రజలను దగా చేస్తున్నాయన్నారు. రాష్ట్ర విభజన జరగకుండా అడ్డుకొంటామని, అలాగే కండలేరు జలాలు చిత్తూరుకు తరలిపోకుండా రైతులతో కలసి పోరాటం చేస్తామన్నారు.

వెంకటగిరి ఎమ్మెల్యే ప్రతిన



హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసి పరామర్శిస్తున్న సర్వేపల్లి నియోజకవర్గ వైకాపా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి.

● చట్టాలపై

అవగాహన వుండాలి!

గ్రామీణ ప్రాంత ప్రజలు చట్టాలపై అవగాహన కల్గి వుండాలని జిల్లా అడిషనల్ జడ్జి గురప్ప తెలిపారు. కొండాపురం మండలం సాయిపేటలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులను కాలయాపన లేకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. అదనపు జూనియర్ జడ్జి ఎండి.నజీర్ బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆస్తి హక్కు చట్టాల గురించి అవగాహన కల్పించారు. లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి వినియోగదారుల హక్కుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్గించేందుకు కావలికి చెందిన శ్రీ ఆర్ట్స్ సంస్థ లోకానికి శాస్తి అనే నాటికను ప్రదర్శించింది. ప్రజలు లేని పోని సమస్యలు సృష్టించుకొని పోలీసులు, కోర్టుల చుట్టూ తిరిగి ఎలా నష్టపోతున్నారో అన్న విషయాన్ని ఈ నాటిక ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా చూపారు. ఈ సదస్సులో కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, ప్రభాకర్, నాగరాజు, సర్పంచ్ చినమాలకొండయ్య, రామ్మూర్తి, సిఐ రమణ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో అడిషనల్ జడ్జి గురప్ప

రాష్ట్రంలో అస్తవ్యస్థ పరిస్థితులు!

కావలిలో ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శ


వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి మరణంతో రాష్ట్రంలో అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజల బాగోగులు పట్టించుకొనేవారే లేకుండా పోయారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల బాధలు తొలగి రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో నడవాలంటే వైఎస్‌జగన్ ముఖ్యమంత్రి కావడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఆ శుభ ఘడియలు దగ్గర్లోనే వున్నాయని జోస్యం చెప్పారు. కావలి పట్టణంలో సమైక్యాంధ్రకు మద్దతుగా రైతులతో దీక్ష చేపట్టిన ఆయన రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు కుమ్మక్కై రాష్ట్రాన్ని అట్టుడికిస్తున్నాయని, ప్రజలకు శాంతి లేకుండా చేస్తున్నాయని విమర్శించారు. వేలాది మంది ఉద్యోగులు రెండు నెలలకు పైగా జీతాలు లేకపోయినా సమైక్యాంధ్ర కోరుతూ ఉద్యమిస్తుంటే కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మరోవైపు తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ద్వంద్వ వైఖరి అవలంభిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ఉద్యోగులు చేస్తున్న సమైక్యాంధ్ర ఉద్యమానికి పూర్తి అండదండలు అందిస్తామన్నారు. రాష్ట్రంలో వైఎస్ హయాంలో పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు కావాలన్నా, ఆ ఫలాలు దక్కాలన్నా వైఎస్ జగన్ అధికారంలోకి రావడంతోనే సాధ్యమవుతుందన్నారు. అలాగే వైఎస్ తలపెట్టిన జలయజ్ఞం పనులు పూర్తిచేసి జగన్ అభినవ కాటన్‌గా కీర్తిగడించడం ఖాయమన్నారు.

పేరుకే ఆరోగ్య కేంద్రం!

తుమ్మలపెంటలో అందని వైద్య సేవలు



ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు తుమ్మలపెంటలో ఏర్పాటు చేసిన ఆరోగ్య, శిశు కేంద్రాలు నామమాత్రమవుతున్నాయి. వైద్యులు, వైద్య సిబ్బంది వున్నా ఎవరూ అందుబాటులో లేకపోవడంతో వివిధ అనారోగ్య సమస్యలతో ఆరోగ్య కేంద్రాలకు వచ్చేవాళ్లు పట్టించుకొనే వారు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం వచ్చినా, చిన్న గాయమైనా మందులిచ్చే వాళ్లు లేక, వైద్య చికిత్స అందించే దిక్కులేకపోవడంతో మండలంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుమ్మలపెంట ప్రాంతంలో అధిక భాగం మత్స్యకారులు. వీరే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వస్తుంటారు. పురిటి నొప్పులతో వచ్చే మహిళలు వైద్యులు అందుబాటులో లేక పడేబాధ వర్ణనాతీతం. వేలాది రూపాయలు ప్రభుత్వ జీతం తీసుకొంటూ విధులకు సక్రమంగా హాజరు కాకపోతుండడం, చుట్టపు చూపుగా వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోతుండడంతో ఈ ప్రాంతంలో పేరుకు వైద్య కేంద్రం వున్నా అది ఏ మాత్రం ఉపయోగపడడం లేదు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దీనిపై దృష్టి సారించి ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందేలా చూడాలని, వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరయ్యేలా చూడా లని స్థానికులు కోరుకొంటున్నారు.



సిరిసంపదలను అందించే కోజాగౌరి వ్రతం!



శ్రీ మహావిష్ణువు దేవేరి అయిన శ్రీలక్ష్మీదేవిని అర్పించడం అనేది అనాదిగా వస్తున్న ఆచార సాంప్రదాయాలలో ఒకటి. మహాలక్ష్మిని పూజించడం ద్వారా సకల శుభాలు కలగడంతోపాటు సంపదలను సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందని పలువురు నమ్మకం. సంపదకారిణి, సౌభాగ్య ప్రదాయిని అయిన శ్రీమహాలక్ష్మిని అనేక రూపాలలో పూజించినా, వ్రతాలు చేసిన ఆశ్వీయుజ మాసం పూర్ణిమ నాడు చేపట్టే వ్రతం ఉత్తమోత్తమమైనదని పురాణాలు చెప్తున్నాయి. దీనినే కోజాగౌరీ వ్రతం అంటారు. లక్ష్మీదేవికి ప్రీతికరమైన వ్రతం కోజాగౌరీ వ్రతం. పాలకడలిలో శేషతల్పంపై శయనించి వుండే స్థితికారుడైన శ్రీమహావిష్ణువు పాదాల చెంత ఆశీనురాలై వుండే శ్రీమహాలక్ష్మిని పూజించడం వల్ల ఆమె కరుణాకటాక్షాలు లభిస్తాయని, సకల సంపదలు చేకూరుతాయని పురాణాల్లో వివరించబడి వుంది.

కోజాగౌరీ వ్రతంలో లక్ష్మీదేవి అర్చనతో పాటు జాగరణ ప్రధానమైనది. వ్రతాన్ని ఆచరించే సువాసినిలు నియమనిష్టలతో శ్రీమహాలక్ష్మిని పూజించి వ్రత సమాప్తి చేయాల్సి వుంటుంది. అప్పుడే అమ్మవారి కరుణ లభిస్తుంది. కోజాగౌరీ వ్రతానికి సంబంధించిన మహాత్మ్యాన్ని గురించి, దాని ఫలితాల గురించి మహర్షులు వివరించబడినట్లు పురాణాల్లో చెప్ప బడింది. దీనికి సంబంధించి పురాణగాథ ఒకటి ప్రచారంలో వుంది. పూర్వం మగధ దేశంలో వరితుడు అనే పండితుడు నివసిస్తుండేవాడు. దైవ చింతన మెండుగాగల వృతుడికి చండీ అనే భార్య వుండేది. ఆమె పరమగయ్యాళి. బంగారు, ధనం మీద వ్యామోహం కల్గిన ఆమె నిత్యం భర్తను వాటి కోసం ఒత్తిడి చేయడంతోపాటు తనకు కావలసినవి సమకూర్చలేదన్న అక్కసుతో భర్తను ఖాతరు చేయకుండా, అతడి మాటలు పెడచెవినపెట్టి ఇష్టానుసారంగా వ్యవహరించ సాగింది. భార్య వ్యవహారశైలితో వరితుడు మానసికంగా క్రుంగిపోసాగాడు. అతని మిత్రులు దీనిని గమనించి నీవు ఏ పని చేయాలనుకొన్నా దానికి వ్యతిరేకంగా పనిచేయమని నీ భార్యకు చెప్పు అందుకు వ్యతిరేకంగా ఆమె చేస్తుంది కాబట్టి నీ పనులు నెరవేరుతాయని సలహా ఇచ్చారు. కొంతకాలానికి వరితుడి తండ్రి ఆబ్దికం వచ్చింది. స్నేహితుల సూచన మేరకు వరితుడు తన భార్య అయిన చండీతో దగ్గరుండి ఈ కార్యక్రమం చేయించమంటాడు. అన్నీ పనులు సవ్యంగా జరుగుతాయని అతను అనుకొంటుండగా పిండ ప్రదానం అప్పుడు ఆ పిండాలను తీసుకొనిపోయి నదిలో పడవేయమనగా భార్య వాటిని కాలువలో పడవేయడంతో విరక్తి చెందిన వరితుడు ఇల్లు వదలి అరణ్యాలకు వెళతాడు. కొంతకాలం తర్వాత ఒకనాటి ఆశ్వీయుజ పౌర్ణమినాడు సాయం సంధ్యవేళ ముగ్గురు నాగకన్యలు వచ్చి నదిలో స్నానం చేసి లక్ష్మీదేవిని పూజిస్తారు. అనంతరం పాచికలు ఆడేందుకు సిద్ధమవుతారు. నాలుగో మనిషి అవసరమై చూస్తుండగా వారికి వరితుడు కన్పించడంతో ఆడటానికి ఆహ్వానించారు. అది జూదమని అతను ఆడనని చెప్పగా ఈ దినం పాచికలు ఆడడం నియమమని అనడంతో వరితుడు వారితో కలసి పాచికలు ఆడుతాడు. ఆ సమయంలో భూలోకంలో ఎవరు మేల్కొని వున్నారో చూసేందుకు వచ్చిన లక్ష్మీదేవి శ్రీమన్నారాయణులకు నాగకన్యలతోపాటు వరితుడు మేల్కొని పాచికలు ఆడడం చూసి సంతోషించి సర్వ సంపదలు ప్రసాదించారు.

వ్రతమాచరించిన అనంతరం జాగరణ సమయంలో పాచికలు ఆడడం లేదా గవ్వలు ఆడడం ఆచారంగా వస్తోంది.

– రామనారాయణ

ఛార్జీలు మాయం

● రేషన్ కార్డులు గల్లంతయ్యాయి

పౌరసరఫరాల శాఖ కార్యాలయ సిబ్బందిపై అనుమానం!



ఆన్‌లైన్‌లో వున్న రేషన్ కార్డుల డేటా గల్లంతుకావడంపై గగ్గోలు రేగింది. ఈ పని ఎక్కడ నుంచి జరిగిందన్న విషయంపై జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి విచారణ మొదలెట్టారు.

ఆన్‌లైన్‌లో వున్న కొన్ని రేషన్ కార్డులు గల్లంతు కావడంపై జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి విచారణ ప్రారంభించారు. కార్యాలయ సిబ్బంది ప్రమేయం లేనిదే రేషన్ కార్డులు రద్దు చేయడం సాధ్యపడని పరిస్థితి. ఇప్పటివరకు రేషన్‌షాపుల ద్వారా సరుకులు పొందుతున్న లబ్దిదారులు రేషన్ కార్డులు రద్దుచేసిన విషయాన్ని తెలుసుకుని కలెక్టరేట్‌కు పరుగులు తీస్తున్నారు. తొలుత వీటిపై వినతి పత్రాలు స్వీకరించిన అధికారులు మౌనం వహించారు. అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతుండడంతో జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ స్పందించక తప్పలేదు. రేషన్‌కార్డులు ఎలా రద్దు కాబడ్డాయో వెంటనే విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన డిఎస్‌ఓ ఆన్‌లైన్‌లో వున్న మొత్తం రేషన్ కార్డుల జాబితాను పరిశీలించారు. వాస్తవంగా ఇప్పటికి కూడా కొన్ని రేషన్ కార్డులు ఆన్‌లైన్‌లో పొందు పరచలేదు. ఏదైనా అత్యవసర పనిమీద రేషన్‌కార్డు వినతి పత్రానికి జతచేస్తే ఆన్‌లైన్‌లో లేదంటూ తిరస్కరిస్తున్నారు.

వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు తప్పనిసరిగా రేషన్ కార్డు జెరాక్స్ కాపీ జతచేయాల్సి వుంటుంది. పెన్షన్ మంజూరు చేసే సమయంలో డిఆర్‌డిఏ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో రేషన్‌కార్డు వివరాలు సరిచూస్తారు. ఆన్‌లైన్‌లో వివరాలు లేకుంటే దరఖాస్తును తిరస్కరిస్తుంటారు. ఈ విషయం లబ్దిదారులకు నెలల తరబడి తెలియపరచరు. ఆన్‌లైన్‌లో లేని కార్డులకు రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నట్లు మాత్రం తహశీల్దార్ కార్యాలయాల్లో ధృవీకరిస్తున్నా కూడా ఆన్‌లైన్‌లో పొందుపరచని కార్డులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో వున్న రేషన్ కార్డుల డేటాను తొలగించడంలో లబ్దిదారులతోపాటు పౌరసరఫరాల శాఖాధికారులు సైతం ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులు చేయాలన్నా జాయింట్ కలెక్టర్ డిజిటల్ సంతకంతో చేయాల్సి వుంటుంది. ఈ విషయం బయట వ్యక్తులకు తెలిసే అవకాశం వుండదు.

పౌరసరఫరాల శాఖలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేసిన వారి ప్రమేయంగానీ, కార్యాలయ సిబ్బంది హస్తం గానీ వుండవచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయాల్లో కూడా రేషన్ కార్డులు చేర్పులు, మార్పులు చేసేందుకు అనుమతిచ్చారు. రెండు నెలలకుపైగా సమైక్యాంధ్ర ఆందోళనల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు విధుల్ని బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ఈ సమ్మె సమయంలో రేషన్ కార్డులు ఆన్‌లైన్‌లో గల్లంతు కావడం జరిగినట్లు అధికారులు గుర్తించారు. కంప్యూటర్ పాస్‌వర్డ్ కార్యాలయ సిబ్బందికి తప్ప ఇతరులకు తెలియదు. సిబ్బంది సమ్మెలో వున్న సమయంలో ఇలా జరగడంపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో దాదాపు ఏడు లక్షలకు పైగా తెల్లరేషన్ కార్డులు వున్నాయి. ఇప్పటివరకు కొందరు లబ్దిదారులు మాత్రమే కార్డులు గల్లంతు కావడంపై అధికారులకు ఫిర్యాదులు చేశారు. మిగిలిన లబ్దిదారులు కూడా వారి రేషన్‌కార్డులు ఆన్‌లైన్‌లో పరిశీలించుకుని గల్లంతయ్యాయా? లేదా? అనేది నిర్ధారించుకోవాల్సిన అవసరం వుంది.

జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఉమామహేశ్వరరావు కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరుపుతున్నారు. అసలు సూత్రధారులు ఎవరు? ఏ ప్రాంతంలోని కంప్యూటర్ ద్వారా రేషన్ కార్డులు గల్లంతు చేశారన్నది తెలుసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అనుమానితులుగా వున్న కార్యాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన రహస్య సమాచారం గల్లంతు చేసినా ఆశ్చర్యపోనవసరం వుండదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుంది. లేకుంటే రేషన్ కార్డులు గల్లంతు చేసిన విధంగా ఇతర సమాచారాన్ని సైతం కంప్యూటర్ల నుండి తొలగించే ప్రమాదం పొంచి వుంది.

సంపుగుడు

* రాజకీయవాదుల నీచత్వాన్ని కలెక్టర్ కూడా భరించాల్సిందేనా?

మతి స్థిమితం సరిగాలేని వారు ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులని ప్రజా ప్రాతినిధ్యం చట్టం నిర్దేస్తున్నది. మతి స్థిమితం లేదని నిరూపణ చేయగల్గితే, ఎన్నికైన తర్వాత కూడా పదవి పీకి పారేయమని చెప్తున్నదా చట్టం. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రవర్తన చూస్తుంటే ఆయనకు ఎన్నికలలో పోటీ చేసే అర్హత, పదవిలో కొనసాగే పరిస్థితి వుందా అన్న అనుమానం కల్గుతున్నది. ఆయన మతి స్థిమితం గురించి ఎవరూ కోర్టుకు వెళ్లి ప్రశ్నించలేదు కాబట్టి పదవిలో కొనసాగుతున్నాడు కాబోలన్పిస్తున్నది.

గత పదేళ్ల నుంచి వివేకా రాజకీయం వికృత చేష్టలకు, వికారపు పోకడలకు ఒక సంకేతంగా నడుస్తున్నది. కర్నూలు మాజీ మేయర్ బంగి అనంతయ్యకు ఈయనకు ఈ విషయంలో పెద్దగా వ్యత్యాసం లేదు. అయితే ఈ మధ్య ఈ పిచ్చి బాగా ముదిరిపోయింది. తానొక బాధ్యత కల్గిన ప్రజాప్రతినిధినని మర్చిపోతున్నాడు. తన వెర్రి మొర్రి చేష్టలతో రాజకీయం అనే భ్రమలో బ్రతుకుతున్నాడు. అది చూసే, ఆయన మతి స్థిమితంగా వుందా అన్న సందేహం కలగడం.

మునిసిపల్ మాజీ మేయర్ భానుశ్రీ అంటే ఆయనకు ఎక్కడలేని ప్రీతి. ఒకరినొకరు అభిమానించుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛ. దాన్ని ఎవరూ తప్పుబట్ట లేరు. అభ్యంతరం చెప్పలేరు. ఎవరి ఇష్టం వారిది. కానీ ఆ ఇష్టాఇష్టాలు వ్యక్తిగత స్థాయికి పరిమితమైనంత వరకే ఆ స్వేచ్ఛ. కానీ వివేకానందరెడ్డి ఆ పరిధి పదే పదే మీరుతున్నాడు. ప్రజల ఆస్తులను, ప్రజల జీవిత మర్యాదలను, పౌర

డోలేంద్ర

సాంప్రదాయాలను భానుశ్రీ కోసం ధారాధత్తం చేస్తున్నాడు. అందుకు ఎన్ని ఉదాహరణలో లెక్కే లేదు. నెల్లూరు నగరంలో ఎవరు కాంట్రాక్ట్ పనులు చేసుకోవాలన్నా ఆమెకు కప్పం కట్టవలసిందే. బ్రాందీ షాపు తెరవాలంటే ఆమెకు భాగం ఇవ్వాల్సిందే. ఎవరు ఏ చిన్న ప్రారంభోత్సవం చేసుకోవాలన్నా ఆమెకు అతిథి మర్యాద చేయవలసిందే. అపార్ట్‌మెంట్ కట్టాలంటే, అందులో ఒకటి ఆమెకు కానుకగా ఇవ్వాల్సిందే. భానుశ్రీ అనే మహిళ ఈ నగరానికి మహారాణి అయినట్లు చూడాలన్నది వివేకా ఆజ్ఞ. వ్యాపారాలు నడుపుకొనేవారు, ఉద్యోగాలు చేసుకొనేవారు తమకు ఇష్టం వున్నా లేకపోయినా విధిగా ఆ గలీజు నిర్భందాన్ని అమలు చేస్తూ వున్నారు. కాదంటే, రాత్రికి రాత్రి కట్టిన అపార్టుమెంటు భవంతి కూలిపోతుంది. రియల్ ఎస్టేట్ లే అవుట్ చెదిరిపోతుంది.

ఇప్పుడు భానుశ్రీ మేయర్ కాదు. ఏ అధికారిక పదవీ లేదు. అయినాసరే, ఆమెకు పట్టపురాణి హోదా ఇవ్వాలని హఠం పడుతున్నాడు వివేకా. మినీబైపాసు రోడ్డు పక్కన మూడు సిమెంటు రోడ్డు శంకుస్థాపనలకు తోక ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డితో కలిసి వెళ్లాడు మొన్న 11తేది ఉదయం. అలవాటు ప్రకారం భానుశ్రీ కూడా హాజరు. ఆ శిలా ఫలకం దగ్గరకు వచ్చేసరికి అందులో భానుశ్రీ పేరు లేదు. అంతే, వివేకా శివాలెత్తిపోయాడు. "ఎవడ్రా ఇక్కడ డిఇ? శిలాఫలకం మీద భానుశ్రీ పేరు వేయాలని తెలియదా? ఈ పనులన్నిటికీ నిధులు మంజూరు చేయించింది ఆమె. నాకు ఒళ్లు బాగోలేక చచ్చే స్థితిలో వుంటే ధైర్యం చెప్పింది ఆమె. ఆమె లేకుంటే నేను లేను. ఆమె పేరు లేని శిలాఫలకం నేను ప్రారంభించను" అని వెర్రి కేకలు పెట్టాడు. వెంటనే మునిసిపల్ కమిషనర్‌ను పిలిచి, వాళ్లకు బుద్ధి లేకుంటే నీకైనా లేదా, భానుశ్రీ లేకుండా నేను ఏ కార్యక్రమానికీ రానని నీకు తెలియదా, ఆమె పేరు లేకుండా చేసిన ఎంఇ గాడికి వెంటనే షోకాజ్ నోటీసు ఇవ్వు, ఆ డిఇ గాడిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో ముంచు, ఏఇ గాడిని వాటర్ వర్క్స్ దగ్గర నైట్ డ్యూటీలో వెయ్యి, దోమలు కుట్టి చావాలి, నా కొడుకు"... అని బండ బూతులు తిట్టడం మొదలు పెట్టాడు. అధికారులు హడలి పోయారు. శ్రీధర్ కృష్ణారెడ్డి ఈ గలీజు నాకెందుకని కారెక్కి వెళ్లిపోయాడు. కమిషనర్ గడ గడ వణికి పోయాడు. భానుశ్రీ మాత్రం చిద్విలాసంగా తమాషా చూస్తూ వుండిపోయింది. వివేకా మాటలను రాజాజ్ఞగా



మునిసిపల్ రోడ్లు, డ్రైనేజీ పనుల శిలాఫలకాలలో ప్రోటోకాల్ ఉల్లంఘనపై జిల్లా కలెక్టర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.

శిరసావహించిన కమిషనర్ అప్పటి కప్పుడే డిఇని, ఎఇని క్షణాలలో బదలీ చేసేశాడు.

ఏమిటీ దౌర్భాగ్యం? ఏమిటీ దగుల్బాజీతనం? ఈ అధికారులకు సిగ్గు లజ్జ, చీము నెత్తురు లేవా? వారిది మనిషి పుట్టుకేనా? ఒక రాజకీయవాది మతి చెడి పిచ్చి వాగుడు వాగితే మానం చంపుకొని భరించాలా? వారికి ఉద్యోగ సంఘాలు లేవా? ఇదేమి తప్పుడుతనం అని అడగలేరా? ఒళ్లమ్ముకొనే సెక్స్ వర్కర్ కూడా తన వృత్తిని గేలి చేస్తే నలుగురిలో నిలదీస్తుంది. ఆ మాత్రం మానమర్యాదలు కూడా లేని వారా మన అధికారులు. ఛీ... ఛీ... కంపరం కలుగుతున్నది.

కలెక్టర్ గారూ, మీరేమి చేస్తున్నారు? చిన్న ఉద్యోగులకు రాజకీయవాదులంటే భయం వుండడంలో అర్థం వుంది. కానీ ఐఎఎస్ చదివిన మీకు కూడా రాజకీయవాదులను చూస్తే వణుకేనా? మీ క్రింది ఉద్యోగులకు, అధికారులకు ఇంత నీచమైన అవమానం జరిగితే వారికి అండగా నిలవడం మీ బాధ్యత కాదా? అక్రమ బదలీలు ఆపడం మీ కర్తవ్యం కాదా?

వైఎస్ఆర్ కాంగ్రెస్ నేత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక్కడు ఈ దుర్మార్గం మీద స్పందన చూపాడు. భానుశ్రీ మీద నీకు మోజు వుంటే, సంపాదించిన అక్రమ ఆస్తి వందల కోట్లలో వుంది కాబట్టి, షాజహాన్ తాజ్‌మహల్ కట్టించినట్లు భానుశ్రీ మహల్ కట్టించి, పూజలు చేసుకో. అంతే తప్ప ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘించి, ఏ పదవీ లేని మహిళను పట్టపు రాణిగా చూడమని అధికారుల మీద ఒత్తిడి తెస్తే సహించనని ప్రకటన చేశాడు. ఈ అన్యాయం మీద చర్య తీసుకోమని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కానీ శ్రీధర్‌రెడ్డిది అరణ్యరోదనే తప్ప కలెక్టర్ గారిలో కదలిక లేదు.

ఈ పరిణామాలు చూస్తుంటే ఇదిపూరా, వల్లకాడా అన్న అనుమానం కలుగుతున్నది. సంస్కారానికి, నాగరికతకు, హూందాతనానికి, గౌరవప్రదమైన సాంప్రదాయాలకు పెట్టింది పేరైన నెల్లూరు నగరానికి ఈ దుర్గతి ప్రాప్తించడం ఆవేదన కల్గిస్తున్నది.

నెల్లూరు ప్రజల కోసమే విపిఆర్ కన్వెన్షన్ సెంటర్!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ప్రక్కన మాదరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి.

రేబాల లక్ష్మీనరసారెడ్డి కట్టిన టౌన్‌హాల్‌ను నెల్లూరీయులు ఏ విధంగా వినియోగించుకొంటున్నారో అదే విధంగా విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌ను కూడా ఉపయోగించుకోవాలని కన్వెన్షన్ సెంటర్ నిర్మాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రజలను కోరారు. కన్వెన్షన్ సెంటర్‌లో 15తేది విలేకరులతో మాట్లాడారు. పుట్టి నూరు కోసం ఏదో ఒకటి చేయాలన్న కోరికతోనే రాష్ట్రంలో అత్యద్భుత కన్వెన్షన్ సెంటర్‌ను కట్టించాను. దీని ద్వారా నేను డబ్బు సంపాదించుకోవాలనుకోవడం లేదు. నెల్లూరీయులు తమ కార్యాలకు దీన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాను. దీన్ని నా స్వంత ఆస్తిగా కూడా వుంచడం లేదు. ఒక ట్రస్ట్ దీని బరువు బాధ్యతలు చూస్తుందన్నారు. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మాదిరి వసతులు మెట్రోపాలిటన్ సిటీల్లోని కన్వెన్షన్ సెంటర్లలోనూ కనపడవు. కాని దీని బాడుగ మాత్రం మధ్య తరగతీయులు, సామాన్యులకు కూడా అందుబాటులో వుండేలా నిర్ణయిస్తామన్నారు. ఒకసారి మూడు వేడుకలు కన్వెన్షన్ సెంటర్‌లో చేసుకోవచ్చు. ప్రజలు 19తేదీ జరిగే శ్రీనివాస కళ్యాణం, 23, 24తేదీల్లో జరిగే శివమణి డ్రమ్స్ విన్యాసాలు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటకచ్చేరిలకు విచ్చేసి కన్వెన్షన్ సెంటర్‌ను క్షుణ్ణంగా వీక్షించి వెళ్లవచ్చన్నారు. నవంబర్ 15తేది నుంచి దీనిలో ఎటువంటి కార్యక్రమాలనైనా ఏర్పాటు చేసుకొనేందుకు సర్వం సిద్ధంగా వుంచుతామన్నారు.

పేద పిల్లల కోసం ఉచిత స్కూల్

కన్వెన్షన్ సెంటర్ ప్రక్కనే అద్భుత విద్యా వసతులతో పేద పిల్లల కోసం వివేకానంద కేంద్రం సహకారంతో ఒక స్కూల్ నిర్మిస్తానని, జనవరి నెలలో దీని పనులు మొదలవుతాయన్నారు.

నెల్లూరీయులు మెచ్చుకొంటారు!

నెల్లూరీయులందరి కోసం ఒక మంచి కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుడతానని దీని వివరాలను ప్రస్తుతం వెల్లడించనని ప్రభాకర్‌రెడ్డి చెబుతూ ఈ కార్యక్రమం చేశాక నెల్లూరీయులు తనను మెచ్చుకొంటారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి 'భరోసా'!

గృహ వాస్తు శీర్షికకు 22 ఏళ్లుగా వస్తున్న ప్రశ్నలు, చూపుతున్న పాఠకాదరణ, వాస్తు, జ్యోతిష శాస్త్రాలకు, భారతీయ ప్రాచీన సంస్కారయుతమైన చరిత్రకు లభిస్తున్న గౌరవంగా నేను భావిస్తున్నాను. ఉత్తరాల ద్వారా, ఫోను ద్వారా అందుతున్న ప్రశ్నలకు సమగ్రంగా సమాధానం ఉండాలంటే ప్రశ్నలు ప్రణాళికాబద్ధంగా ఉండాలి. తగిన ప్లాను, వ్యూ ఫోటోలు, స్థల వివరణలు జత పరచాలి. అలాంటప్పుడు మాత్రమే సమస్యల్ని పూర్వగ్రంథాలు, శాస్త్రాలతో విశ్లేషించుకొని, అధ్యయనం చేసుకొని పరిపూర్ణమైన జవాబు ఇవ్వడానికి వీలు కలుగుతుంది. చాలా మంది పాఠకులకు కొన్ని సూచనలను ఈ క్రింద ఇస్తున్నాను. తగిన విధంగా అర్థం చేసుకుని సహకరిస్తారని విశ్వసిస్తున్నాను.

ఆపదలు, మరణాలు! ముందే మేలు కొంటే మేలు!!

కావలి, బెంగుళూరు, చెన్నై, చిత్తూరు నుంచి కొందరిలా రాశారు. శంఖుస్థాపన చేసి గృహ నిర్మాణం ప్రారంభించాక కుటుంబ సభ్యులకు ఆపదలు వచ్చి కాళ్లు, చేతులు విరగడం, కుటుంబ సభ్యులు మరణించడం జరిగిందని వ్రాశారు.

స్థలంలో నిర్మాణ సమయంలో ట్రయిల్ పిట్స్ (రెండడుగుల లోతు గుంతలు) కొన్ని తీసి భూమిలో ఎముకలు, బొగ్గులు, వెంట్రుకలు వంటి దుశ్శక్తి పదార్థాలు వున్నాయేమోనని చూడాలి. ఉంటే వాటిని తీసివేసి స్థల శుద్ధి చేయాలి.

నిర్మాణాల్లో వాస్తుదోషాలు లేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా గృహం శ్లాబు పడ్డాక ప్రతి గది లోనూ బెడ్‌ల్యాంపులు రాత్రిళ్లు వెలిగేలా చేయాలి. అట్లా చేయకపోతే కొన్ని శక్తుల చేరిక(ఆవాహన) జరిగి గృహస్తులకు చెడు జరిగే అవకాశం వుంది. అందువల్ల గృహవాస్తు శాస్త్రవేత్త ఆధ్వర్యంలో గృహ నిర్మాణం చేయడం చాలా ముఖ్యం. పై పాఠకులు తమ గృహాలు ఏ దిక్కులో వున్నదీ, గృహ నిర్మాణ ప్లానును పంపడం చేయలేదు. అందువల్ల పూర్తి ఫలితాల్ని విశ్లేషించడం కష్టం. ఉత్తరంలోని అంశాల్నిబట్టి శాస్త్రవేత్త తన మేధాశక్తితో కొన్ని నిర్ధారణలకు వచ్చి జవాబులివ్వవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల వాస్తు సమస్యను పంపేటప్పుడు ఇంటి రాజవీధి, ప్లాను, వీలైతే వ్యూఫోటో, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు క్షుణ్ణంగా రాయగలగాలి.

భయాల్ని వీడండి – ప్రశ్నలు అడగండి!

అనుమానాలు, పెనుభూతాల్లాంటివి. అవి శరీరాన్ని, మనసును కూడా తొలచి వేస్తాయి. అట్లాంటి వారినెవరినైనా(చెడును గురించి మాత్రమే చెప్పే వారిని) దగ్గరకు చేరనీయకండి. ప్రశ్నల్ని స్పష్టంగా, క్షుణ్ణంగా, యదార్థంగా చెప్పండి.

ఆరోగ్యం, ఆర్థికం, సామాజికం, మానసికం జీవితంలో ఏవైనా సరే సమస్యలకు పరిష్కారాలున్నాయి. శాస్త్రం తల్లిలాంటిది. మీరంతా పిల్లలు. సర్వజన శ్రేయస్సే శాస్త్రజ్ఞుడి లక్ష్యం – లక్షణం. సమస్యలతోబాటు ప్లాను పంపండి.

వధూవరులు – సందిగ్ధతలు!

మీరు ఒకరినొకరు అర్థం చేసుకోండి. సంతోషంగా వుండండి. శాస్త్రపరంగా ఏ అనుమానాలూ పెట్టుకోకండి. దోషాల్ని గురించి గుడ్డిగా విశ్వసించకండి. సమస్య ఎంతటిదైనా స్పష్టంగా రాయండి. సమస్యకు పరిష్కారం వుందని నేను మీకు హామీ ఇవ్వగలను. కొందరు సంస్కారంలేని వాళ్లు దోషాల్ని అంటగట్టి ఒత్తిడికి గురిచేస్తే మీరు అపోహలకు గురి కాకండి. ఉత్తరం, ఫోను, వ్యక్తిగతంగా మీ సమస్యను చెప్పండి. సమస్యకు వెంటనే పరిష్కారం చెబుతాను. ధైర్యంగా ముందుకురండి!

గృహ(కుటుంబ)సభ్యుల ఆనందమే శాస్త్ర పరమావధి!

శాస్త్రజ్ఞుడిగా పాతికేళ్ల అనుభవంతో స్త్రీ, పురుషులు ఒకరి క్షేమాన్ని ఒకరు కాంక్షిస్తూ, పిల్లల భవిష్యత్తును ఆలోచిస్తూ, శాస్త్రపరంగా ఉన్నవీ లేనివీ ఊహించుకొని, అనేక ప్రశ్నలతో మధన పడుతుంటారు. ఒత్తిళ్లకు గురౌతుంటారు. శాస్త్రం మీ ముందుంది ధైర్యంగా సమస్యను చెప్పి పరిష్కారం తూ.చ తప్పకుండా చేసుకోండి. సమస్య నుండి బయట పడతారు. అయితే దాపరికం లేని పూర్తి వివరాలు రాయండి. పేర్లు బహిర్గతం కావడం ఇష్టం లేకపోతే పొడి అక్షరాలతో రాయండి. (బివిఆర్, ఆర్.వివిఆర్‌లాగా)

నిర్మాణం నుంచి చివరి వరకూ శాస్త్రవేత్త పర్యవేక్షణ!

మీరు ఆస్పత్రికి వెళ్లే ముందు మంచి డాక్టర్ని గురించి ఎట్లా వాకబు చేస్తారో, శాస్త్రజ్ఞుడి విషయంలో కూడా ఆ పద్ధతినే పాటించండి. గృహ నిర్మాణ ప్రారంభం నుంచి చివరివరకు ప్రతిభావంతుడైన శాస్త్రవేత్త ఆధ్వర్యం ఉండేలా చూడండి. వాస్తు దోషాలు వుండవు. వృక్షవేధలు బాధించవు. నిర్మాణాల్ని పగులగొట్టుకొనే అవస్థలు తప్పుతాయి.

దంపతీ తేదీ, సమయం, నక్షత్రాలు చెప్పండి!

వాస్తు నిర్మాణ సమయంలో గ్రహ బలాన్ని బేరీజు వేయడం చాలా ముఖ్యం. తేదీ, సమయం, నక్షత్రాలుంటే బేషు. లేకుంటే ఇంటి పేరు, పూర్తి పేరు, తల్లితండ్రుల పేర్లు, పుట్టిన ఊరు వివరాలు అందజేస్తే జ్యోతిషం ప్రకారం 'గ్రహస్థితి'ని గణించి వాస్తుతోబాటు జ్యోతిషరీతుల్ని కూడా సవరించి గృహస్తు సమస్యలకు దూరంగా వుండేలా చేయవచ్చు.

గృహ సమీప మత నిర్మాణాలు విశ్లేషణ తప్పనిసరి!

గృహం నిర్మించేటప్పుడు దానికి సమీపంలోని దేవాలయ, మసీదు, చర్చిలాంటి వాటిని గురించి, దర్గాలను గురించి శాస్త్రజ్ఞుడికి తెలియజేయడం తప్పని సరి. అందువల్ల ఆయా వేధల నుంచి గృహానికి శాస్త్రవేత్త విముక్తి ప్రసాదించ గలుగుతాడు.

నిర్మాణ రీతులు, అంశాల్లో వాస్తు తప్పనిసరి!

గృహ నిర్మాణంలోని తాపీమేస్త్రీ, కార్పెంటరీ, ప్లంబరింగ్, పెయింటింగ్స్, గ్రిల్స్ వంటి అనేక విభాగాలు కూడా వాస్తు ప్రకారమే అనుసరించాలి. శాస్త్రజ్ఞుడి పర్యవేక్షణ వున్నపుడు మాత్రమే ఈ విభాగాలలో సత్ఫలితాలు కనిపిస్తాయి.

అపార్టుమెంటు, ప్లాట్ల విషయంలో అప్రమత్తత!

అపార్టుమెంటు వాస్తురీత్యా నిర్మించబడింది అనే ప్రకటనల్లో ఏమాత్రం నిజం వుండదు. అందువల్లే అపార్టుమెంటులో వాస్తును గురించి వెతుకుతున్నారా? అన్న హాస్యోక్తులు పుట్టాయి. అందువల్ల ప్లాటు ప్రారంభం నుంచే శాస్త్రవేత్త పర్యవేక్షణ వుంటే బయట సంగతి వదిలేస్తే, గృహం లోపలి భాగం లోనైనా వాస్తు సమకూరే అవకాశం వుంది.

జ్యోతిష, వాస్తు శాస్త్ర సందిగ్ధతలపై పాఠకులతో ముఖాముఖి!

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

గృహ నిర్మాణంలో 'త్రివిధ' శక్తుల 'ఆచరణ'!

గృహ నిర్మాణంలో వసతికి ఆరోగ్యకరమైన పరిస్థితుల్ని వాస్తు, సూక్ష్మశక్తి సమతుల్యతను, గ్రహస్థితి, ఉచ్ఛతను జ్యోతిషము అందిస్తాయి. ఇక మిగిలింది 'విధి' దీని స్థానం 'ప్రార్థన గది'. వీటిని 'త్రివిధ' స్థానశక్తి పటిష్టత అని శాస్త్రం అంటుంది. ఈ మూడు అంశాల్లో గృహస్తు సమతుల్యత పాటిస్తే ఏ విషయంలోనూ సమస్యలు రావు.

ప్రశ్నలు ఎలా, ఏ రూపంలో వుండాలి?

ప్రశ్న వ్యక్తిగత, కుటుంబ, సామాజిక సమస్యలలో ఏ ఒక్కదానికైనా సంబంధించిందై వుండాలి. శాస్త్రం సమాజానికి బాధ్యత వహిస్తుంది. అందువల్ల శాస్త్రజ్ఞుడిని పరీక్షించే విధమైన వ్యర్థమైన ప్రశ్నలు వేయకూడదు. యువకులు ఎక్కువగా ప్రేమ ఫలిస్తుందా? వంటి ప్రశ్నలు వేస్తుంటారు. దీనికి నా సమాధానం శాస్త్రం 'మంచి జోడీ' (జీవిత భాగస్వామిని) గురించి చెబుతుంది. ప్రేమ విజయాలూ, వైఫల్యాల గురించి చెప్పదు.

వృక్షవేధ! వృక్ష రక్షణకు సహకరించండి!!

చెట్లు, వృక్షాలు వున్నప్పుడు తీసివేయడం శాస్త్రం సమ్మతించదు. వృక్షాలపై వనదేవతలు నివసిస్తుంటారు. వృక్షాలు ఇంటికి ఎప్పటికీ దోషాలు కావు. వృక్ష నిర్మూలన సమయంలో అవి చనిపోతూ శపిస్తాయని విశ్వామిత్ర, అగస్త్య మహర్షులు దృఢంగా చెప్పారు. వృక్ష వేధ మహా బాధ అంటాడు శ్రీకృష్ణుడు. వృక్షాల్ని తీసివేసిన వ్యక్తుల శాపగ్రస్త జీవితాల్ని నేను కళ్లారా చూశాను. అందువల్ల వృక్షాల జోలికి వెళ్లకండి. వృక్షాలు భూమి మీద పూర్తిగా నశించిపోతే మనిషి తర్వాత (జీవరాశి) అయిదు, పది సంవత్సరాలకు మించి బ్రతకడని అమెరికా శాస్త్రవేత్తల బృందం ఇటీవల 'చికాగో'లో తీర్మానించింది.

చతుర్శాస్త్రాలపై ప్రశ్నలు సంధించండి!

జ్యోతిష, వాస్తు, ఆగమ, హిందూ ధర్మ శాస్త్రాలపై శాస్త్ర విద్యార్థులు, శ్రద్ధాసక్తులున్న వారు గృహస్థులలో సంశయం కలిగిన వారు నిర్భయంగా, నిర్మొహమాటంగా ప్రశ్నలు పంపండి. ఇందులో కుల, మత బేధాలు లేవు. శాస్త్రం అందరిదీ. అందరికీ తల్లి వంటిది.

వరుస మృత్యువులు!

దేశంలోని పలు రాష్ట్రాల శాస్త్రవేత్తలు బెంగుళూరు సభల్లో ఒక వింత విషయాన్ని ప్రస్తావించారు. కొన్ని గృహాల్లో వరుస మరణాలు సంభవించి కుటుంబం నిశ్శేషం అవుతుండడాన్ని వారు విశదీకరించారు. ఇందుకు కోణ, దృష్టి, అంధక వేధలతోబాటు ఆరోగ్య సమస్యలు కూడా కారణం. అందువల్ల వాస్తు, జ్యోతిష శాస్త్రాల దోషాలే కాకుండా, వ్యక్తులు తీవ్ర అనారోగ్య సమస్యలకు కూడా కారణమవుతున్నాయని అక్కడ మేము నిర్ధారించడం జరిగింది. శాస్త్ర పరిష్కారాలు చేసుకుంటూనే నిష్ణాతులైన వైద్యుల్ని సంప్రదించాలన్నది నా అభిప్రాయం.

భౌగోళిక పరిస్థితులు వాస్తు నిర్ధారణలు!

తాలుకా, జిల్లా, రాష్ట్ర, దేశ దిక్కుల, హద్దులను బట్టి కూడా ఆయా ప్రదేశాల ఆర్థిక, ఆరోగ్య, సామాజిక, రాజకీయ అభివృద్ధి పురోగమన, తిరోగమనాల్ని బేరీజు వేయవచ్చు. ఇది పరిజ్ఞానానికి, అవగాహనకూ సంబంధించిన శాస్త్ర అంశం. విద్యార్థులు, మేధావులు ఈ అంశాలపై పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి ప్రశ్నల్ని, అభిప్రాయాల్ని తెలియజేయవచ్చు.

శాస్త్రాన్ని ఆయుధంగా స్త్రీలపై సంధించకండి!

సమాజంలో స్త్రీల పరిస్థితి దిగజారింది. అడ్డూఆపూలేని విధంగా వారిపై మగజాతి బరితెగించి పోతోంది. మగవాళ్లకు అమ్మ, ఆడబిడ్డలు కొందరు సహకరిస్తున్నారు. మొత్తానికి స్త్రీని ఒత్తిడికి, హింసకు గురి చేయాలన్న శాడిజం పెరిగిపోతుంది. నాకు వస్తున్న ప్రశ్నల్లో "మా కోడలు,

కొరవ 14వ పేజీలో

రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లపై తనిఖీలేవి?

గత వారం దేవిస్‌పేటలోని స్టార్ ఆగ్రో మెరైన్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అమ్మోనియా వాయువు లీకై వంద మంది అస్వస్థులయ్యారు. దాహం వేస్తే బావి తవ్వుకొన్న చందంలా ఒక ప్రమాదం జరిగిన తర్వాతగానీ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేయాలన్న ఆలోచన జిల్లా అధికారులకు రాకపోవడం విచారకరం.



అమ్మోనియా గ్యాస్ లీకేజి బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ శ్రీకాంత్, ఎస్పీ రామకృష్ణ.

జిల్లాలో ఏర్పాటై వున్న రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లపై అధికారులు చాలా సంవత్సరాల తర్వాత స్పందించారు. ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరిగి ఆసుపత్రి పాలైతేనే మన అధికారుల్లో కాస్త చలనం వస్తుంది. లేకుంటే ప్రాసెసింగ్ యూనిట్ల వైపు కన్నెత్తి కూడా చూడరు. 25 ఏళ్ల క్రితం జిల్లాలో రొయ్యల సాగు ప్రారంభమైంది. మొదట్లో తీరప్రాంతంలోని ఉప్పు భూముల్లో ప్రారంభమైన రొయ్యల సాగులో బాగా లాభాలు రావడంతో వ్యవసాయ భూములను సైతం రొయ్యల గుంటలుగా మార్చేశారు రైతులు. తీరప్రాంతంలో రొయ్యలసాగు అధికం కావడంతో ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఏర్పాటుచేసి ఎగుమతులు చేసేవారు. పెద్ద పెద్ద కంపెనీలు జిల్లాలో వీటిని ఏర్పాటు చేశాయి. ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి అనుమతులు మంజూరు చేయడంలో అధికారులు చాలా ఉదాసీనంగానూ, నిర్లక్ష్యంగానూ వ్యవహరించడం వలన ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి.

గతంలో వివిధ యూనిట్లలో ప్రమాదాలు జరగ్గా అవి బయటకు పొక్కకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు. గత వారంలో దేవిస్‌పేటకు సమీపంలోని స్టార్ ఆగ్రో మెరైన్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అమ్మోనియా వాయువు లీకై వంద మందికి పైగా అస్వస్థతకు గురి కాబడ్డారు. ఈ యూనిట్ నెల్లూరు నగరానికి దగ్గరగా వుండడంతో ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించేందుకు ఇబ్బంది కలుగలేదు. ఇక్కడ దినసరి కూలీలుగా పనిచేసే వారిలో అధిక భాగం మహిళలు వున్నారు. కంపెనీ యాజమాన్యం సరైన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో అమ్మోనియా లీకైందని బాధితుల బంధువులు ఆరోపించారు. ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వదిలే వ్యర్థాలు సమీప సాగునీటి కాల్వల్లోకి వదులుతుంటారు. ఈ వ్యర్థాల కారణంగా నీరు కలుషితమై పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టార్ ఆగ్రో మెరైన్ కంపెనీ పనితీరుపై రైతు సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

ప్రమాదాలు జరిగిన తర్వాత తనిఖీలు చేసే కంటే ముందుగా ప్రమాదాలు జరగకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ అధికారులు ఏనాడు కూడా రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీలు చేసిన దాఖలాల్లేవు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రొయ్యల ప్రాసెసింగ్ చేస్తున్నట్లు వీటి నిర్వాహకులు చెబుతున్నా ప్రమాదాల నియంత్రణకు మాత్రం ఏ మేరకు చర్యలు తీసుకొంటున్నారో ఈ సంఘటన బట్టి అర్థమవుతుంది. స్టార్ ఆగ్రో మెరైన్ కంపెనీలో ప్రమాదం జరిగిన సమాచారాన్ని తెలుసుకున్న వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకుని పరిశీలించి, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించడం జరిగింది.

నగరంలోని రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, జిల్లా ప్రభుత్వ వైద్యశాలలు క్షతగాత్రుల బంధువుల రోదనలతో దద్దరిల్లాయి. ఉదయం పనికి వెళ్లిన వారికి ఏమైందో తెలియక వారి కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందడం కనిపించింది. ప్రమాదానికి కారణమైన యూనిట్‌పై క్షతగాత్రుల బంధువులు ఎక్కడ దాడి చేస్తారోనని ముందుగానే అక్కడ పోలీసులను బందోబస్తు నిమిత్తం నియమించారు. జరిగిన సంఘటనపై ఇందుకూరుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు బాధ్యతలను రూరల్ డిఎస్పీ బాల వెంకటేశ్వరరావుకు అప్పగించారు. జిల్లావ్యాప్తంగా వున్న రొయ్యల ప్రాసెసింగ్ చేసే కంపెనీలను తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతుల సంక్షేమమే ధ్యేయమని చెబుతున్న రైతు సంఘాల నేతలు ఇటువంటి కంపెనీలపై మెతక వైఖరి అవలంభించడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.

దర్యాప్తు బాధ్యతలు తీసుకున్న రూరల్ డిఎస్పీ కంపెనీ ఏర్పాటుకు జారీచేసిన అనుమతుల దగ్గర నుండి ప్రమాదం జరిగిన తీరు వరకు సమగ్రంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం వుంది.

భలే తహశీల్దార్లు

తుఫాన్ వస్తుందన్నా పత్తాలేని తహశీల్దార్లు!

పై-లిన్ తుఫాన్ ముంచుకొస్తున్నందున 11వ తేది సమ్మెలో ఉన్న రెవిన్యూ అధికారులు, సిబ్బంది విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించినా, జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో విధులు నిర్వహించిన తహశీల్దార్ ఒక్కరూ లేకపోవడం ఆశ్చర్యపరుస్తుంది.

తుఫాన్ ప్రభావం జిల్లాపై పడే అవకాశం వుండ వచ్చని రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా ప్రభుత్వ శాఖల ఉద్యోగులు గత రెండు నెలల నుండి సమ్మె చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారడంతో గ్రామాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు రెవిన్యూ అధికారులు, సిబ్బంది విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రధానంగా సముద్ర తీర ప్రాంత మండలాల్లో పనిచేసే తహశీల్దార్లు విఆర్వోలు, ఇతర శాఖల అధికారులు విధులకు తప్పనిసరిగా హాజరు కావాల్సి వుంది. ఎన్టీఓ రాష్ట్ర అధ్యక్షుడు కూడా తుఫాన్ దృష్టిలో వుంచుకుని విధుల్లో చేరాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.

కానీ జిల్లాలో ఒక్క తహశీల్దార్ కూడా విధులకు హాజరు కాలేదు. ఈ నెల 9వ తేది ఉదయం నుండి వాతావరణంలో మార్పులు ఏర్పడి భారీ వర్షాలు కురిశాయి. తహశీల్దార్లు సమ్మెలో వుండడంతో తీరప్రాంత ప్రజలకు అవసరమైన సమాచారం అందించే వారు లేకుండా పోయారు. తహశీల్దార్లు కార్యాలయానికి వస్తారని ఆయా మండలాల విఆర్వోలు, గ్రామ సహాయకులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఎదురుచూసి ఇంటికి వెళ్లిపోయారు. విద్యుత్ ఉద్యోగులు సమ్మె చేస్తున్నా తుఫాన్ దృష్ట్యా కోత విధించలేదు. తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు టీవీల్లో తుఫాన్ గురించి ప్రసారం చేసే వార్తలు వింటూ కాలం గడిపారు. వాతావరణ శాఖ హెచ్చరించిన విధంగా తుఫాన్ వచ్చి వుంటే ఊహించని నష్టాలను చవిచూడాల్సి వచ్చేది.

ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్ మాసాల్లో తుఫాన్లు సంభవిస్తుంటాయి. జిల్లాలోని కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, తడ, సూళ్లూరుపేట, తదితర మండలాలు తుఫాన్ తాకిడికి గురవుతుంటాయి. ఇంకా జిల్లాలో వ్యవసాయ పనులు ప్రారంభం కాకపోవడం వల్ల వరిపంటకు నష్టం వాటిల్లదు. గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం వుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ హెచ్చరికలను దృష్టిలో వుంచుకుని ముందు జాగ్రత్త చర్యగా సముద్రం అంచున వున్న మత్స్యకారులను సురక్షిత ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వ ఆదేశించింది. అయితే ప్రభుత్వం గట్టి ఆదేశాలు జారీచేసినా రెవిన్యూ అధికారుల్లో ఏమాత్రం స్పందన కానరాలేదు.

తీర ప్రాంతంలోని 13 మండలాలకు ప్రత్యేకాధికారిగా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారుల్ని కలెక్టర్ నియమించారు. ప్రత్యేకాధికారులకు తహశీల్దార్లు సహాయకులుగా వ్యవహరించాల్సి వుంటుంది. రెవిన్యూ శాఖతోపాటు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, భారీ వర్షాల కారణంగా అంటు వ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలను నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. తుఫాన్ ముప్పు ముంచుకొస్తే ఎదుర్కొనేందుకు మండలాల్లో అధికారులు కనిపించని పరిస్థితి దారుణమనక తప్పదు.



రామయ్యా విసిగించావయ్యా!

✍ అల్లూరు రహీం

ఎన్టీఆర్ పేరు వింటే అభిమానులకు పూనకం వస్తుంది. ఎన్టీఆర్ అంటే దర్శకులకు సమ్మోహన శక్తి. ఎన్టీఆర్ అంటే నిర్మాతలకు కాసుల వర్షం కురిపించే నిధి. ఆయన సంభాషణలు పలికే చాతుర్యానికి ఎవరైనా చప్పట్లు కొట్టాల్సిందే. నాట్యంలో మెరుపు వేగం చూపిస్తాడు. పాత్రలో ఒదిగిపోవడం, కొత్త వన్నెలు తీసుకోవడం ఎన్టీఆర్‌కే సాధ్యం. దర్శకుడు హరీష్ శంకర్ గబ్బర్ సింగ్ చిత్రాన్ని జనరంజకంగా తీసి పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్నాడు. ఎన్టీఆర్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో దిల్ రాజు నిర్మాతగా వ్యవహరించి తీసిన రామయ్యా వస్తావయ్యా చిత్రంపై విడుదలకు ముందు ఎన్నో అంచనాలు పెరిగాయి. మీరు ఎన్ని అంచనాలు పెట్టుకొనైనా థియేటర్లకు రండి. సినిమా చూశాక అందరూ 'ఇది సూపర్ హిట్' అంటారు అని నిర్మాత దిల్‌రాజు కూడా ఈ చిత్రం ఆడియో ఫంక్షన్‌లో భరోసా ఇచ్చాడు. బృందావనం తర్వాత సరైన హిట్‌లేని ఎన్టీఆర్ కూడా రామయ్యా వస్తావయ్యా కోసం కష్టపడి డ్యాన్స్‌లు, ఫైట్లు చేశాడు. బాగా తగ్గి స్లిమ్ అయ్యాడు. లవర్ బాయ్‌లా మారాడు. ఎన్నో చేశాడు కానీ కథ, కథనంలో సత్తా లేక పోవడం వల్ల రామయ్యా వస్తావయ్యా బలహీనపడి పోయింది. ప్రథమార్థమంతా సాదాసీదాగా తీసిన దర్శకుడు హరీష్ శంకర్ ద్వితీయార్థంలోనూ ప్రేక్షకులను మెప్పించలేకపోయాడు. మాటలు, పాటల చిత్రీకరణ, నృత్యాలు, ఫైట్లు, లొకేషన్లపై పెట్టిన శ్రద్ధ కథనంపై పెట్టలేకపోయాడు. దీని వల్ల చిత్రం చూస్తున్న ప్రేక్షకులు విసుగుకు లోనవుతారు. ఈ సినిమాలో కామెడీ ట్రాక్‌లేని లోటు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కేంద్ర మహిళా సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా అద్భుత విలనీయం ప్రదర్శించిన రవిశంకర్ నోట పలికించిన బూతు మాటలు హాల్‌లో కుటుంబసమేతంగా సీట్లలో కూర్చుని ఉన్న వాళ్లను ఇబ్బంది పెడుతాయి. ఎందుకో దర్శకుడు ఈ చిత్రంలో చాలా మంది నటీనటులను కిండల్ చేయించాడు. దిల్ రాజు తీసిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాపై కూడా సెటైర్ ఉండడం ఆశ్చర్య పరుస్తుంది. మీడియాను సైతం ఎందుకు వదలాలని తక్కువ చేయించి మాట్లాడించిన తీరు హర్షణీయం కాదు.

చిత్ర సమీక్ష

సినిమాలో దర్శకుడు హరీష్ శంకర్ వ్రాసిన డైలాగులు మాత్రం బాగున్నాయి. నిక్కర్లు వేసుకొనే సమయంలోనే రికార్డులు మడతపెట్టి జేబిలో పెట్టుకొన్నా. చట్టం అందగా ఉంటుందనే ధైర్యంతోనే తప్పులు చేస్తున్నారు. పగ తీరినంత మాత్రాన బాధ తీరదు. పక్కవాడి బాధకు ఏడ్చేవాడే మనిషి. మనుషులను క్షమించే శక్తి దేవుడికే ఉంటుంది ఈ కోవలోనివే. చిత్రంలో పండుగ చేస్కో, ఓ లైలా, కుర్ర ఈడు, జాబిల్లి నవ్వే, నేనెప్పుడైనా పల్లవులతో మొదలయ్యే పాటలు కెమెరామెన్ చోటా కె నాయుడు అద్భుత చిత్రీకరణ వల్ల చూడాలనిపిస్తాయి. హీరోయిన్లలో సమంతకన్నా ఒకే ఒక్క పాటలో నర్తించే శృతిహాసన్ ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. ఆమె క్యారక్టర్‌ను మాత్రం దర్శకుడు ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దాడు.

చిత్ర కథ గూర్చి పెద్దగా చెప్పుకోవాల్సింది ఏదీ లేదు. హైదరాబాద్‌లో చదువుకొంటుండే ఆకర్ష(సమంత)ను నందు(ఎన్టీఆర్) ఒక పథకం ప్రకారం ప్రేమిస్తాడు. ఆమె అతనిది నిజమైన ప్రేమని నమ్మి అక్క పెళ్లికి స్వంత ఊరికి తీసుక వెళ్తుంది. పెళ్లయ్యాక ఆకర్ష తండ్రి ముసల్లపాడు నాగభూషణం(ముఖేష్ రుషి), ఆయన తమ్ముడు, అనుచరులనంతా నందు ఊచకోత కోస్తాడు. దీనికో ఫ్లాష్‌బ్యాక్ ఉంటుంది. ఆదిత్యపురంలో జమీందారి కుటుంబీకుడైన నందును అమ్ములు (శృతిహాసన్) ఎంతో ఆకర్షిస్తుంది. గ్రామంలో ప్రతి సమస్యపై పోరాటం చేసే అమ్ములును ఇక్కడ ఉక్కు ఫ్యాక్టరీ కట్టను సంకల్పించిన నాగభూషణం మనుషులు కేంద్ర మంత్రి భిక్షపతిని(రవి శంకర్)ను శంకుస్థాపనకు పిలిపిస్తారు. దీన్ని అడ్డుకోను వచ్చిన అమ్ములును చూసిన భిక్షపతి ఆమె పొందు కోరుతాడు. నిరాకరించడంతో ఆమెను చంపేస్తాడు. విషయం తెలుసుకున్న నందు శత్రు సంహారానికి దిగడంతో చిత్రం పరిసమాప్తమవుతుంది. ఈ పేలవ కథకు ఎన్ని హంగులు దిద్దితే అది జనరంజకమవుతుంది?

అత్తను కూల్‌చేసిన కోడలు!



రణబీర్‌కపూర్, కత్రినాకైఫ్ స్పెయిన్ బీచ్‌లో బికినీలో కనపడిన తర్వాత కత్రినాకైఫ్ ముంబాయిలో కనపడుతుండడం లేదన్నారందరు. ఫంక్షన్లు, పార్టీలకు ఆమె పూర్తిగా మొహం చాటేసింది. ఐతే తన సోదరి పెళ్లి పనుల్లో బిజీగా వుండడం వల్ల ఫంక్షన్లకు హాజరు కావడం లేదంది. రణబీర్, కైఫ్ తరచూ కనబడే కృష్ణరాజ్ రెసిడెన్సీలోనూ ఈమె జాడ లేదు. మొత్తానికి ఏదో జరిగింది. రణబీర్ కుటుంబంతో ఆమె సంధి ప్రయత్నాలు ఫలించాయి. మొన్నటికి మొన్న రిషీకపూర్ జన్మదిన వేడుకల్లో కైఫ్ తళుక్కుమంది. కాకపోతే రణబీర్‌తో చిట్ చాట్ చేయలేదు కానీ... సమయాన్ని అత్తామామలు రిషీకపూర్‌తోనూ, నీతూ కపూర్‌తోనూ గడిపేసి ఎంచక్కా అందరికీ గుడ్‌బై చెప్పి వెళ్లిపోయింది. కత్రినా కైఫ్‌తో సంబంధానికి నీతూ ఒప్పుకుందా? అంటే ఔననే అంటున్నారు వారి కుటుంబ సన్నిహితులు.

నేను చెయ్యను పొండి!



హీరోయిన్ హుమా ఖురేషి నటనను గాంగ్స్ ఆఫ్ వసేపూర్ సినిమా చూసిన వారెవరైనా మర్చిపోరు. ఈ సినిమాలో ఆమె నటన మెచ్చి దర్శకుడు అనీస్ బాజ్మీ, వెల్ కమ్ బ్యాక్ చిత్రంలో ఓ ఐటెమ్ పాటలో నర్తించమన్నాడట. జాన్ అబ్రహాం ఈ చిత్రంలో హీరో. కానీ ఈ పాటలో నర్తించనని హుమా చెప్పిందట. ఇలా చెప్పడానికి కారణాలను ఆరాతీస్తే ఆమె భారీ మొత్తంలో పారితోషికం అడిగిందట. డేట్స్ అడ్జస్ట్ చేయాలంటే ఇంకాస్త మొత్తం కావాలం దట. దీంతో హుమాని కాదని శృతిహాసన్‌కు దర్శకుడు ఈ అవకాశం ఇచ్చాడంటున్నారు. 2007లో విడుదలైన వెల్‌కమ్ చిత్రానికి సీక్వెల్‌గా వెల్ కమ్ బ్యాక్ తయారవుతుంది.

ఆయనపై ఆసక్తి లేదు!



సంచలనాత్మక వ్యాఖ్యలతో నిత్యం వివాదాల్లో మునిగితేలే బాలీవుడ్ సెక్సీగాళ్ మల్లికా షెరావత్ మళ్లీ వార్తల్లో వ్యక్తిగా నిలిచింది. బిజెపి ప్రధాని అభ్యర్థి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడి భారత్‌లోనే అత్యంత అర్హుడైన బ్యాచిలర్ అంటూ ఆ మధ్య కితాబిచ్చిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు కాంగ్రెస్ యువరాజా రాహుల్ గాంధీపై నిర్మొహమాటంగా వ్యాఖ్యానించింది. రాహుల్‌పై తనకెలాంటి ఆసక్తి లేదని పేర్కొంది. మోడీ మాత్రమే పర్‌ఫెక్ట్ బ్యాచిలర్ అని తాను ఇప్పటికీ ఎప్పటికీ చెబుతానంటోంది. రాహుల్‌పై ఎలాంటి ఇష్టం లేదని చెప్పడానికి తాను మొహమాటపడనవసరం లేదంటోంది మల్లిక. మోడీ కోసం తాను ఏమైనా చేస్తానని, తాను నటించే టీవీ రియాల్టీ షోలో ఆయన్ను ఎప్పటికైనా చూస్తానని ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

డోల్బీ అట్మోస్‌లో ధూమ్-3



ప్రేక్షకులకు వినూత్న అనుభూతిని కలిగించేలా ధూమ్-3 చిత్రం తొలిసారిగా డోల్బీ అట్మోస్ సౌండ్ సిస్టమ్‌లో విడుదలవుతోంది. అధునాతన శబ్ద పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందున ప్రేక్షకుల నుంచి మంచి స్పందన ఉంటుందని డోల్బీ లేబొరేటరీస్, యశ్‌రాజ్ ఫిలింస్ ప్రతినిధులు చెబుతున్నారు. యాక్షన్, అడ్వెంచర్ థ్రిల్లర్‌గా రూపొందిన ధూమ్-3లో నూతన సాంకేతికత ప్రేక్షకులకు మరపురాని అనుభూతి కలిగిస్తుందని వారంటున్నారు. మాటలు, పాటలు, యాక్షన్ సన్నివేశాల్లో శబ్దపరంగా ఇది కొత్త ప్రయోగమంటున్నారు. సరికొత్త సాంకేతికత పద్ధతిలో సంగీతాన్ని అందిస్తున్న ఘనత బాలీవుడ్‌లో ధూమ్-3కే దక్కుతుందంటున్నారు.

డయానా హేడెన్ పెళ్లి!



ప్రపంచ సుందరి పెళ్లంటే మాటలా! డయానా హేడెన్ తన బాయ్ ఫ్రెండ్ కాలిన్‌డిక్‌ని అమెరికాలో ఇటీవల పెళ్లి చేసుకొంది. కాలిన్ అమెరికా పౌరుడు. ప్రస్తుతం అతడు ముంబైలోని ఒక అంతర్జాతీయ సంక్షేమ సంస్థకు అధిపతి. ఇరువురికి పరిచయం కలిగింది కొద్ది నెలల క్రితమే. అయినా జీలకర్ర, బెల్లంలా ఇద్దరి మనసులు ఏకమై పెళ్లి చేసుకోవాలనుకొన్నారు. రాణి తలచుకొంటే ఏర్పాట్లకేం కొదువ? ప్రఖ్యాత ఇండియన్ డ్రస్ డిజైనర్ అర్చనా కొచర్ వధూవరుల వెడ్డింగ్ కాస్ట్యూమ్స్ రూపొందించారు. అత్యల్ప వ్యవధిలో ఈ పెళ్లి ఏర్పాటుజరిగినా వీరి పెళ్లికి కొలంబియా, ఆస్ట్రేలియా, లండన్, స్వీడన్, ఇండియా, సింగపూర్, పెరు దేశాల నుండి 125 మంది స్నేహితులు, బంధువులు హాజరయ్యారు. హనీమూన్ యాత్ర ఉన్న డయానా ఇక మీద ముంబైలో ఉండడం సాధ్యం కాదేమో అంటున్నారు ఆమెను ఎరిగిన వారు.

కార్యకర్తలకు కష్టాలు!

కార్యక్రమాలకు జనాన్ని పట్టుకోరమ్మని హుకుం



కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పలుచగా కార్యకర్తలు.

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిన చందంగా వుంది కార్యక్రమాల నిర్వహణకు వివిధ పార్టీల కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు. తమ పేరుప్రఖ్యాతుల కోసం ప్రజల్లో పార్టీల పట్ల వ్యతిరేకత వ్యక్తం కాకుండా వుండేందుకు నిరసనలు, ధర్నాలు ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించడం సహజం. దీనికితోడు రాష్ట్రంలో సమైక్యాంధ్ర ఉద్యమం తోడవడంతో పార్టీల కార్యకర్తలకు కొత్త చిక్కులొచ్చి పడ్డాయి. సమైక్యాంధ్ర ఉద్యమం ఉధృతంగా సాగడానికి ఉద్యోగులే ప్రధాన కారణం. రాజకీయాలు, నేతలు లేకుండా కేవలం ఉద్యోగులు మాత్రమే ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీలు విభజన విషయంలో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాయి. దీని నుంచి బయట పడేందుకు ప్రజలు తమను తప్పు పట్టకుండా వుండేందుకు జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు నిరసనలు, ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తుండడంతో చోటా నేతలు హడలి పోతున్నారు. నేతల ముందు బలాన్ని నిరూపించుకోవడానికి, ప్రజల్లో పార్టీ కార్యక్రమాల నిర్వహణపై చులకన కాకుండా వుండేందుకు కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు, బ్రహ్మాండంగా జనం వచ్చారు అని చెప్పుకొనేందుకు చేతి చమురు వదిలించుకోవాల్సి రావడంతో కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు మోసేవారి జేబుకు చిల్లి పడుతుండడంతో లబలబలాడుతున్నారు. ఎమ్మెల్యేలు, నేతలు ప్రజల్లో మెప్పు కోసం చేసే కార్యక్రమాలు తమకు ఆర్థిక భారంగా మారుతున్నాయని వాపోతున్నారు పలు పార్టీల వారు. కార్యక్రమం చేపట్టాలంటే బిరియానీ పొట్లాలు, డబ్బులు ఇవ్వందే జనం రావడం లేదని దీంతో చిన్న కార్యక్రమానికైనా భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని వివిధ ప్రాంతాల చోటా నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సీజ్‌చేసిన వాహనాలు

వాడుకొంటున్న అటవీ శాఖాధికారులు!

వివిధ కేసుల్లో పట్టుకొన్న వాహనాలను పోలీస్, ఫారెస్టు శాఖలు సొంతానికి వాడుకొంటుండడం పట్ల తీవ్ర విమర్శలు రేగుతున్నాయి. కేసుల పరిష్కారానికి రాజీల పేరుతో, సెక్షన్లు మార్చేందుకు పెద్దఎత్తున దండకాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు పోలీస్ శాఖపై వస్తూనే వున్నాయి. ఫారెస్టులోని వివిధ విభాగాల పని తీరుపైనా అవినీతి ఆరోపణలు రావడం, లంచం తీసుకొంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులకు దొరికిపోయిన ఘటనలు వున్నాయి. ఇవి చాలవన్నట్లు వివిధ కేసుల్లో పట్టుకొని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించిన వాహనాలను పోలీసులు, ఎర్ర చందనం అక్రమ రవాణాకు సంబంధించి పట్టుకొన్న కేసుల్లో ఆయా వాహనాలను ఫారెస్టు అధికారులు యదేచ్ఛగా సొంతానికి వాడుకొంటుండడం పట్ల తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. ఇటీవల ఎర్రచందనాన్ని తరలిస్తున్నారన్న కేసులో ఇండికా కారును ఫారెస్టు అధికారులు సీజ్ చేశారు. కేసు నడుస్తున్నందున వాహనాన్ని తాము స్వాధీనం చేసుకొంటున్నామని, తర్వాతే ఆ వాహనాన్ని ఇవ్వడం జరుగుతుందని వాహన యజమానికి అధికారులు చెప్పారు. అయితే ఇటీవల ఆ కారును సిబ్బంది వినియోగించుకొంటుండడం, వివిధ ప్రాంతాలకు పోతుండడం గుర్తించిన కారు యజమాని వాహనాన్ని ఆపి ఫారెస్టు సిబ్బందిని నిలదీయడమేకాక పోలీసులకు దీనిపై ఫిర్యాదు చేశాడు. తమ బండారం బట్టబయలవడంతో ఫారెస్టు సిబ్బంది దానిని కప్పి పుచ్చుకొనేందుకు నానా తంటాలు పడ్డారు. మరోవైపు పోలీసులు వివిధ కేసుల్లో స్టేషన్‌లో వుంచిన వాహనాలను సొంతానికి వినియోగించుకొంటుండడం ఆ శాఖకు అప్రతిష్ట తెచ్చి పెడుతుంది. నగరంలోని ఫిఫ్త్ టౌన్ పోలీసులపై ఈ ఆరోపణలు వచ్చాయి. దొంగలను పట్టుకోవాల్సిన పోలీసులు, ఎర్ర చందనం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన ఫారెస్టు అధికారులే అక్రమంగా వాహనాలను వినియోగించుకొంటుండడంపై ఆ శాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

సాగునీటి సలహా బోర్డు సమావేశం!

21న నిర్వహించనున్న కలెక్టర్

సాగునీటి సలహా బోర్డు సమావేశం ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ అంగీకారం తెలిపారు. జిల్లాలో వరిసాగుకు అవసరమైన నీరు సోమశిల రిజర్వాయర్‌లో నిల్వ వుంది. ఈ నీటిని విడుదల చేస్తే దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేయవచ్చు. సోమశిల జలాశయం నుండి నీటిని విడుదల చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సి వుంటుంది. ఇందుకు ముందుగా జిల్లా స్థాయిలో ఐఏబి సమావేశం నిర్వహించి రైతులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తీర్మానం చేయాలి. ఇక్కడ చేసిన తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపితే నీటి విడుదలకు గ్రీన్‌సిగ్నల్ లభిస్తుంది. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ ఆఖరి వారంలో ఐఏబి సమావేశం నిర్వహించి అక్టోబర్ నెలలో నీటిని కాల్వలకు విడుదల చేసేవారు సమైక్యాంధ్ర ఆందోళనలు, బంద్‌ల కారణంగా ఐఏబి సమావేశం గురించి ఎవరూ పట్టించుకోలేక పోయారు. రైతులు మాత్రం వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా వున్నారుమళ్లు పోసుకునేందుకు నీరు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. కొంత ఆలస్యం జరిగినప్పటికీ రైతు సంఘాల ప్రతినిధులు స్పందించి జిల్లా కలెక్టర్‌ను కలిసి నీటి విడుదలకు సంబంధించి చర్చించారు. వెంటనే ఐఏబి సమావేశం ఏర్పాటుచేసి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ కూడా ఇచ్చారు. నీటి పారుదల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి ఈ నెల 21వ తేదీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుండి నీటి విడుదలకు నవంబర్‌లో అనుమతి వచ్చే అవకాశం వుంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

సమ్మెలోనూ సమావేశాలు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి హింస

సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమ్మె చేసిన సంగతి తెలిసిందే. సమ్మె చేస్తున్న సమయంలోనూ సమీక్షలు జరపకూడదు. ఇందుకు భిన్నంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి అనధికారికంగా సమీక్షకు పిలవడం చర్చనీయాంశంగా మారింది. గత రెండు నెలల నుండి ఈ శాఖలో పనిచేస్తున్న సిడిపిఓలు విధులకు హాజరుకాకుండా సమ్మెలో వున్నారు. కేవలం కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన సూపర్‌వైజర్లు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. సమ్మెలో వున్న సిడిపిఓలను ప్రాజెక్టు డైరక్టర్ తన కార్యాలయానికి పిలిచి సమీక్ష జరిపారు. సమీక్షకు వచ్చేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమ్మె సమయంలో సమీక్షకు వచ్చేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమ్మె సమయంలో సమీక్షకు పిలవడం ఏమిటని కొందరు సిడిపిఓలు గుసగుసలాడారు. సిడిపిఓలు కార్యాలయాలకు వెళ్లి రెండు నెలలు కావస్తుంది. ఈ సమయంలో వీరిని సమీక్షకు పిలిచి శాఖాపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి అడిగితే ఏ మేరకు సమాచారం వస్తుందో వారికే తెలియాలి. ఇదిలా ఉండగా కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ వర్కర్లతో సెక్టార్ సమావేశాలు జరుపుతున్నారు. ఈ సమావేశాలలో నెలవారీ నివేదికలు తీసుకోవడం మినహా వృత్తిపరంగా వచ్చే సందేహాలు నివృత్తి చేయడంలేదు. ఆర్టీసి కార్మికులు బంద్‌లో వుండడంతో బస్సులు తిరగని విషయం సూపర్‌వైజర్లకు తెలిసినా సమావేశాలకు రావాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఆటోలను ఆశ్రయించి అధిక ఛార్జీలను చెల్లించి సమావేశానికి వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్ సైతం వివిధ శాఖల అధికారులతో బంద్ సమయంలో ఏ సమీక్ష కూడా జరపలేదు. కానీ కిందిస్థాయిలో ఐసిడిఎస్ అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించడం విశేషం.

పంచాయతీ రాజ్ శాఖలో టెండర్ల వివాదం

నగరంలోని పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయంలో టెండర్ల వివాదం చోటుచేసుకుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికని సంబంధించి ఆ శాఖ అధికారులు టెండర్లు పిలిచారు. ప్రధానంగా ఆత్మకూరు, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎక్కువ పనులు చేయాలని నిర్ణయించారు. దీంతో పలువురు కాంట్రాక్టర్లు పోటీలుపడి టెండర్లు దాఖలు చేశారు. ఉదయగిరి ఎమ్మెల్యే, జిల్లా మంత్రికి అనుచరులుగా వున్న కాంట్రాక్టర్లు పనులు దక్కించుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు ప్రారంభించారు. నిబంధనల ప్రకారం టెండర్లను ఓపెన్ చేసి పరిశీలించడంతో మంత్రికి చెందిన కాంట్రాక్టర్ అధిక రేట్లను నమోదు చేసి వుండడంతో దానిని ప్రక్కన పెట్టాల్సి వచ్చింది. ఆత్మకూరు నియోజకవర్గంలో పనులు చేజారి పోతాయని భావించిన కాంట్రాక్టర్ వెంటనే మంత్రిని ఆశ్రయించి టెండర్ ఖరారు చేసే విధంగా ఒత్తిడి తేవాలని కోరినట్లు తెలిసింది. మంత్రి పంచాయతీ రాజ్ ఇంజనీర్లకు ఫోన్‌చేసి తాను సూచించిన వ్యక్తికి కాంట్రాక్టు దక్కకుంటే టెండర్లను రద్దు చేయాలని చెప్పినట్లు ప్రచారం జరుగుతుంది. మిగిలిన కాంట్రాక్టర్లు టెండర్లు ఎలా రద్దు చేస్తారని అధికారులతో వాగ్వివాదానికి దిగినట్లు సమాచారం. మొత్తంమీద పంచాయతీ రాజ్ కార్యాలయంలో టెండర్ల వివాదం రేగడం చర్చనీయాంశమైంది. ఆ శాఖాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

నిలిచిన రోడ్డు నిర్మాణం

నెల్లూరు నగరంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. టిటిడి కళ్యాణ మండపం నుండి ప్రారంభించిన సిమెంటు రోడ్డు నిర్మాణం జిల్లా కోర్టు సమీపం వరకు వేసి పూర్తి చేసేశారు. కెవిఆర్ పెట్రోల్ బంకు నుండి జిల్లా కోర్టు వరకు పడమర వైపు మాత్రమే రోడ్డు నిర్మించడం జరిగింది. తూర్పు వైపున వున్న రోడ్డు ఏ కారణం చేతనో తెలియదు గానీ అలాగే వదిలేశారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో తారు రోడ్లనే నిర్మిస్తుంటారు. నగరంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రోడ్డు నిర్మాణం చేపట్టే ముందు ఇరువైపులా డ్రైనేజి కాల్వలను ఏర్పాటు చేయాలి. అయితే డ్రైనేజి కాల్వల ఏర్పాటు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వుందని ఆర్‌అండ్‌బికి సంబంధంలేదని చెబుతున్నారు. డ్రైనేజి కాల్వల నిర్మాణంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా ఆర్‌అండ్‌బి అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా సిమెంటు రోడ్డు నిర్మాణం కొంత భాగం పూర్తి చేశారు. కోర్టు దగ్గర నుండి మద్రాస్ బస్టాండ్ వైపు రోడ్డును వేయడం మానేశారు. మద్రాస్ బస్టాండ్ నుంచి ఆర్టీసి వైపు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అర్ధాంతరంగా నిలిచిపోయిన సిమెంటు రోడ్ల గురించి పట్టించుకోవాల్సి వుంది.

విభజన ఖాయం

మొదటి పేజీ కొరవ

ప్రాయాలున్నాయి. కాంగ్రెస్‌లో విలీనానికి హరీష్ రావుతో సహా చాలామంది ఒప్పుకోవడం లేదు. టిఆర్ఎస్‌కు ప్రజలలో విపరీతమైన మోజు వున్న ప్పుడు, తెలంగాణ తెచ్చిన పార్టీగా గుర్తింపు వున్న ప్పుడు దాన్ని వదలుకొని కాంగ్రెస్ మహాసముద్రంలో కలిసి పోవడం ఎందుకన్నది వారి వాదన. ఎమ్మెల్యే, ఎమ్మీ టిక్కెట్లు ఆశించేవారు ఈ విషయంలో మరింత ఆందోళన చెందుతున్నారు. తమకు ఆ అవకాశాలు పోతాయని భయపడుతున్నారు.

ఇదిట్లా వుంటే, కేంద్రంలోని సీమాంధ్ర మంత్రులను, ఎమ్పీలను ఢిల్లీ పెద్దలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తమ స్వంత నియోజకవర్గాలలో కూడా స్వంతంగా గెలిచే సత్తా లేని వారిని చూసి కాంగ్రెస్ అగ్ర నాయకత్వం భయపడుతుందా? అందువల్లనే విభజన ప్రక్రియలో ఒక్క కేంద్ర మంత్రికి కూడా భాగం కల్పించడం లేదు. రాజీనామాలు చేస్తామని బెదరిస్తే నవ్వి వూరుకొన్నారు. కనీసం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌లో కూడా ఒక్క ఆంధ్ర ప్రాంతం కేంద్ర మంత్రికి స్థానం ఇవ్వలేదు. అధిష్టానం తమను ఫూల్స్ వలె చూస్తున్నదని కేంద్ర మంత్రులకు బాగా తెలుసు. కానీ చేయగల్గింది ఏదీ లేదు.

ఎమ్పీల విషయం కూడా అంతే. ఆంధ్ర ప్రాంతం నుంచి కాంగ్రెస్‌లో వున్న ఎమ్పీలలో ముప్పాతిక భాగం మంది వ్యాపారస్తులు. వేల కోట్ల బ్యాంక్ అప్పులు తీసుకొని ఎగ్గొట్టిన ఘనులు. ఒక్క లగడపాటి రాజగోపాల్ కంపెనీలే దాదాపు 40వేల కోట్ల రూపాయలు బాకీ వున్నాయట బ్యాంకులకు. ఇప్పట్లో వాటిని తిరిగి చెల్లించే స్థోమత కూడా లేదు లగడపాటికి. ఈ స్థితిలో కేంద్ర నాయకత్వంతో పేచీ పెట్టుకుంటే జగన్ వలె తనూ జైలుకు పోవాల్సి వస్తుంది. అందువల్ల విజయవాడలో చేరి ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతూ, ఢిల్లీకి వెళ్లి పెద్దలకు పాద నమస్కారం చేస్తున్నాడు. దాదాపుగా ఎమ్పీలు అందరి పరిస్థితీ ఇదే. పార్లమెంట్‌లో బిల్లు వస్తే అడ్డుకొంటాము, పార్టీకి రాజీనామా చేస్తాము అన్నవి ఉత్తుత్తి మాటలు.

తోలుబొమ్మ అశోక్‌బాబు

మొదటి పేజీ కొరవ

పడి కేంద్రం పునరాలోచన చేస్తుందని ముఖ్యమంత్రి ఆశించాడు. కానీ అవసరమైతే ఆయన్ను పదవి నుంచి తొలగించి, రాష్ట్రపతి పాలన పెట్టి అయినా విభజన జరిపిస్తామని కేంద్రం సంకేతాలు పంపడంతో కిరణ్‌కు ముచ్చెమటలు పట్టాయి. దానితో అశోక్‌బాబును వెనక్కు లాగాడు. ఉద్యమాన్ని మెల్ల మెల్లగా ఉపశమింప చేశాడు.

దీనితో స్పష్టంగా అర్థమైపోయింది – ఈ అశోక్‌బాబు అనే వాడు ముఖ్యమంత్రి చేతిలో ఒక తోలుబొమ్మ మాత్రమే అని. రాజకీయవాదుల అవసరాల కోసం లక్షలాది మంది ఉద్యోగులను తప్పు దారి పట్టించడం, కోట్లాది ప్రజల జీవితాలతో చెలగాటమాడడం ఒక ఉద్యోగ సంఘం చేయదగిన పనేనా?

రాష్ట్ర విభజన సాకుతో స్వంత పార్టీ పెట్టాలనే ఆలోచన కిరణ్‌కుమార్‌రెడ్డికి కలిగింది. అందుకోసం అశోక్‌బాబు అనే బొమ్మను తయారు చేశాడు. ఉద్యోగుల ద్వారా సమైక్యాంధ్ర భావోద్రేకాలను తీవ్రస్థాయిలో రెచ్చగొట్టి, సమైక్యాంధ్రకు తానే ఛాంపియన్ అనే గుర్తింపు పొంది, దాన్ని ఓట్లుగా మలచుకోవాలన్నది ఆయన ఆలోచన. ఈ ఉపకారం చేసి పెట్టినందుకు అశోక్‌బాబుకు రాజ్యసభ సభ్యత్వం ఇస్తానని ఆశ పెట్టాడట ముఖ్యమంత్రి. అయితే వారి అంచనాలు తల క్రిందులైనాయి. కేంద్ర నాయకత్వం వారికంటే తెలివైనది.

సమస్యల పరిష్కారానికి 'భరోసా'!

10వ పేజీ కొరవ

మా వదినకు జ్యోతిషపరంగా దోషం వుందట. అందువల్లే ఆమె భర్త ఏ విధంగానూ అభివృద్ధి చెందడం లేదు. మా కుటుంబానికి ఆమె వల్ల ప్రమాదమని కొందరు చెప్పారు". ఇదీ ఉత్తరాల సారాంశం. 'కుజదోష'మనే అంశాన్ని కొందరు 'మనుషులు కానివారు' ఆయుధంలా వాడుతున్నారు. తీరా ఆమె జన్మ వివరాల్ని గణిస్తే ఏ దోషమూ వుండదు. ఆ స్త్రీలు కూడా బహుశా దోషం వుందేమో అని అమాయకంగా కుమిలి పోతున్నారు. ఆమె శత్రువర్గానికి ఇదో ఆసరా! ఇంతకీ 'కుజదోష'మంటే వీళ్లకు అవగాహన వుండదు. దయచేసి జ్యోతిష్కులు, సిద్ధాంతులు ఈ విషయంలో అప్రమత్తంగా వుండండి. స్త్రీల విషయంలో మీరు ప్రకటనలు ఇచ్చేటప్పుడు ఆ మాట ఏ విధంగా దారితీస్తుందో ఆలోచించి చెప్పండి.

ఇంతకీ 'కుజ దోష'మంటే ఏమిటో చూద్దాం. "జన్మ లగ్నం నుంచి 'ద్వాదశాంశ చక్రం'లో రెండు, నాలుగు, ఏడు, ఎనిమిది, పన్నెండు స్థానాల్లో కుజుడువుంటే 'కుజదోష'మని అర్థం. కుజ దోషం మహా దోషం, జీవితాంతం వేధించే దోషం కానే కాదు. ఇతర గ్రహస్థితుల వల్ల కూడా దోషాలు ఏర్పడుతుంటాయి. 'కుజ దోషం' వున్నా చాలా సందర్భాలలో భంగమవుతూ వుంటుంది.

కుజుడు కర్కాటక, సింహ రాశులలో, లగ్నాలలో సంచారం గనుక వుంటే 'కుజదోషం' భగ్నమవుతుంది. నవగ్రహ పూజ చేయించుకున్నా చేతితో తీసివేసినట్లవుతుంది. శాస్త్రంలో సమస్యలూ, పరిష్కారాలు వెంట వెంటనే వుంటాయి. అందువల్ల దోషాలున్నా భూతద్దంలో చూడాల్సిన పని లేదు. లేకపోయినా స్వార్థ ప్రయోజనాలకు ఆపాదించవలసిన అవసరం లేదు. ఎవరైనా ఇట్లాంటి ఆరోపణలు చేస్తే నిష్ణాతులైన శాస్త్రజ్ఞులెప్పుడూ మీకు అండగా నిలబడతారు. అంచేత భయపడాల్సిన పరిస్థితి అస్సలు లేదు.

సోమవారం వివాహాలపై 'నిషేధం' లేదు!

సోమవారం వివాహాన్ని గురించి అనవసర అనుమానాలు ప్రచారంలో వున్నాయి. ఒక్క అక్షరం పొరపాటుగా రెండు గ్రంథాలలో వుండటం చేత ఏర్పడిన సందిగ్ధత ఇది. "సోమే సుపత్నీపదం" అనడానికి బదులు 'సపత్నీపదం' అని పూర్వకాలా మృతం, పురుషార్థ చింతామణి గ్రంథాలలో వున్నది. అయితే ధర్మసింధు, నిర్ణయ సింధు వంటి ఇరవైకి పైగా జ్యోతిష గ్రంథాలు సోమవారం వివాహాన్ని సమర్థిస్తున్నాయి. అందువల్లే నా వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించే పాఠకులారా ఇకపై సందిగ్ధతను వదలి పెట్టండి.

ముగింపు!

అనుమానం వున్నప్పుడు ఆందోళన వద్దు. విషయ స్పష్టతను తెలుసుకోండి అనుమానాన్ని వదిలి వేయండి. ఒకే అంశాన్ని పలువురి వద్ద ప్రస్తావించడమూ వద్దు. పలువురిలో నమ్మకం వున్న వ్యక్తిని సంప్రదించి అనుమాన నివృత్తి చేసుకోండి.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ సాయిబాబా చెప్పారు. 11వ తేది నెల్లూరులో విలేకరు లతో మాట్లాడారు. లోపాయికారి ఒప్పందాలతో సమ్మె విరమించలేదన్నారు. మోసంతో తెలంగాణ ప్రక్రియను నడి పిస్తే మెరుపు సమ్మెకు దిగుతామన్నారు.

పండుగపూట కూడా ఉపాధ్యాయుల నిరసన!

సమైక్యాంధ్ర ఉద్యమాన్ని నెల్లూరు ఉపాధ్యాయులు నిరంతరంగా కొనసాగిస్తున్నారు. 13వ తేది విజయదశమి పండుగ అయినా ఉపాధ్యాయులు గాంధీబొమ్మ నుంచి విఆర్‌సి వరకు అక్కడ నుంచి తిరిగి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు.

మహిళా దొంగ అరెస్టు

రద్దీగా వుండే ప్రాంతాల్లో కాపుకాచి మహిళల మెడల్లోని నగలు, బ్యాగుల్లోని డబ్బును తస్కరించే మహిళా దొంగను పోలీసులు పట్టుకొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మునెమ్మ మరో దొంగతో పరిచయం పెంచుకొని పలు దొంగతనాలకు పాల్పడింది. బస్టాండుల్లో ప్రయాణీకుల బ్యాగులు, నగలు కొట్టేయడం, ఆటోల్లో, బస్సుల్లో ప్రయాణిస్తూ విలువైన వస్తువులు దొంగిలించడంలో ఆరితేరిన దొంగ. ఆమె కదలికలపై నిఘా పెట్టిన పోలీసులకు ఎట్టకేలకు అరెస్టుచేసి ఆమె వద్ద నుంచి పది లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొన్నారు.

హుండీలో డబ్బు కోసం వాచ్‌మెన్‌ను చంపారు!

నెల్లూరుకు కూతవేటు దూరంలోని చెముడుగుంటలోని చింతాలమ్మ దేవస్థానంలో వాచ్‌మెన్ డబ్బుగుంట సుబ్బరామయ్య(70) 12వ తేది రాత్రి హత్యకు గురయ్యాడు. హుండీలో డబ్బుకోసమే ఈ హత్య జరిగిందని పోలీస్ కథనం.



జనవాణి

2వ పేజీ కొరవ

స్వార్థపూరితం!

తెలంగాణ ఆంధ్రాలో విలీనమైనపుడు రెండు ప్రాంతాల అసెంబ్లీల తీర్మానం ప్రకారం జరిగింది కానీ బలవంతం ఏమీ లేదు. తెలంగాణ ప్రాంత భూముల కొనుగోలుకు తెలంగాణ ప్రాంతీయ కమిటీ అనుమతి ఉండాలంటే అది లేకుండా రిజిస్ట్రేషన్ జరిగితే కోర్టు ద్వారా రద్దు చేయవచ్చు కదా? అంతే కాకుండా తెలంగాణలో వ్యాపారాలు, పరిశ్రమలు పెట్టి ధనవంతులైతే అది సీమాంధ్రులొక్కరికే పరిమితమైందా? మన దేశ పెట్టుబడిదారులు కార్పొరేట్ రంగం ఉన్నా ఇంకా ఇతర దేశ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్లే, తెలంగాణ విడిపోయినా పెట్టుబడులు – పరిశ్రమలు పెట్టమని కెసిఆర్ ఆహ్వానిస్తున్నారు గదా? మరి సీమాంధ్రులు ఒక్కరే దోచుకుంటారా? ఇతర భాషల ప్రాంతాల పెట్టుబడిదారులు దోచుకోరా? అంటే సమాధానం చెప్పేవారు లేరు. హైదరాబాద్‌లో మా తెలంగాణ మాగ్గావాలె అని సామాన్యులతో ఉద్యమం చేయించడం, అధికారం, మంత్రి పదవుల కోసమేగానీ, ప్రజల సమస్యలు తీర్చడానికి కాదని తెలంగాణ ప్రజలు గమనించాలి.

ఎం.వెంకటసుబ్బయ్య నెల్లూరు

ఐఎఎస్ బృందం నివేదిక

మొదటి పేజీ కొరవ

నివేదిక ఆధారంగా తన వాదన విన్పించబోతున్నాడు కిరణ్‌కుమార్‌రెడ్డి.

ఆయన ప్రేరణతో కొన్ని టీవీ ఛానళ్లు ఇప్పటికే ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాలలో నక్సలైట్ల సమస్యను ప్రముఖంగా ప్రచారం చేస్తున్నాయి. కొత్త రాష్ట్రాలుగా ఏర్పడినా అక్కడ అభివృద్ధి లేదనే వార్తా కథనాలు ప్రచారం చేస్తున్నాయి. కిరణ్‌కుమార్‌రెడ్డి రాజకీయ అనుభవ శూన్యుడనుకొంటాము కానీ, ఇటువంటి వ్యూహాలు రచించడంలో మాత్రం చాలా గొప్ప దిట్టగా కన్పిస్తున్నాడు.

పదరంగం -89

నిర్వహణ : బాబాజీ

1		2		3		4	5		6
		7	8			9			
10	11		12						
	13	14		15	16			17	
18		19			20		21		
22	23			24			25		26
27				28	29				
		30						31	
32	33			34					
	35							36	

అడ్డం

1. సదుపాయం (3)
3. శశి, చంద్రుడు (4)
7. బహుమతి (3)
9. వంద సంవత్సరాలు (4)
10. అటునుంచి స్నేహం (2)
12. చీపురుకు జతగాడు (2)
13. చెడ్డవాసన, ఇంపు కాదు (2)
15. అటునుంచి సర్పం (2)
19. అటునుంచి లెగ్ (2)
20. చిన్నపిల్లవాడు (4)
22. అవన్నీ మిక్స్ చెయ్యమని చెప్పండి (3)
25. అటునుంచి తీరు, తెన్ను, విధానం (3)
27. అటునుంచి తెలుగు మ్యాట్ (2)
28. ఈలోకం కాదు, ఇంకో లోకం (4)
30. అటునుంచి కత్తి (4)
31. ఏనుగు, గజం (2)
32. అటునుంచి ఆటగాడు సాధించవలసిన లక్ష్యం (2)
34. టైగర్స్ నెయిల్ (4)
35. చిరునగవు (4)
36. అబద్దం (2)

నిలువు

1. సుమిత్ర కుమారుడు లక్ష్మణుడు (3)
2. క్రిందనుంచి పని (2)
3. బండి, వాహనము (4)
4. దర్భపోచ, లవుడు కాదు (2)
5. క్రిందనుంచి ఆమె కాదు (3)
6. సంతోషం (3)
8. క్రిందనుంచి పొలం (2)
11. మత్తు (2)
14. చింతకాయ రుచి ఎటునుంచి అయినా అదే రుచి (3)
16. చిన్న అమ్మాయి (2)
17. అలవాటు (3)
18. ఒకటే నవ్వులు (5)
21. యూసేజ్ ఉపయోగించడం (3)
23. క్రింద నుంచి ఇక వద్దు చాలని చెప్పండి (2)
24. లోటస్, కలువ పువ్వు (5)
26. అల్లరి పిల్ల (5)
29. రోలుకి జతగాడు (3)
33. కౌపీనం (2)

సమాధానాలు

పదరంగం -88

1క	ర	2త	3లా	మ	ల	4కం		5వి	
వి		6లో	భం			7గా	జు	వా	8క
	9స	దా		10ప	వ	రు		11హం	స
	12వా	రి	13జా	క్షి			14వి		వు
15దా	రి		న		16ప	17రా	జ	యం	
వు		18వా	కి	లి		19కా	య		20స
21న	22మూ	నా			23ప	సి	వా	24డు	
	25స	కా	26ర	27ణం			28డ	మ	29ఆ
30తీ		31లం	గ	రు		32త్రి		33ను	వి
34రం	గు		35డ	త	ఉ		36ఎ	మ	డ

సంక్షిప్త సింహపురి

ఇళ్లలో పని చేసే వాళ్ల సమస్యలు పరిష్కరించండి!

నెల్లూరు బాలాజీనగర్‌లోని సిపిఎం ఆఫీసులో స్నేహ ఇంటి పని చేసేవాళ్ల సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం కన్వీనర్ వంగా విజయమ్మ అధ్యక్షత వహించి మాట్లాడారు. నేడు ఇళ్లలో పాచిపనులు చేసుకొంటూ జీవించే మహిళల సంఖ్య నానాటికి పెరుగుతుందని, వీరంతా దారిద్ర్య రేఖకు దిగువనున్నారన్నారు. స్వంత ఇళ్లు లేక అద్దెలు భరించలేక పిల్లలను చదివించుకోను, ఆరోగ్యం పాడైతే చూపించుకోను ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం పార్టీ నగర కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇళ్లలో పని చేసేవాళ్లకు ప్రభుత్వం ప్రత్యేక జిఓ విడుదల చేసి గుర్తింపు కార్డులను అందించాలని, పెన్షన్ బీమా సౌకర్యం కల్పించాలని, వీరందరికీ ఇఎస్ఐ ద్వారా అనారోగ్య సమస్యలకు చికిత్స చేయాలన్నారు. ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. సమావేశంలో ఐద్వా నాయకురాళ్లు డి.అన్న పూర్ణమ్మ, ఎ.రమమ్మ, శ్రామిక మహిళా సంఘ నాయకురాళ్లు మస్తాన్‌బీ, శిల్ప, షాహినా బేగం, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను ఆపేస్తున్న చెత్త తొట్టి!



చెత్తతొట్టి ట్రాఫిక్‌ను ఆపేయడమేమిటన్న సందేహం పౌరులకు కలగవచ్చు. కానీ మూడుహాళ్ల రోడ్డులో నిత్యం రాకపోకలు సాగించే వారికి మాత్రం ఈ చెత్తతొట్టి గూర్చి బాగా తెలుసు. మూడు హాళ్ల రోడ్డులో రైల్వే ట్రాక్ గోడనానుకొని రోడ్డును సగం ఆక్రమించేలా ఈ చెత్త తొట్టిని పెట్టేశారు. మూడుహాళ్ల రోడ్డులో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి సమయాల్లో ట్రాఫిక్ నడత పెరిగినప్పుడల్లా ఈ చెత్త తొట్టి మూలంగా వాహనాలు అడుగు ముందుకు కదలలేక పోతున్నాయి. ఈ తొట్టి ఇక్కడ నుంచి తొలగించి మరోచోట పెట్టేలా కార్పొరేషన్ శానిటరీ సిబ్బంది తగినచర్యలు తీసుకోవాల్సి వుంది.

దెబ్బతినిపోయిన రోడ్డు!

ఇటీవల నగరంలోని కెవిఆర్ పెట్రోల్ బంకు నుంచి జిల్లా కోర్టుకు సమీపంలోని ఖుద్దూస్ మసీదు వరకు పడమరవైపు కొత్తగా సిమెంటురోడ్డు వేశారు. ఈ సమయంలో తూర్పువైపున వుండే రోడ్డుపైనే ఎక్కువగా ట్రాఫిక్ నడిచింది. దీనిమూలంగా మద్రాసు బస్టాండ్ వద్ద పండ్ల అంగళ్ల సెంటర్ నుంచి దయాకర్‌రెడ్డి బిల్డింగ్స్ వరకు రోడ్డు బాగా దెబ్బతినిపోయింది. అదే విధంగా నూనె మల్లికార్జున యాదవ్ ఫంక్షన్ హాలుకు ముందు ట్రంకురోడ్డుపై పెద్ద పెద్ద గుంటలు పడిపోయి వాహనదారులు నానాపాట్లు పడుతున్నారు. ఈ రోడ్డుపైనే అధికార యంత్రాంగం మొత్తం రాకపోకలు సాగిస్తున్నా రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలనే ఆలోచన కూడా చేయకపోవడం బాధాకరం.

మంచినీటి సమస్య




నెల్లూరు నగరంలో మంచినీటి సమస్య తీవ్రమయ్యిందని, అన్ని రిజర్వాయర్ల పరిధిలో నిర్ణీత వేళల్లో మంచినీరు సరఫరా చేయడం లేదని మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు నేతృత్వంలోని సిపిఎం పార్టీ ప్రతినిధి వర్గం మునిసిపల్ ఇంజనీర్ సంపత్ కుమార్‌ను కలసి విజ్ఞాపన అందజేసింది. కార్పొరేషన్ కొళాయిల్లో సరఫరా అవుతున్న నీరు తాగేందుకు అనువుగా లేదని పచ్చగా వస్తున్నాయని, అనేకచోట్ల స్కవర్ చేయకపోవడంతో పురుగులు కూడా వస్తున్నాయని వివరించారు. వీధిలైట్లు వెలగడం లేదంటే పట్టించుకొనేవారు లేరని అన్ని డివిజన్లలో పారిశుధ్య సమస్య తీవ్రంగా వుందన్నారు. చెత్త ఎప్పటికప్పుడు ఎత్తడం లేదని, మురికి కాల్వలు శుభ్రం చేయకపోవడం వల్ల దోమలు విజృంభిస్తున్నాయన్నారు. సిపిఎం ప్రతినిధి బృందంలో మాజీ కార్పొరేటర్లు కత్తి శ్రీనివాసులు, షేక్ మస్తాన్‌బీ, షేక్ హసీనా, సిపిఎం పార్టీ నగర కమిటీ సభ్యులు జి.నాగేశ్వరరావు, కె.విజయగోపి, అల్లాడి గోపాల్, జగన్నాధం, వి.విజయమ్మ, షేక్ చాన్‌బాష, కొండా ప్రసాద్ తదితరులున్నారు.

స్వామి వివేకానంద జయంతి



కేతా అంకులు మోమోరియల్ ట్రస్ట్, శ్రీ సాయి రాగాంజలి ఆర్కెస్ట్రా సంయుక్త యాజమాన్యన సుబేదారుపేటలోని మునిసిపల్ స్కూల్‌లో స్వామి వివేకానంద 150వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇంజనీర్ సీతారామస్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వివేకానందుని అసలు పేరు నరేంద్రుడని, సన్యాసం స్వీకరించి 1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనంలో ఆయన చేసిన ఉపన్యాసం నేటికి ఎన్నదగినదన్నారు. యువతకు వివేకానందుడు ఆదర్శమన్నారు. కేతా సుబ్బారావు, అక్షరకవి వరదా శ్రీనివాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రైతు లోకం

రైతు స్థాయిలో వరి విత్తనోత్పత్తి!

పెరుగుతున్న దేశ జనాభా ఒకవైపు, తరుగుతున్న సహజ వనరులు మరోవైపు. ఇలాంటి పరిస్థితుల్లో ఆహార భద్రతను కల్పించాలంటే ప్రస్తుతం ఉన్న సగటు ఉత్పాదకతను అధికం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. మనదేశంలో వరి ప్రధాన ఆహార పంట. ప్రస్తుత పరిస్థితులు అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలు రైతులకు అందుబాటులో వున్నాయి. దీనికి తోడు వరి ఉత్పత్తి, ఉత్పాదకతలను ప్రభావితం చేసే ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని దాని ద్వారా దిగుబడులను పెంచుకోవాలి.

వరి దిగుబడిని ప్రభావితం చేసే వివిధ అంశాల్లో మొదటిది నాణ్యమైన విత్తనాన్ని ఉపయోగించడం, నాణ్యమైన విత్తనం అంటే కనీస నాణ్యతా ప్రమాణాలను అనుసరించి, అధిక జన్యు స్వచ్ఛత, అధిక మొలక శాతం కలిగి, అతి తక్కువ జడపదార్థం, తక్కువ సంఖ్యలో కలుపు ఇతర పంటల విత్తనాలను కలిగి తెగుళ్ల బారిన పడనటువంటి విత్తనం.

రైతు స్థాయిలో విత్తనోత్పత్తి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 44 లక్షల హెక్టార్ల వరి విస్తీర్ణానికి సరిపడే నాణ్యమైన విత్తనాన్ని ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ గానీ, వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా స్థానాలు గానీ లేదా ప్రైవేటు విత్తన సంస్థలు గానీ సరఫరా చేయలేవు. కావున రైతులు తమ పొలంలోనే విత్తనోత్పత్తి చేసుకోవాల్సిన అవసరం వుంది.

డాక్టర్ వై.సూర్యనారాయణ
ప్రధాన శాస్త్రవేత్త,
వ్యవసాయ పరిశోధనా స్థానం, నెల్లూరు.

వరి స్వపరాగ సంపర్క మొక్క ప్రస్తుతం రైతుల పొలాల్లో సాగులో వున్నవన్నీ రకాలే. కావున రైతులు ఒకసారి ధృవీకరించబడిన విత్తనం కొనుగోలు చేసి రైతు స్థాయిలోనే తక్కువ ఖర్చుతో నాణ్యమైన విత్తనాన్ని తయారు చేసుకొని తమ అవసరాలకు ఉపయోగించుకోవచ్చు.

సాధారణంగా ఒకే విత్తనాన్ని కొంతకాలం సాగు చేసిన తర్వాత వరి వంగడం దిగుబడి తగ్గుతుందనే అపోహ రైతుల్లో వుంది. కానీ దానికి ముఖ్య కారణం విత్తనంలో కల్తీ జరిగి జన్యుస్వచ్ఛత తగ్గడం, జన్యు స్వచ్ఛత అనేది ఇతర రకాలతో కల్తీ జరగడం వల్ల పరపరాగ సంపర్కం వల్ల స్వల్ప జన్యుపరమై మార్పులు, యాంత్రిక కల్తీ వల్ల ఆశించే తెగుళ్ల ప్రభావం వల్ల జరుగుతుంది. కాబట్టి విత్తనాన్ని కల్తీలను నివారించి, జన్యు స్వచ్ఛతను కాపాడటం ద్వారా నాణ్యమైన విత్తనాన్ని పొందేందుకు కొన్ని మెళకువలు పాటించాలి.

(కొరవ వచ్చే వారం)

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

ఆహ్వానం

నెల్లూరు రూరల్, కనుపర్తిపాడులోని

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో



శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం

తే.19.10.2013ది శనివారం సాయంత్రం 5 గంటలకు
నిర్వహించబడును.

పై కార్యక్రమంలో మీరు పాల్గొని స్వామివారి కృపాకటాక్షములకు పాత్రులై
తీర్థ ప్రసాదములు స్వీకరించవలసిందిగా విజ్ఞప్తి.

మీ... వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com

పరోపకారం పరమార్థమని ఎరిగిన ప్రభాకర్‌రెడ్డి!

మనకోసం చేసుకొన్న ప్రతిదీ మనతోనే అంతరించి పోతుంది. ఇతరుల కోసం చేసిన ప్రతి మంచి పనీ, అదెంత చిన్నదైనా సరే, మన తర్వాత కూడా మిగిలి వుంటుంది. లోకం గుర్తు పెట్టుకొనేది మనం సంపాదించిన ఆస్తిపాస్తులు కాదు; లోకానికి మనం చేసిన మేలు. *"No person was ever honored for what he received. Honor has been the reward for what he gave".*

నెల్లూరు జిల్లా అనాదిగా శ్రీమంతులకు పెట్టింది పేరు. వెండి స్పూను నోట్లో పెట్టుకొని పుట్టి, చందనపు కట్టెలలో కాలిపోయిన వారు ఎందరో వున్నారు. కానీ వారి వూరు, పేరు తలచుకొనేవాడు ఒక్కడూ లేడు. ఆర్ఎల్.రెడ్డి, దొడ్ల సుబ్బారెడ్డి వంటి ఒకటి రెండు పేర్లు మాత్రమే ప్రజల మనసులలో నిలిచిపోయాయి. జిల్లాలో వేల ఎకరాల కమతాలు కల్గిన భూస్వాములు, మైకా కుబేరులు, ఫైవ్ స్టార్ హోటళ్ల అధినేతలు, భారీ పరిశ్రమల యజమానులు, విద్యుత్ ప్రాజెక్ట్‌లు కట్టినవారు, కోట్లకు పడగలెత్తిన కాంట్రాక్టర్లు లెక్కకు మించి వున్నప్పుడు వారిద్దరి పేర్లు మాత్రమే నిలిచిపోవడానికి కారణం – వారి విలాస జీవితం కాదు. ఇనప పెట్టెలో పేర్చిన కరెన్సీ కట్టల మొత్తం అసలేకాదు. కేవలం దాతృత్వం. తమకున్న కొంచెంలో పిసరంత అయినా లోకానికి పంచి పెట్టాలన్న దాతృత్వ భావన. ఏ వ్యక్తికి కూడా అతడికున్న సిరి సంపదలను బట్టి కీర్తి ప్రతిష్టలు దక్కవు. వాటిని ఆర్తుల అవసరాలకు వినియోగించే గుణాన్ని బట్టే గౌరవాభిమానాలు దక్కుతాయి.

సంపద పెంచాలి!

ఈ సూక్ష్మాన్ని శ్రీమంతులందరూ గ్రహించలేరు. వారి శ్వాస, ధ్యాస మరింత సంపాదించడం మీద మాత్రమే గురి పెట్టి వుంటాయి. దాన్ని అర్థం చేసుకోగల్గిన అతి కొద్ది మందిలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒకడు. ప్రభాకర్‌రెడ్డి, ఆగర్భ శ్రీమంతుడు కాదు. పుట్టేటప్పుడు నోట్లో వెండి స్పూన్ లేదు. స్వయం కష్టం మీద సిరి మూటకట్టుకొన్నవాడు. ప్రతి రూపాయి వెనుకా శారీరక శ్రమ వుంది; మానసిక ఒత్తిడి వుంది. అది సహజం. జిల్లాలోని చాలా మంది శ్రీమంతుల కంటే ఆయన పెద్దవాడేమీ కాదు. సంపదకు విలువ కోట్ల లెక్క అయితే, ఆయన్ను మించినవారు లేకపోలేదు. కానీ సంపదకు నిజమైన విలువ ఏమిటో ప్రభాకర్‌రెడ్డి గ్రహించాడు. అర్థం చేసుకొన్నాడు. అందువల్లనే కాకుల గుంపులో కోకిల వలె ప్రత్యేకంగా కన్పడుతున్నాడు.

ప్రభాకర్‌రెడ్డి జిడ్డు కృష్ణమూర్తి స్థాపించిన రిషి వ్యాలీ స్కూల్ విద్యార్థి. పసి మనసులోనే తత్వ చింతనకు బీజాలు వేసే ఉత్తమ విద్యా సంస్థ అది. ఆ ప్రభావం ప్రభాకర్‌రెడ్డి జీవనశైలి మీద ప్రగాఢంగా వుంది. తన సంపద, తన ప్రతిభ సమాజానికి ఏ రకంగా ఉపకరిస్తుంది అన్న ఆలోచనకు ప్రేరణ ఆ పాఠశాల చదువే. ఆయన చాలా దానాలే చేశాడు. ధర్మ కార్యాలు నిర్వర్తించాడు. ఆ జాబితా పెద్దది. కానీ వాటన్నిటికీ తలమానికం – మద్రాసు నగరంలోని స్పాస్టిక్ సొసైటీ నిర్వహణలో పాలు పంచుకోవడం.

స్పాస్టిక్ సొసైటీ అంటే, మానసిక ఎదుగుదల సరిగాలేని పిల్లలను అక్కున చేర్చుకొని, వారి జీవితాలకు కాసింత ఉపశమనం కల్పించే స్వచ్ఛంద సేవా సంస్థ. మానసిక ఎదుగుదల లేని పిల్లలు శారీరకంగా బలహీనులౌతారు. తమ పనులు కూడా తాము చేసుకోలేరు. వారి శరీర అవయవాలు సరిగా పని చేయవు. అటువంటి పిల్లలు కల్గిన తల్లితండ్రులు అనుభవించే మనోవేదన వూహకు అందనిది. వారి పోషణ మహా కష్టం. అటువంటి అభాగ్య జీవులను ఆదరించి, ప్రేమను పంచి పెట్టడంలో తమిళనాడు స్పాస్టిక్ సొసైటీకి ఎంతో మంతి పేరు వుంది. ప్రభాకర్‌రెడ్డి ఆ సంస్థతో అనుబంధం పెంచుకొన్నాడు. స్వార్థం లేని సేవా భావనతో, తన ఖాళీ సమయాన్ని దీన మానవ సేవకు వినియోగిస్తున్నాడు. ఆయనలోని నిస్వార్థ సేవా భావం చూసి తమిళనాడు స్పాస్టిక్ సొసైటీ ఆయన్ను తమ సంస్థ కార్యదర్శిగా ఎంపిక చేసుకొన్నది.

మనఃస్ఫూర్తిగా పని!

మనసుకు తోచిన మంచి పనికి పది రూపాయల విరాళం ఇచ్చి సరిపెట్టుకోవడం వేరు. ఆ మంచి పనిలో పూర్తిగా నిమగ్నం కావడం వేరు. ప్రభాకర్‌రెడ్డి, స్పాస్టిక్ సొసైటీ విషయంలో ఈ రెండవ మార్గం ఎంచుకొన్నాడు. దానం చేయడం ధర్మ కార్యం. ఆ దానం వల్ల కోరుకొనే ఫలితాన్ని సాధించడం కోసం నిమగ్నం కావడం ధర్మకర్తృత్వం. ప్రచారం కోసమైతే, అటువంటి సంస్థలకు విరాళం ఇచ్చి, ఫోటోలు పత్రికలలో వేసుకోవచ్చు. కానీ అభాగ్యులైన పిల్లల సేవలో ప్రత్యక్షంగా పాలు పంచుకోవడానికి ఎంతో పెద్ద మనసు కావాలి. స్పందించే మనసు వుంటే హృదయం ప్రేమమయం అవుతుందని నిరూపించాడు. ప్రభాకర్‌రెడ్డి. ఆ కోణం నుంచి చూస్తే ఆయన్ను ఎవరైనా అభినందించక తప్పదు.

ప్రభాకర్‌రెడ్డి వ్యాపార ప్రస్థానం పరిమిత స్థాయిలో మొదలైనది. నెల్లూరు జిల్లా కాంట్రాక్టర్లకు పెట్టింది పేరు. హిమాలయాలకు వెళ్లినా నెల్లూరు కాంట్రాక్టర్ కనపడతాడు. అయితే ప్రభాకర్‌రెడ్డి కాంట్రాక్టర్‌గానే వ్యాపారం మొదలు పెట్టినా, అందరు నడిచే దారిలో కాక, కొత్త బాట ఎంచుకొన్నాడు. బొగ్గు గనులలో పనులు ప్రారంభించాడు. అప్పట్లో గనుల కాంట్రాక్టులు మన వారికి తెలియని విషయం. అదే ఆయనకు అదృష్టంగా మారింది. చేసే పనిలో చిత్తశుద్ధి, అంకిత భావం కల్గినవాడు కాబట్టి, ఆ రంగంలో అనూహిత వ్యాపార విజయాలు సాధించాడు. ఆ రంగంలో పోటీ పెరిగి పోవడాన్ని ముందుగానే గ్రహించి, ఎవరూ వూహకూడా చేయని పశ్చిమ ఆఫ్రికా దేశాలలో వ్యాపార అవకాశాలు వెతుక్కొంటూ వెళ్లిపోయాడు ప్రభాకర్‌రెడ్డి. ఆయన వ్యాపారాన్ని అనూహిత మలుపులు తిప్పింది ఆ నిర్ణయం. పరాయి దేశంలో లాభాల పంట పండించుకొన్నాడు. దాని ఫలితంగా ఎంతో మంది నెల్లూరు యువకులకు విశేషమైన ఉపాధి అవకాశం లభించింది. ఇప్పుడాయన కంపెనీలో 2వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. కార్పొరేట్ సంస్థగా కాకుండా, వ్యక్తిగత యాజమాన్యంలో వున్న ఒక కాంట్రాక్టర్ కంపెనీ ఇన్ని వేల మందికి ఉపాధి కల్పించడం దేశంలోనే ప్రథమం.

భారీ యంత్ర పరికరాలు తయారు చేసే ప్రముఖ ఐరోపా కంపెనీ వోల్వో ప్రభాకర్‌రెడ్డి ప్రతిభను గుర్తించి, తమ వార్షిక క్యాలెండర్‌లో ఆయన బయోగ్రఫీ ప్రచురించింది. అరుదుగా లభించే గౌరవం ఇది. ఇక్కడొక తమాషా ఏమిటంటే, ఆ క్యాలెండర్ కోసం తీసిన ఫోటోలో, ప్రభాకర్‌రెడ్డి తడికలతో కట్టిన చిన్న పూరి గుడిసెలో కూర్చొని వున్నాడు. అది ఆయన కంపెనీ క్యాంప్ ఆఫీసు. వోల్వో కంపెనీ క్యాలెండర్ ఫోటో అంటే ఎవరైనా సూటు, బూటు వేసుకొని, టిప్ టాప్‌గా తయారయ్యి, ఏ విదేశీ కారు పక్కనో నిలబడి ఫోజు ఇస్తారు. తను పని చేసుకొనే పూరి గుడిసెలో అత్యంత సాధారణంగా ఫోటో దిగాడంటే ప్రభాకర్‌రెడ్డి మానసం ఎంత పరిపక్వత చెందిందో అర్థం చేసుకోవచ్చు.

ధర్మదాత

ప్రభాకర్‌రెడ్డి ధర్మ కార్యాలు నెల్లూరు జిల్లాలో చాలానే వున్నాయి. పెన్న ఒడ్డున నిర్మించిన అధునాత రోటరీ క్లబ్ వారి స్మశానానికి భూరి విరాళం వాటిలో ఒకటి. జయభారత్ ఆస్పత్రిలో 15లక్షలు ఇచ్చి అధునాతన వైద్య పరికరాలు అందజేశాడు. వాత్సల్య అనాథ



శరణాలయానికి అతి పెద్ద దాత ఆయనే. కొండాయపాళెం గేట్ దగ్గరున్న బాలుర హాస్టల్‌కు అన్ని సౌకర్యాలు అమర్చాడు. అందుకోసం దానికి ఆయన పేరు పెట్టారు. ఒక సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు దాతల పేరు పెట్టడం రాష్ట్రంలోనే ఇదే ప్రథమం. నెల్లూరు జిల్లా జైలులో ఫ్యాన్లు, టీవీలు, అన్నం తినే కంచాలు వంటి వాటిని విరాళంగా ఇచ్చాడు. ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఒక క్రీడా భవనం నిర్మించడానికి 10లక్షలు ఇచ్చాడు. స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో కృత్రిమ అవయవాల కేంద్రానికి విరాళం ఇచ్చాడు. ప్రతి సంవత్సరం దాదాపు 10 లక్షలు ఖర్చు పెట్టి పేద పిల్లలకు కావలసిన పుస్తకాలు, ఇతర సామగ్రి ఉచితంగా అందజేస్తూ వుంటాడు. మరొకపది లక్షలు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ రూపంలో అందజేసి, వారు చదువులు కొనసాగేందుకు సహాయ పడుతున్నాడు. రామ్మూర్తి నగర్‌లోని గంజిఖానా మునిసిపల్ పాఠశాలకు కొత్త భవనం కట్టించి ఇచ్చాడు.

ఇవి కాక, ఆపద అనో, అవసరం అనో తనను అడిగిన వారెవరికీ లేదు, కాదు అనకుండా సహాయం చేయడం ప్రభాకర్‌రెడ్డి గొప్పదనం. ఆయన ఆర్థిక సహాయంతో ఎంతో మంది చిరు వ్యాపారులు ఉన్నతికి వచ్చారు. పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు ఆపద గట్టెక్కారు. పరోపకారం ప్రభాకర్‌రెడ్డిలోని ఒక గొప్ప సుగుణం. దాన్ని సమాజ సేవకు మరింత సమర్థంగా వినియోగించాలని, అందుకు భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు అందించాలని కోరుకొంటున్నాము.



● సమాజ సేవకుడు

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి!

సమాజం మనకేం చేసిందని కాకుండా సమాజానికి మనం ఏమి చేశామని ఆలోచించేవాళ్లు అతి కొద్ది మంది వుంటారు. అలాంటి వారిలో ముందు వరుసలో వుండే వ్యక్తి ప్రముఖ కాంట్రాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వ్యాపారాల్లో ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి వుండడమేకాక ఆపన్నులను ఆదుకోవడంలోనూ అంతే దాతృత్వం ప్రదర్శించే వ్యక్తి. అది విద్యా రంగమైనా, కళా రంగమైనా, ఆధ్యాత్మిక రంగమైనా, క్రీడా రంగమైనా సహాయం చేయడమే తప్ప కాదు లేదు అనడం తెలియని సేవా తత్పరుడు, వినయ సంపన్నుడు ప్రభాకర్‌రెడ్డి. చేతికి ఎముకలేని విధంగా, దాతృత్వాన్ని చూపుతూ ఎందరో అభాగ్యులు, అనాధలకు అండదండలందిస్తూ తనకు తానే సాటి అని నిరూపించుకొంటున్నారాయన.

భక్తిభావం, క్రీడాభిమానం, కళారాధన, సేవా భావం కలగలసిన మానవతామూర్తి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. ఒక వ్యక్తిలో ఇన్ని సుగుణాలు మిళితమై వుండడం అరుదైన విషయం. వ్యాపారాల్లో తలమునకలై వుంటూనే ధార్మిక సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు, విద్యార్థులకు, కళాకారులకు, అనారోగ్యంతో బాధపడేవారికి, వికలాంగులకు ఇలా చెప్పుకొంటూపోతే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేసే సేవా కార్యక్రమాలు, చేసే గుప్త దానాలు లెక్కకు మించి వున్నాయి. కొన సాగుతూనే వున్నాయి.

విద్యాభివృద్ధికి సహకారం

విద్య ద్వారానే సమాజాభివృద్ధి జరుగుతుందని బలంగా నమ్మే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆర్థిక కారణాలతో చదవడానికి ఇబ్బందులు ఎదుర్కొనే విద్యార్థులను, ప్రతిభ వుండి పేదరికంతో విద్యనభ్యసించలేక పోతున్న విద్యార్థులను గుర్తించి వారికి ఆర్థిక తోడ్పాటునందించేందుకు ప్రతి సంవత్సరం ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహించి సహాయం అందిస్తున్నారు. కోవూరు మండలం గండవరం రామచంద్రాపురంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, శ్రీనివాసకాలనీలోగల ప్రాథమిక విద్యార్థులు 360 మందికి యూనిఫాంలు, మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే ప్లేట్లు, గ్లాసులను, స్కూలు బ్యాగులను పంపిణీ చేశారు. అలాగే కనుపర్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 500 మంది విద్యార్థులకు కిట్లను అందజేసి తన ఉదారతను చాటుకొన్నారు. గత కలెక్టర్ శ్రీధర్ ఏర్పాటు చేసిన సరస్వతి నిధికి విరాళాన్ని అందించారాయన.

ఖైదీలకు సహాయం

జీవితంలో క్షణికావేశంతోనో, మరే ఇతర కారణాలతో నేరం చేసి జైలు జీవితం గడిపే ఖైదీల సంక్షేమానికి ప్రభాకర్ రెడ్డి ఎంతో కృషి చేశారు. జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ప్రతి సంవత్సరం ఎన్నో సదుపాయాలు కల్పించేందుకు తన వంతు సహాయంచేస్తున్నారు. పరిశుభ్రమైన త్రాగునీటి కోసం వాటర్ ప్లాంటు, జైలు సిబ్బందికి ఉపకరించేందుకు ఏసిలు, జెరాక్స్ మిషన్లను, వాహనాలను సమకూర్చారు.

వ్యాధిగ్రస్తులకు ఆపన్న హస్తం!

చిన్నారులు, పెద్దలు అన్న తారతమ్యం లేకుండా ఎందరో పేదలు అనారోగ్యానికి గురై వైద్యం ఖరీదై చికిత్స చేయించుకోలేక కొట్టుమిట్టాడుతున్న వారి పరిస్థితి ఎవరినైనా జాలిగొలుపు తుంది. అలాంటి వారికి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించి మానవతకు చిరునామాగా నిలవడమేకాక పలువురికి ఆదర్శమూర్తిగా నిలిచాడు. ముఖ్యంగా చిన్న వయస్సులోనే గుండె జబ్బులతో బాధపడుతున్న వారిని ఆదుకొనేందుకు ఏర్పాటైన చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌కు భూరి విరాళాన్ని అందించి చిన్నారులకు కొత్త జీవితాన్ని ఇచ్చాడు. అలాగే లివర్ వ్యాధిగ్రస్తులకు వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం చేశారు. తల్లిదండ్రులకు దూరమైన పిల్లలను, అనాధలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న వాత్సల్య అనాధ శరణాలయానికి ఎన్నోసార్లు ఆర్థిక చేయూతనందించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న ఇలాంటి ఆర్థిక అండదండలు ఎనలేనివి.

హాస్టళ్ల అభివృద్ధికి...

హాస్టళ్లలో చదువుకొనే పేద విద్యార్థులు సరైన వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతుండడాన్ని గుర్తించిన వేమిరెడ్డి కొండాయపాళెం గేటు వద్ద గల సాంఘిక సంక్షేమ హాస్టల్ మరమ్మత్తులకు భూరి విరాళాన్ని అందించారు. రామ్మూర్తి నగర్‌లోని కర్నాలమిట్ట హైస్కూల్‌లోని విద్యార్థులకు అదనపు తరగతి గదులను నిర్మించి ఇచ్చారు. డికె మహిళా కళాశాలలో క్యాంటిన్ ఏర్పాటుకు కృషి చేశారు.

శ్రీవారి సేవలో...

కోట్లాది హిందువుల ఆరాధ్య దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధైన తిరుమలకు వచ్చే భక్తులు ప్రధానంగా ఎదుర్కొనే సమస్య వసతి. గదులు దొరక్క సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను దృష్టిలో వుంచుకొని తిరుమల కొండపై శ్రీవారి ఆలయ సమీపంలో వసతి గృహాన్ని నిర్మించారు. పేద మధ్య తరగతి వారికి వసతి సౌకర్యాలు కల్పించడంలో వున్న ఆనందం వెలకట్టలేనిదన్న సంతృప్తి వ్యక్తం చేశారు ప్రభాకర్‌రెడ్డి. తిరుమలలో శ్రీవారి సేవలో పునీతం కావడమేకాక నగరంలోని శ్రీకృష్ణ భక్తులకు నెలవైన ఇస్కాన్ మందిరానికి ఆయన చేసిన సహాయం, అందించిన ఆర్థిక సహకారం ఎంతో వుంది. ఇస్కాన్ ఆలయంలో సమావేశ మందిరాన్ని నిర్మించి ఇవ్వడమేకాక హిందువులు పరమ పూజ్యంగా భావించే గోవుల సంరక్షణకు అవసరమైన గోశాలను కట్టించి ఇవ్వడం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలో దాగి వున్న ఆధ్యాత్మిక భావనలను తెలియజేస్తోంది. అలాగే రామ్మూర్తినగర్ సాయిబాబా మందిరానికి భక్తుల తాకిడి అధికం. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఈ మందిరానికి బాబా దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యం కోసం తన తండ్రి వేమిరెడ్డి శివ కోటారెడ్డి జ్ఞాపకార్థం సిమెంటు రోడ్డు నిర్మించి ఇచ్చారు. ఆయన దాతృత్వానికి గుర్తుగా నగర పాలక సంస్థ ఆ రోడ్డుకు వేమిరెడ్డి శివకోటారెడ్డి అని ఆయన తండ్రి పేరే పెట్టింది.

క్రీడలకు ప్రోత్సాహం!

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి క్రీడాభిమాని. క్రీడల్లో ప్రతిభ కనపరచే క్రీడాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించడం, వారికి కావలసిన సదుపాయాలు, సౌకర్యాల కల్పనకు తన వంతు సహాయసహకారాలు అందించడంలోనూ ముందుంటారు. నగరంలోగల ఏసి సుబ్బారెడ్డి స్టేడియం అభివృద్ధికి క్రీడా ప్రాధికార సంస్థకు పెద్ద మొత్తంలో విరాళాన్ని అందించారు.

అన్న దానానికి చేయూత

అన్నం పరబ్రహ్మస్వరూపం. అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదంటారు. అందులోనూ దూర ప్రాంతాల నుంచి దైవ దర్శనానికి వచ్చే భక్తులకు కడుపునింపేందుకు, వారి ఆకలి తీర్చేందుకు పలు ఆలయాలు అన్న ప్రసాద వితరణ చేస్తున్నాయి. కాణిపాకంలో వెలసివుండే వినాయకుడి దర్శనానికి వచ్చే భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేస్తున్నారు. దీనిని దృష్టిలో వుంచుకొని భక్తులకు అన్నదానంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వుండేందుకు ప్రతి ఏటా మూడు లక్షల రూపాయలను విరాళంగా ఇవ్వనున్నట్లు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించడం ఆయన దానగుణానికి ఒక మచ్చుతునక. అలాగే ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నెల్లూరులో జరిగే జగన్నాధ రథయాత్ర కార్యక్రమానికి, ప్రసాద వితరణకు అయ్యే ఖర్చంతటినీ ఆయనే భరిస్తున్నారు.

ఆహ్వానము



VPR కన్వెన్షన్ సెంటర్

కనుపర్తిపాడు, నెల్లూరు రూరల్



సర్వ శుభకార్యాల తోరణం అధునాతన విశాల ప్రాంగణం

ఎంగేజ్‌మెంట్స్ । వెడ్డింగ్స్ । రిసెప్షన్స్ । బర్త్‌డేస్ । సెమినార్స్ । కాన్ఫరెన్సెస్ । ఫ్యామిలీ ఫంక్షన్స్ । గెట్ టు గెదర్స్



23-10-2013
సాయంత్రం 5 గంటలకు
సుప్రసిద్ధ డ్రమ్ మాస్టర్
శ్రీ శివమణి గారిచే
సుమధుర సంగీతలహరి
మరియు **"పాడుతా తీయగా"** విజేతలు
తేజస్విని, శివ, పరమేశ్వర్,
షణ్ముఖప్రియ, సుదీప్ లచే
సంగీత విభావరి

24-10-2013
సాయంత్రం 5 గంటలకు
నెల్లూరు ముద్దుబిడ్డ
సంగీత సామ్రాజ్యానికి
తియ్యని పదాలు, కమనీయ స్వరాలు



పద్మశ్రీ డాక్టర్ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం
శ్రీమతి యస్.పి.శైలజ
శ్రీ యస్.పి.చరణ్ గార్లచే
స్వర నీరాజనం

నెల్లూరు రూరల్, కనుపర్తిపాడు నందు అంతర్జాతీయ స్థాయిలో **నిర్మించబడిన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్**
ప్రారంభోత్సవం సందర్భంగా రెండు రోజులు జరుగనున్న సంగీత సాంస్కృతిక కార్యక్రమాలకు
సింహపురి సంగీత సాంస్కృతిక అభిమానులందరికీ
నా హృదయ పూర్వక ఆహ్వానం

మీ...
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కొత్తబంగారు లోకం...

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్!



"స్పష్టించు స్పష్టించు
ఎక్కడికో పైపైకి ఎగిరిపో
రంగుల రాగాల్లో
మనిషిగా ఎగిరిపో
లే... నీ పాదాల్ని నక్షత్ర మండలాల్లో పెట్టు

అనే అద్భుత అనుభూతి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరుకు కూత వేటు దూరంలోని కనుపర్తిపాడురోడ్డులో కట్టిన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కాలు పెట్టిన ప్రతి ఒక్కరికీ కల్గడంఖాయం.

ఆగ్రాలో తాజ్‌మహల్
ఢిల్లీలో కుతుబ్ మీనార్
హైదరాబాద్‌లో చార్మినార్‌ను

ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు. అదే విధమైన అద్భుత నిర్మాణం నెల్లూరులో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్. ఈ కన్వెన్షన్ సెంటర్‌లో ఎన్నో ప్రత్యేకతలను ఏర్పి కూర్చి మరీకట్టారు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.

అద్భుతమైన ఎలివేషన్

కనుపర్తిపాడు – గొలగమూడి రోడ్డులోనికి వెళ్లగానే అద్భుత మైన ఎలివేషన్‌తో కనపడే విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ ప్రధాన ద్వారాన్ని చూస్తే చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం లోనికి కాలిడిన భ్రాంతి కలుగుతుంది. అటువంటి అనుభూతి ఆహూతులకు కలిగేలా దీని నిర్మాణం చేపట్టారు. దక్షిణ భారతదేశంలోనే ఇటువంటి బాహ్య సౌందర్యం గల కన్వెన్షన్ సెంటర్ మరొకటిలేదని చెప్పేయవచ్చు.

అతి పెద్ద వేదిక

పెళ్లి కావచ్చు, పెద్ద సెమినార్ కావచ్చు. కార్పొరేట్ సమావేశం కావచ్చు. దానికో మంచి వేదిక ఉంటే దానికి వచ్చే ఆకర్షణను వర్ణించలేము. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 69×25 అడుగుల కొలతతో కట్టిన వేదిక అట్టే ఆకర్షిస్తుంది. ఈ వేదికపై అప్పటికప్పుడు ఎటువంటి అలంకరణ అయినా చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయబడడం విశేషం.

ఆకర్షించే హాలు!

రెండు వేల మంది అతిథులు అలవోకగా కూర్చుని కార్యక మం చూసేలా ప్రధాన హాల్‌లో ఏర్పాటుచేసిన వసతులు చూస్తే 'ఔరా' అనిపిస్తాయి. సెంట్రలైజ్డ్ ఎసి హాల్‌లో గోడలను చూస్తూ విస్తుబోతాము. దీనికి కారణం చైనా నుంచి తెచ్చి గోడలకు అతికించిన ప్రత్యేక వాల్ పేపర్‌తో హాల్ ద్విగుణీకృతంగా తయారయ్యింది. చూపు తిప్పనీయదంటే నమ్మండి.

లగ్జరీ ఫర్నీచర్!

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏ కార్యక్రమం ఎంత సేపు జరిగినా కూర్చున్న చోటు నుంచి లేవను మనసు ఒప్పుకోదు. కారణం చైనా నుంచి కొనుగోలు చేసిన ప్రత్యేక కుర్చీల్లోని మెత్తదనం మనల్ని మైమరపింపజేస్తుంది. ప్రత్యేక అతిథుల కోసం సిద్ధంచేసిన లగ్జరీ ఫర్నిచర్‌ను చూస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా కళ్లు జిగేల్ మంటాయి.

ఇంద్రలోకపు ప్రవేశ ద్వారం

కన్వెన్షన్ హాలులోని ప్రధాన ప్రవేశ ద్వారం ద్వారా లోపలికి కాలిడగానే కొత్త బంగారులోకం లోనికి వచ్చిన అనుభూతి కలిగేలా ఇంపోర్ట్ చేసిన షాండిలియర్స్ కాంతులు భ్రమ కల్గించచేస్తాయి. ఇక్కడే ప్రత్యేకంగా విదేశాల నుండి దిగుమతి చేసుకున్న టఫెండ్‌గ్లాస్‌తో నిర్మించిన అద్భుత నిర్మాణం, దానిలో పెరిగిన చెట్ల మాదిరి భ్రమ కల్గించే కృత్రిమ కొబ్బరి చెట్లు అబ్బుర పరుస్తాయి.

ఇటాలియన్ మార్బుల్

కన్వెన్షన్ సెంటర్‌లో కాలిడిన వారందరికీ తమ నడకలో రాజసం ఔవి ఉట్టిపడుతున్నట్లు అనుభూతికి లోనవుతారు. ఓమానియాబేజ్, డార్క్ ఎమరాల్డ్ రకాల ఇటాలియన్ మార్బుల్ పరచిన నేల దీనికి కారణమని చెప్పొచ్చు.

ఏ ఫంక్షన్ అయినా చేసుకోవచ్చు

కన్వెన్షన్ సెంటర్‌లో సందర్భాన్ని బట్టి ఏ వేదుక అయినా జరుపుకొనేందుకు వీలుగా వెయ్యి మంది అతిథులు హాయిగా కూర్చునే హాల్, 400 మంది వరకు అతిథులు హాజరయ్యే కార్యక్రమాలు జరుపుకొనేందుకు మరో రెండు ప్రత్యేక వేదికలున్నాయి. వీటిలోనూ సీటింగ్ ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది.

పచ్చిక బయళ్లు

పచ్చదనం పర్చిన లాన్‌లో పార్టీలు జరుపుకోవడం ఇప్పటివరకు సినిమాల్లో మాత్రమే చూసి ఉంటాం. విపిఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆ లోటు తీర్చను ఎకరా విస్తీర్ణంలో పచ్చిక బయలు ప్రాంతం సిద్ధంగా వుంది. దీనిలోనూ మనసుకు నచ్చిన వేదికలు జరుపుకోవచ్చు.

ఐదువేల మందికి ఒకేసారి భోజనం రెడీ!

ఎంత పెద్ద కార్యక్రమాన్ని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసినా ఒకేసారి ఐదు వేల మందికి వండి వార్చే ఫైవ్ స్టార్ వసతులున్న వంట గది సర్వహంగులతో సిద్ధంగా వుంది. జర్మనీ నుంచి దిగుమతి చేసుకొన్న వంట పాత్రలు చూసేందుకు అబ్బుర పరుస్తున్నాయి. ఇంత వంట వడ్డించను 15వేల చదరపు అడుగుల వైశాల్యంలో డైనింగ్ హాల్ కూడా ఇక్కడ సిద్ధంగా వుంది.

వేడుకలకు హాజరయ్యే అతిథులు, ఆత్మీయులు భోజనం చేశాక ఒకేసారి అరవై మంది చేతులు కడుగుకొనేందుకు 60 హ్యాండ్ షింక్స్ ఏర్పాటు చేశారు. ఈ షింక్స్ ప్రక్కనే ఏర్పాటుచేసిన పెద్ద పెద్ద అద్దాల ముందు మళ్లీ టిప్‌టాప్‌గా తయారవవచ్చు.

మనసును ఆహ్లాదపరిచే సంగీతం

కన్వెన్షన్ సెంటర్‌లో మనం ఏ మూల ఉన్నా మనసుకు హుషారెక్కించే వీనులవిందైన సంగీతం వినిపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడున్నంత సేపు అదేదో సంగీత ప్రపంచంలో ఓలలాడుతున్నామనే అనుభూతిలోనే ఉంటాం మనం.

వధూవరులకు ప్రత్యేక గదులు – అతిథులకు సూట్‌లు!

పెళ్లిళ్లు, ప్రత్యేక కార్యక్రమాలంటే వధూవరులు, అతిథులు మామూలు. వీరిని దూరంగా ఉంచలేం. దీనికోసం విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వధూవరులకు అబ్బురపరిచే డిజైనింగ్‌తో రెండేసి ఎసి గదులు, అతిథుల కోసం మరో పది ప్రత్యేక గదులు మొదటి అంతస్తులో ఏర్పాటుచేసి ఉన్నాయి. మొట్లు ఎక్కాల్సిన అవసరమే లేకుండా ప్రత్యేక లిఫ్ట్ వసతి కూడా కల్పించారు. ఈ గదుల్లో ప్రత్యేక కళానైపుణ్యపు కాంతులు వెదజల్లుతున్నాయి. ఈ గదుల్లో కాలిడిన వారు మైమరవడం ఖాయం.

పార్కింగ్ అదుర్స్

నెల్లూరులో పెళ్లిళ్లు, పేరంటాలు, ప్రత్యేక కార్యక్రమాలకు వాహనాల్లో వెళ్లిన వారికి పార్కింగ్ పెద్ద సమస్య. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 600 కార్లు, వేల ద్విచక్ర వాహనాలు అలవోకగా పార్కింగ్ చేసుకోను మూడు ఎకరాల విస్తీర్ణంలో విశాలమైన రోడ్లతో కూడిన ప్రత్యేక సౌకర్యం ఏర్పాటు చేయడం విశేషం.

మైమరపింపజేసే తోట

మల్లెపూలది జాబిలీ వాసన... రోజాలది మొగలాయిల వాసన అన్నట్లు ఆస్ట్రేలియా, ఢిల్లీల నుంచి తెప్పించిన క్రాకైటస్, ట్రోపీ వృక్షాలు కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేకంగా నాటారు. వీటిని చూస్తేనే మనసు మైమరుస్తుంది. సీతాకోక చిలుకలు రంగుల వీర కట్టినట్లు ఇక్కడ పెంచిన పూల తోట పది స్వర్గాల పరిష్వంగను గుర్తు చేస్తుంది.

ఉప సంహారం

మనుషులంతా ఒకటే కావచ్చు కానీ నేతాలన్నీ ఒకటే కావు. అన్ని నేత్రాలకు కనిపిస్తుంది వస్తుజాలం. కానీ కొన్నిటికే కనిపిస్తుంది అద్భుత సృష్టిజాల మన్నట్లు... చైత్ర మాసంలో పూచే జాజీ చమేలీ సుమాలన్నీ కోసి మన ముందు కుప్ప పోసినట్లు ఎన్నో ప్రత్యేకతలతో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రతిభా, శ్రమ రెండు పరస్పరాశ్రితమైన అద్భుత స్వాప్నికుడు. ఆయన్ను సింహపురి షాజహాన్ అనడం కూడా అతిశయోక్తి కాదు.



విశాలమైన పార్కింగ్.



ఫైవ్‌స్టార్ సౌకర్యాల కిచెన్.



ఆకట్టుకొనే డైనింగ్ హాల్.



కన్వెన్షన్ సెంటర్‌లోని ప్రధాన ద్వారం.



కన్వెన్షన్ సెంటర్‌లోని ప్రధాన వేదిక.



జిగేల్‌మనిపించే కుర్చీలు.



టఫెండ్ గ్లాస్‌తో అద్భుత నిర్మాణం



పచ్చదనం పరచుకొన్న లాన్.



పూల మొక్కల పొదరిల్లు.

వేమిరెడ్డికి ముఖ్యమంత్రి ప్రశంస



నెల్లూరులో మనసున్న మహారాజు వదాన్యుడు సేవా తత్పరుడు గుప్తదాత, విద్యాదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సేవా ప్రస్థానాన్ని తన పర్యటనలో సిఎం బహుదా ప్రశంసించారు

వదాన్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తాను చేయాలనుకొన్న సేవా కార్యక్రమాలకు ప్రచారం లేకుండా సాయం చేస్తుంటారు. నెల్లూరు మినీబైపాసురోడ్డులో వెనుకబడిన తరగతుల దైవం జ్యోతిరావు పూలే విగ్రహం ప్రక్కనే ఆయన సతీమణి సావిత్రి బాయి పూలే విగ్రహం ఏర్పాటుకు బిసి నేతలు నడుం బిగించారు. ఈ విగ్రహం ఏర్పాటుకు అయిన ఖర్చు మొత్తం ప్రభాకర్‌రెడ్డి భరించారు. దీన్ని ఈ ఏడాది ఏప్రెల్ మొదటి వారంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి తన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి సేవాతత్పరతను ముఖ్య మంత్రి కొనియాడుతూ డబ్బు సంపాదించడం గొప్ప కాదు. దానిని సద్వినియోగం చేయకల్గినవాడే గొప్పవాడు. దాన గుణం కంటే జన్మకు సార్థకత వుండదు. అది నిండుగా కల్గిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వంటి వారిని చూసి తతిమావారు నేర్చుకోవాలి. ప్రభాకర్‌రెడ్డి తన దానగుణాన్ని మరింత విస్తరించి, అభాగ్యుల సేవలో తరించాలని ప్రశంసించాడు ముఖ్యమంత్రి. అంతటితో ఊరుకోలేదు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఉచిత రీతిన సన్మానించారు.

కవిత

నెల్లూరు జన హృదయ విజేత!

నెల్లూరు నేల... గాలి... నీరు...
ప్రత్యేకతే వేరు...
ఎందరో మహానుభావులకు జన్మనిచ్చిందీ ఊరు
వీరిలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శైలే వేరు
కేవలం స్వశక్తితో పైకి వస్తారు కొందరు...
వారి దగ్గర అదృష్టాన్ని గూర్చి మాట్లాడడం అనవసరం
దీనికి నిలువెత్తు నిదర్శనం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
హృదయమే ఉత్తమ బోధకుడు...
కాలమే ఉత్తమ గురువు...
ప్రపంచమే ఉత్తమ గ్రంథం...
భగవంతుడే ఉత్తమ స్నేహితుడన్న మార్గంలో
మీరు చేసిన సేవా కార్యక్రమాలు
దాన ధర్మాలు, నిర్మాణాలకు వర్ణనలు చాలవు
వితరణ... మనోజ్ఞ సంభాషణ... ధీరత
ఔచిత జ్ఞానమనే మానవ సహజ గుణాలు
నేర్చుకొంటే అలవడేవి కావు.
జన్మతః వచ్చేవి
ఏమైతేనేం... సహృదయం, కరుణతో
నెల్లూరు ప్రజల హృదయ విజేతగా
నిలిచావు వేమిరెడ్డి... భళా!

– అల్లూరు రహీం.

● ప్రారంభం

శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవంతో!



నెల్లూరీయులు నిబిడాశ్చర్య పోయే రీతిలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కనుపర్తిపాడులో అత్యద్భుతంగా కట్టిన విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో తొలి కార్యక్రమంగా కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీశ్రీనివాసుని కళ్యాణ మహోత్సవం జర గనుంది. 19తేదీ సాయంత్రం ఐదు గం టలకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే ఈ కళ్యాణ మహోత్సవ ఈ కార్యక్రమానికి నెల్లూరీయులందరినీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆహ్వానిస్తున్నారు. అందరూ విచ్చేసి ఆ దేవదేవుని కృపా కటాక్షాలతోపాటు తీర్థప్రసాదాలు స్వీక రించమంటున్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

పాటకచ్చేరి!



నెల్లూరులో పుట్టి పెరిగిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటకచ్చేరి నెల్లూరీయులు విని చాలా రోజులయ్యింది. ఆ కొరత తీర్చనే ప్రభాకర్‌రెడ్డి 24తేది సాయంత్రం ఐదు గంటలకు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బాలసుబ్రహ్మణ్యం స్వరనీరాజనం కార్యక్రమం పెట్టారు. దీనిలో బాలసుబ్రహ్మణ్యంతోపాటు ఆయన సోదరి ఎస్పీ శైలజ, కుమారుడు ఎస్పీ చరణ్ కమ్మనైన గీతాలు ఆలపిస్తారు. అందరినీ అలరిస్తారు. పై రెండు కార్యక్రమాలకు కూడా నెల్లూరీయులంతా హాజరయ్యి తమను ప్రోత్సహించమంటున్నారు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఇక మనదే ఆలస్యం!



శివమణి...

పాడుతాతీయగా ఫేం పిల్లల సంగీతలహరి

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా 23, 24తేదీల్లో అద్భుత సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రభాకర్‌రెడ్డి ఏర్పాటు చేశారు. 23తేది సాయంత్రం ఐదు గంటలకు సుప్రసిద్ధ డ్రమ్స్ మాస్టర్ శివమణి సుమధుర సంగీత లహరి జరుగుతుంది. శివమణి డ్రమ్స్‌తో చేసే విన్యాసాలను ఆస్వాదించే తొలి అవకాశం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వల్ల మనకు కల్గిందనాలి. ఈ కార్యక్రమ అనంతరం ఈ టీవీలో పాడుతా తీయగా కార్యక్రమం ద్వారా ప్రఖ్యాతులైన తేజస్విని, శివ, పరమేశ్వర్, షణ్ముఖ ప్రియ, సుదీప్‌ల సంగీత విభావరి కూడా వుంటుంది. ఈ పిల్లలు ఎంత కమ్మగా పాడుతారో ప్రత్యేకంగా చెప్పబని లేదనుకొంటాం.

(SCAW) స్లీపింగ్ చిల్డ్రన్స్ అరౌండ్‌ది వరల్డ్ పథకానికి వేమిరెడ్డి చేయూత!

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సేవా ప్రస్థానం ఒక్క సింహపురికే పరిమితం కాలేదు. చెన్నైలోని అంబత్తూర్ రోటరీ క్లబ్‌లో ముఖ్య నిర్వాహకునిగా ఆయన చేపట్టిన స్లీపింగ్ చిల్డ్రన్స్ అరౌండ్ ది వరల్డ్ కార్యక్రమంతో విశ్వవ్యాప్త సేవకునిగా మారారు.



ప్రార్థించే పెదవుల కన్నా – సాయం చేసే చేతులు మిన్న
- మదర్ థెరిస్సా

సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎప్పుడూ ముందుంటారు. పేద ప్రజలకు అత్యవసర సమయంలో ఆర్థికంగానూ సహాయపడుతుంటారు. వ్యాపారాలు చేసి కోట్ల రూపాయలు సంపాదించిన వారంతా దానాలు చేయడం చాలా అరుదు. కానీ ప్రభాకర్‌రెడ్డి తరహా మాత్రం వేరు. ప్రముఖ పారిశ్రామికవేత్తగా పేరొంది దేశవ్యాప్తంగా కాంట్రాక్టు పనులు చేయడంలో నిత్యం బిజీగా వున్నప్పటికీ నెల్లూరుజిల్లా ప్రజలకు ఏ అవసరం వచ్చినా తన ఇంటికి వస్తే చాలు వారికి సాయం చేస్తుంటారు. స్లీపింగ్ చిల్డ్రన్ ఎరౌండ్ ది వరల్డ్ పథకం ప్రారంభించి దీని ద్వారా ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలబాలికలకు అవసరమైన సామగ్రిని అందిస్తుంటారు. అలాగే పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు గదులు నిర్మించడం, క్రీడాసామగ్రి, నోటు పుస్తకాలు, దుస్తుల సరఫరా చేస్తారు.

2009 సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాల బాలికలకు స్కూల్ కిట్‌లను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం అంబత్తూరులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడాన్ని గుర్తించిన ప్రభాకర్‌రెడ్డి నెల్లూరుజిల్లాలో కూడా ఆదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టాలని లక్ష్యంగా చేసుకొన్నారు. దేశ, విదేశాల్లో వున్న రోటరీ క్లబ్ సభ్యులను కలుపుకొని వారి సహకారంతో కార్యక్రమాలను చేస్తున్నారు ప్రభాకర్ రెడ్డి. 2009 సంవత్సరంలో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఆయన ఇప్పటివరకు 2650 మంది బాలబాలికలకు స్కూల్ కిట్స్ పంపిణీ చేయడం జరిగింది. 2009లో 400 మందికి, 2010లో 650 మందికి, 2011లో 600 మందికి, 2012లో 500 మందికి, 2013లో 500 మంది విద్యార్థులకు కిట్స్ అందించారు. విద్యార్థులకు పంపిణీ చేసిన స్కూల్ కిట్స్‌లో విద్యకు సంబంధించిన సామగ్రి వుంటుంది.

కిట్స్‌లో మ్యాట్రిస్, బెడ్‌షీట్స్ రెండు, దిండు, రగ్గు, భోజనం క్యారియర్, కార్పెట్, టవల్, మస్కిటో నెట్, దిండు కవరు, టర్కీ టవల్, నైట్ డ్రస్, స్కూల్ బ్యాగ్, నట్రాజ్ పెన్సిల్ బాక్స్, కలర్ పెన్సిల్ బాక్స్, ఎగ్జామినేషన్ ప్యాడ్, స్కేల్, స్వెట్టర్, యూనిఫాం వుంటాయి. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సొంత నిధులతో సమకూర్చుతారు. స్కూల్ కిట్స్‌ను విద్యార్థులకు అందించేందుకు ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విదేశాల్లో వున్న రోటరీ క్లబ్ సభ్యులను ఇక్కడకు తీసుకొచ్చి వారి చేత పంపిణీ చేయిస్తున్నారు. కార్యక్రమానికి హాజరైన విదేశీయుల ఖర్చులను ప్రభాకర్‌రెడ్డి భరించడంతోపాటు ఆ రోజు విద్యార్థులకు భోజన సదుపాయం కల్పిస్తుంటారు. ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆయన ఏ వేదిక మీదా ఉపన్యాసాలు చేయరు. చేతల రూపంలో చేయాలనుకున్నది చేసి చూపిస్తుంటారన్నది జిల్లాలో అందరికీ తెలిసిందే.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్నారాయన. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు విద్యకు సంబంధించి ఏ లోటు లేకుండా చేయాలన్న ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు బాగా చదువుకొనేందుకు ప్రభుత్వపరంగా పెద్దగా సహకారం అందడం లేదన్న విషయాన్ని గుర్తించి తన వంతు సాయంగా వారికి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంమీద స్లీపింగ్ చిల్డ్రన్స్ అరౌండ్ ది వరల్డ్ కార్యక్రమం ద్వారా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సేవా కార్యక్రమాలు విశ్వవ్యాప్తమయ్యాయనవచ్చు.













మూలస్థానేశ్వరుని సేవలో తరించిన వేమిరెడ్డి


ముఖద్వార నిర్మాణం

శివ శివ శంకర భక్తవ శంకర
శంభో హర హర నమో నమో

అంటూ నిత్యం శివనామ స్మరణలో ఉంటారు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ప్రభాకర్‌రెడ్డికి నెల్లూరు మూలపేటలోని మూలస్థానేశ్వర స్వామి అంటే ఎన లేని భక్తి. ఎప్పుడు నెల్లూరు వచ్చినా భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరుని దర్శనం చేసుకోకుండా ఉండరు. మూలస్థానేశ్వరుడు పలు అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన ప్రభాకర్‌రెడ్డి మూడో కంటికి తెలి యకుండా ఇక్కడ ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. శివాలయానికి ఆకర్ష ణగా మెయిన్ రోడ్డులో పది లక్షల రూపాయలు వెచ్చించి పెద్ద ఆర్చ్‌ను కట్టిం చారు. అంతటితో ఊరుకోలేదు. శివాలయంలో ధ్వజస్తంభం ఆధునీకరణ, శిల్ప కళా వైభవానికి తొమ్మిది లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. ఇక్కడే రాహుకేతు మండప నిర్మాణానికి 12.5 లక్షల రూపాయలు, వెండి నాగాభరణం సంప్రో క్షణకు 3.5 లక్షల రూపాయలు అలవోకగా ఖర్చు పెట్టారు.

శివుని కుమారుడు విఘ్నాలను దూరంచేసే వినాయకుని మండప నిర్మా ణం, అద్దాల అమరిక, ఆధునీకరణ పనులకు ఎనిమిది లక్షలా 50వేల రూపా యలు ఖర్చు పెట్టారు. ఇక ముందు కూడా శివాలయంలో ఎటువంటి అభి వృద్ధి పనులకు నిధులు కావాలన్నా తనవంతు తోడ్పాటు అందిస్తానంటున్నారు ప్రభాకర్‌రెడ్డి. అందరికీ దైవం సహాయం చేస్తుంటాడు. తన గుడిని ప్రభా కర్‌రెడ్డిలో సంకల్పం కల్పించి అందంగా మూలస్థానేశ్వరుడు ముస్తాబు చేసుకొ న్నాడనడం అతిశయోక్తి కాదు.


విఘ్నేశ్వరుని ఆలయ జీర్ణోద్ధరణ


ధ్వజ మండపానికి శిల్ప కళా సొబగులు


శివుని పూజలో వేమిరెడ్డి


రాహుకేతు సర్పపూజ మండపం


వెండి నాగాభరణం బహుకరణ


వెండి నాగాభరణానికి అభిషేకం